www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 9-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 40 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 6.21, విదియ తె. 4.18 వరకు; నక్షత్రం: కృత్తిక ఉ. 11.55 తదుపరి రోహిణి; వర్జ్యం: తె.3.09-4.41; దుర్ముహూర్తం: ఉ.10.04-10.55, మ.3.10-4.01; అమృతఘడియలు: ఉ.9.40-11.10; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.34 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



జూరాల ప్రాజెక్టులో ప్రస్తుత నీటి నిల్వ

నారాయణపూర్ నుంచి జూరాలకు నీరు

- 1.9 టీఎంసీలు విడుదల చేసిన కర్ణాటక
- ఫలించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నాలు
- 'మిషన్ భగీరథ'కు నీటి గండం తప్పినట్టే

గద్వాల, మే 8 : రాష్ట్రంలో తాగు నీటి అవసరాల కోసం నారాయణపూర్ డ్యామ్ నుంచి 1.9 టీఎంసీల నీటిని విడుదల చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు బుధవారం అర్ధరాత్రి నుంచి నారాయణపూర్ డ్యామ్ నుంచి నీటిని విడుదల చేస్తోంది. ఈ నీరు గురువారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు చేరుకునే అవకాశం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా జూరాలలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో పలు జిల్లాలకు తాగు నీటిని అందించే మిషన్ భగీరథ పథకానికి నీరు అందని పరిస్థితి నెలకొంది. మే 15వరకు మాత్రమే మిషన్ భగీరథ నీరు అందించే అవకాశం ఉందని అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సీఎస్ శాంతికుమారి, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కర్ణాటక ప్రభుత్వాన్ని సంప్రదించారు. తాగు నీటి అవసరాలు తీర్చాలని విన్నవించగా కర్ణాటక ప్రభుత్వం అంగీకరించింది. కాగా, 1.9టీఎంసీల నీటిని కర్ణాటక అధికారులు విడుదల చేసినా.. అందులో ఎంత నీరు జూరాలకు చేరుతుందన్నది అంతుపట్టడం లేదు. 2019లోనూ ఇదే తీరుగా వేసవిలో 2 టీఎంసీల నీళ్లు విడుదల చేయగా 1.5 టీఎంసీలే జూరాలకు చేరాయి. ఈసారి ఎండలు మండుతున్న కారణంగా కృష్ణా నదిలో నీళ్లు ఆవిరైపోయాయి. ఈ క్రమంలో 0.9 టీఎంసీల మేర నీళ్లు వృథాగా పోయినా ఒక టీఎంసీ ప్రాజెక్టులోకి చేరుతుందని జూరాల ఈఈ తెలిపారు. కొన్ని రోజుల పాటు మిషన్ భగీరథకు నీటి గండం తప్పినట్టేనని అధికారులు చెబుతున్నారు.

గొడ్డలితో అందరినీ నరికేయండి

- అప్పుడు మీరొక్కరే బరిలో ఉండొచ్చు
- జగన్ సతీమణి భారతిపై షర్మిల ధ్వజం



మోదీకి పంపించే రేడియోను చూపిస్తున్న షర్మిల

అమరావతి/కడప, మే 8(ఆంధ్రజ్యోతి): "కడప జిల్లాలో వైసీపీ సింగిల్ ప్లేయర్. మిగతా వారంతా నాన్ ప్లేయర్స్" అంటూ సీఎం జగన్ సతీమణి భారతిరెడ్డి ఓ యూట్యూబ్ చానల్‌లో చేసిన వ్యాఖ్యలపై పీసీసీ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కడప డీసీసీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. "వైసీపీ వాళ్లే అధికారంలో ఉండాలి, వారికి వ్యతిరేకంగా ఉన్న వారందరినీ గొడ్డళ్లతో నరకాలి. ఇదే భారతి స్ట్రాటజీ.. గొడ్డలితో అందరినీ నరికేయండి.. అప్పుడు మీరే సింగిల్ ప్లేయర్‌గా ఉంటారు' అని మండిపడ్డారు. ఓడిపోతే అరెస్టు ఖాయమని అవినాశ్‌రెడ్డికి భయం పట్టుకుందన్నారు. ఊరు దాటి విదేశాలకు పారిపోయేందుకు సిద్ధమవుతున్నారని ఎద్దేవా చేశారు. 'మీ ఎంపీని మీ జిల్లాలో కలవాలంటే రాజశేఖర్‌రెడ్డి బిడ్డకు ఓటు వేయండి, మీ ఎంపీని జైల్లో కలవాలంటే అవినాశ్‌కు ఓటు వేయండి' అని ప్రజలకు సూచించారు. 'దేవుడు మా వైపే ఉన్నాడని నమ్ముతున్నా. గొడ్డలితో నరికే వైసీపీ వైపు దేవుడు ఉండడన్న విశ్వాసం ఉంది' అని అన్నా రు. "పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రధాని మోదీ.. ఏపీ ప్రజలను తీవ్రంగా అవమానించారు. అందుకే ఏపీ ప్రజల మన్‌కీబాత్ వినాలంటూ రేడియో పంపిస్తున్నా' అని షర్మిల అన్నారు.

ఏబీవీ సస్పెన్షన్ కొట్టివేత

వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్న క్యాట్..బకాయిలతో జీతభత్యాలు చెల్లించాలని ఆదేశం

- వైసీపీ ప్రభుత్వ ఉత్తర్వులు అక్రమమని తీర్పు
- సీనియర్ ఐపీఎస్ అధికారికి భారీ ఊరట



హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): సీనియర్ ఐపీఎస్, అదనపు డీజీ ఏబీ వెంకటేశ్వరరావుకు హైదరాబాద్‌లోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) లో భారీ ఊరట లభించింది. ఆయనపై రెండోసారి సస్పెన్షన్ విధిస్తూ వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అక్రమమని పేర్కొంటూ వాటిని కొట్టేసింది. ఆయనను వెంటనే సర్వీసులోకి తీసుకోవడంతోపాటు బకాయిలతోసహా జీతభత్యాలు చెల్లించాలని ఆదేశించింది. ఈ మేరకు బుధవారం తీర్పు వెలువరించింది. ఒకేరకమైన ఆరోపణలతో రెండోసారి సస్పెండ్ చేయడం చెల్లదని.. ఏపీ ప్రభుత్వం జారీచేసిన సస్పెన్షన్ ఉత్తర్వులను కొట్టేయాలని కోరుతూ ఏబీ వెంకటేశ్వరరావు క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ఆదినారాయణరావు వాదనలు వినిపిస్తూ.. రక్షణ పరికరాల కొనుగోళ్లలో అవినీతి అంటూ 2020 ఫిబ్రవరి 8న ఏపీ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ విధించిందన్నారు. అంతకు ముందు జగన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 8 నెలల పాటు వేతనం, పోస్టింగ్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేశారని తెలిపారు. 33 ఏళ్లపాటు మచ్చలేని ఉద్యోగ జీవితంలో మొదటిసారి అవినీతి ఆరోపణలు సృష్టించి సస్పెండ్ చేశారని, ఈ సస్పెన్షన్ అక్రమమని ఏపీ హైకోర్టు కొట్టేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సైతం పిటిషనర్‌కే అనుకూలంగా తీర్పు ఇచ్చిందని.. ఆయన సస్పెన్షన్ చెల్లదని 2022 ఏప్రిల్ 22న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన రెండు నెలలకు (జూన్ 14న) ప్రాధాన్యం లేని పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. ఆ తర్వాత కేవలం 14 రోజుల్లోనే మళ్లీ రెండోసారి సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఈసారి అఖిలభారత సర్వీసుల్లోని రూల్ 3(3) ను సాకుగా చూపారని పేర్కొన్నారు. 'ఏపీ ప్రభుత్వ అనైతిక విధానాలపైనా, రెండోసారి సస్పెన్షన్‌పైనా మళ్లీ క్యాట్‌లో పిటిషన్ దాఖలు చేశాం. సస్పెన్షన్ చట్టవిరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత మళ్లీ అవే ఆరోపణలతో రెండోసారి సస్పెండ్ చేయడం చెల్లదు. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన లిఖితపూర్వక వాదనల్లో వాస్తవ విరుద్ధమైన విషయాలు, తప్పుడు ఆరోపణలు ఉన్నాయి. అఖిలభారత అధికారుల సర్వీస్ రూల్స్ ప్రకారం ఒక అధికారిపై ఉన్న సస్పెన్షన్‌ను ఎప్పటికప్పుడు అధికారుల కమిటీ రివ్యూ చేయాలి. సర్వీస్ రూల్స్‌లో పేర్కొన్న ప్రకారం రివ్యూ చేయలేదు కాబట్టి ఆ సస్పెన్షన్ చెల్లదు' అని అన్నారు. ఏపీ ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరాం వాదనలు వినిపిస్తూ.. 'ఏబీ వెంకటేశ్వరరావు సుప్రీంకోర్టు తీర్పు తర్వాత విధుల్లో చేరే ముందు ప్రెస్‌మీట్ పెట్టి బెదిరించేలా మాట్లాడారు. దర్యాప్తును ప్రభావితం చేసే విధంగా వ్యవహరించారు. క్రిమినల్ కేసులో నిందితుడిగా ఉన్న పిటిషనర్‌పై దర్యాప్తు ముగిసే వరకు సస్పెన్షన్‌లో ఉంచే అధికారం ఉంది. మొదటిసారి రూల్ 3(1) కింద.. రెండోసారి రూల్ 3(3) కింద సస్పెండ్ చేశాం. వేర్వేరు ఆరోపణలు ఉన్నందునే సస్పెండ్ చేశాం' అని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న క్యాట్.. ఏప్రిల్ 29న తీర్పును రిజర్వు చేసి.. బుధవారం తుది తీర్పు వెలువరించింది.

నేటి నుంచి ఇంటర్ ప్రవేశాలు

- జూన్ 1 నుంచి కాలేజీలు షురూ: ఇంటర్ బోర్డు కార్యదర్శి

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంటర్మీడియట్ కళాశాలల్లో గురువారం నుంచి ప్రవేశాలు ప్రారంభం కానున్నాయి. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ జూనియర్ కాలేజీలు; సాంఘిక సంక్షేమ, గిరిజన, మైనారిటీ గురుకులాలు, మోడల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభమవుతాయి. ఇప్పటికే పదోతరగతి ఫలితాలు ప్రకటించినందున మార్కుల మెమో, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ) ఆధారంగా కాలేజీల ప్రిన్సిపాళ్లు ప్రవేశాలు చేసుకోవాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రుతి ఓజా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశాల దరఖాస్తుల జారీ, స్వీకరణ గురువారం నుంచే ప్రారంభించాలన్నారు. ఇంటర్ బోర్డు అనుమతి తీసుకున్న సీట్ల కంటే ఎక్కువ ప్రవేశాలు తీసుకున్న ప్రైవేటు కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హెచ్చరించారు. అన్ని కాలేజీలు మొత్తం కోర్సులు, సీట్ల సంఖ్య, భర్తీ అయినవి, మిగిలిన సీట్ల వివరాలను రోజూ నోటీసు బోర్డులో ప్రకటించాలని స్పష్టం చేశారు. ఇంటర్ ప్రవేశాలకు సంబంధించి ప్రకటనలు చేయడం, ప్రవేశాల కోసం ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించడం చట్టవిరుద్ధమని, ఉల్లంఘించిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని కార్యదర్శి హెచ్చరించారు. తొలి విడత ప్రవేశాల ప్రక్రియ ఈ నెల 31 వరకు కొనసాగుతుందని, జూన్ 1 నుంచి కళాశాలలు పునఃప్రారంభమవుతాయని కార్యదర్శి వెల్లడించారు.

మేడిగడ్డ మరమ్మతులపై ఉన్నతస్థాయి కమిటీ

- ఏర్పాటుకు నీటిపారుదల శాఖ నిర్ణయం
- డీఎస్ఆర్‌పీ సభ్యులు, ఇతర అధికారులతో కమిటీ

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) నిపుణుల కమిటీ మధ్యంతర నివేదిక ఇచ్చిన నేపథ్యంలో తదుపరి చర్యలకు నీటిపారుదల శాఖ ఉపక్రమించింది. ఎన్‌డీఎస్ఏ కమిటీ సిఫారసులతో బ్యారేజీల మరమ్మతులకు తీసుకోవాల్సిన చర్యలపై ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీనికోసం డ్యామ్‌సేఫ్టీ చట్టం ప్రకారం రాష్ట్రంలో వేసిన డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్(డీఎస్ఆర్‌పీ) సభ్యులతోపాటు ఇతర అధికారులతో కమిటీని వేయనున్నారు. వానాకాలంలోపే మరమ్మతులు చేయాలని నిర్దేశించడంతోపాటు ఏం చేయాలనే దానిపై ఈ కమిటీ నిర్ణయం తీసుకోనుంది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు వచ్చే వర్షాకాలం ప్రారంభానికి ముందే అత్యవసరంగా చేపట్టాల్సిన తాత్కాలిక మరమ్మతులు, తదుపరి అధ్యయనాలను సిఫారసు చేస్తూ అయ్యర్ కమిటీ ఈ నెల 1న రాష్ట్ర నీటిపారుదల శాఖకు మధ్యంతర నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే.

స్కౌట్స్ అండ్ గైడ్స్ చీఫ్ కమిషన్ పదవి నుంచి కవిత ఔట్!

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కామ్ కేసులో జైలులో ఉంటూ విచారణ ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మరో షాక్ తగిలింది. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ చీఫ్ కమిషనర్‌గా కవితను తొలగిస్తూ ఆ సంస్థ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



జ్ఞాపకాలే చిత్రాలై దారి చూపాయి

- నాలుగేళ్ల ప్రాయంలో కిడ్నాపైన బాలుడు పదేళ్ల తర్వాత తండ్రి చెంతకు
- ఫలించిన స్వచ్ఛంద సంస్థ ప్రయత్నం
- డ్రాయింగ్ థెరపీతో కుటుంబానికి చేరువ



తండ్రి సుబ్బయ్యతో ప్రణయ్

భువనగిరి టౌన్, మే 8: నాలుగేళ్ల ప్రాయంలో గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో అపహరణకు గురైన ఓ బాలుడి మదిలోని జ్ఞాపకాలే పదేళ్ల తర్వాత అతన్ని కన్నతండ్రి దగ్గరకు చేర్చాయి. తన చిన్ననాటి జ్ఞాపకాలను వివరిస్తూ ఆ బాలుడు వేసిన డ్రాయింగ్స్ ఆధారంగా ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అతడిని సొంతగూటికి చేర్చారు. ఏపీలోని విజయవాడలో కిడ్నాపై పదేళ్లు అనాథగా పెరిగిన ప్రణయ్ అనే బాలుడి కథ ఇది. 2014 జూన్ 21న భువనగిరి మండలం ఆలేరు శివారులో కిడ్నాపర్లను విచారించిన పోలీసులు ఆ ముఠాలో 11 మంది సభ్యులున్నారని, వారు ఏడుగురు పిల్లలను కిడ్నాప్ చేసి విక్రయించారని గుర్తించారు. ఆ ఏడుగురిలో ఐదుగురిని కన్నవారి చెంతకు చేర్చిన పోలీసులు ఇద్దరి గురించి తెలుసుకోలేకపోయారు. దీంతో ఆ పిల్లలను నల్లగొండలోని శిశు గృహకు తరలించిన అధికారులు.. జిల్లాల పునర్విభజన తర్వాత వారిని ఆలేరు మండలం మంతపురిలో ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న బ్యాక్ టూ బ్యాక్ సంరక్షణ కేంద్రంలో చేర్చారు. ఆ పిల్లలకు ప్రణయ్, సాత్విక్ అనే పేర్లు పెట్టారు. ఆ పిల్లలను కన్నవారి చెంతకు చేర్చాలని బ్యాక్ టు బ్యాక్ శరణాలయం డైరెక్టర్ అభిలాష కర్నాటి, మేనేజర్ బూర్ల సంపత్ తీవ్ర ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రణయ్.. తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకుంటూ తమది చింతపల్లి గ్రామమని, తండ్రి పేరు సుబ్బయ్య అని వారికి చెప్పాడు. దీంతో చింతపల్లి పేరుతో ఉన్న గ్రామాలకు ప్రణయ్‌ను తీసుకెళ్లి అతని కుటుంబం ఆచూకీ కోసం ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో డ్రాయింగ్ థెరపీతో జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ప్రణయ్ కొన్ని బొమ్మలు గీశాడు. తన తండ్రి వీధుల్లో చెత్త సేకరిస్తాడని, పొడవాటి రిక్షా ఉండేదని, తరచూ సముద్రపు ఒడ్డుకు తీసుకెళ్లేవాడని ఆ బొమ్మల్లో తెలిపాడు. వాటి ఆధారంగా ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా మోరి మండలం చింతలమోరి గ్రామానికి గతేడాది జూలై 24న ప్రణయ్‌ను తీసుకెళ్లారు. అక్కడ ప్రణయ్ తన తండ్రి సుబ్బయ్యను వెంటనే గుర్తించగా, అతను మాత్రం కాస్త ఆలస్యంగా కొడుకును అక్కున చేర్చుకున్నాడు. ప్రణయ్ తల్లి లక్ష్మి మరణించగా సుబ్బయ్య మరో వివాహం చేసుకున్నాడు. ఇక, బ్యాక్ టూ బ్యాక్ ప్రతినిధులు సుబ్బయ్యను విచారించగా.. 2014లో విజయవాడలో ప్రణయ్ తప్పిపోయాడని తెలిపారు. పూర్తి విచారణ చేసిన స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, బాలల పరిరక్షణ విభాగం అధికారులు ప్రణయ్‌ది చింతలమోరి గ్రామమేనని నిర్ధారించారు. ఈమేరకు ప్రణయ్‌ను బుధవారం భువనగిరిలోని సీడబ్ల్యూసీ ఎదుట హాజరుపరిచారు. వైద్య పరీక్షల అనంతరం ప్రణయ్‌ను కన్నతండ్రికి అప్పగిస్తామని అధికారులు వెల్లడించారు.

విదేశాలకు వైఎస్ జగన్!

- నాంపల్లి సీబీఐ కోర్టు అనుమతి కోరిన ఏపీ సీఎం
- కౌంటర్ వేయాలని దర్యాప్తు సంస్థకు న్యాయస్థానం ఆదేశం.. విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్/అమరావతి, మే 8 (ఆంధ్రజ్యోతి): ఏపీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 13న ముగియనున్న నేపథ్యంలో సీఎం జగన్మోహన్ రెడ్డి విదేశీ పర్యటన ప్రణాళిక బయటకు రావడం చర్చనీయాంశంగా మారింది. ఆయన అక్రమాస్తుల కేసులకు సంబంధించిన బెయిల్ షరతుల్లో సీబీఐ కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదన్న నిషేధం ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 17 నుంచి జూన్ 1 వరకు విదేశాలకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ జగన్ ఈ నెల 6న జగన్ నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై ఆ కోర్టు ప్రధాన న్యాయాధికారి విచారణ చేపట్టారు. జగన్ తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ.. కుటుంబ పర్యటన నిమిత్తం ఇంగ్లండ్ (లండన్), స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ తదితర దేశాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని.. దేశం విడిచి వెళ్లరాదన్న బెయిల్ షరతులు సడలించాలని కోరారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేశారు.

'గౌరవెల్లి' వద్ద పనిచేయని కెమెరాలు

- చర్యలు తీసుకోండి: తెలంగాణకు జీఆర్ఎంబీ లేఖ

గౌరవెల్లి రిజర్వాయర్ వద్ద సీసీ టీవీ కెమెరాలు పనిచేయడం లేదని, జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తీర్పు ప్రకారం తక్షణమే వాటిని సరి చేయాలని గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) తెలంగాణను కోరింది. ఈ మేరకు బుధవారం బోర్డు సభ్య కార్యదర్శి అజగేషన్ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ (కరీంనగర్)కు లేఖ రాశారు. పర్యావరణ అనుమతులు తీసుకోకుండా గౌరవెల్లి పనులు చేస్తున్నారని దాఖలైన పిటిషన్‌పై ఆదేశాలిస్తూ గౌరవెల్లి వద్ద పనులు చేస్తున్నారా? లేదా? తెలుసుకోవడానికి వీలుగా సీసీ టీవీ కెమెరాలు పెట్టాలని ఎన్జీటీ ఆదేశించింది. దీనిపై పర్యవేక్షణ బాధ్యతను గోదావరి బోర్డుకు అప్పగించిన విషయం విదితమే. ఎన్జీటీ ఆదేశాలతో ఏర్పాటు చేసిన కెమెరాల నుంచి కొన్ని నెలలుగా సమాచారం రావడం లేదని, అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బోర్డు తాజా లేఖలో కోరింది. తదుపరి కేసు విచారణ జూలై 4న ఉన్నందున తక్షణం చర్యలు తీసుకొని, డేటాను బోర్డుకు అందించాలని నిర్దేశించింది.

ఇక్కడ ప్రాక్టీస్ చేస్తేనే రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసెస్‌కు అర్హులు: హైకోర్టు

తెలంగాణ పరిధిలోని కోర్టుల్లో ప్రాక్టీస్ చేసే న్యాయవాదులే.. రాష్ట్ర జ్యుడీషియల్ సర్వీసెస్ (సివిల్ జడ్జి-జూనియర్ డివిజన్) పోస్టులకు అర్హులని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు స్టేట్ జ్యుడీషియల్ సర్వీసెస్ రూల్స్-2023ను సమర్థిస్తూ ఇటీవల ఆదేశాలు వెలువరించింది. తెలంగాణ స్టేట్ జ్యుడీషియల్ సర్వీసెస్‌లోని రూల్ 2 (కే), రూల్ 5.2 (ఏ) చట్ట విరుద్ధంగా ఉన్నాయని.. వాటిని కొట్టేయాలని పలువురు అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. తెలంగాణ జ్యుడీషియల్ సర్వీసెస్ రూల్స్‌ను సమర్థిస్తూ పిటిషన్లను కొట్టేసింది.

ఆందోళన వద్దు.. తడిసిన ధాన్యం కొంటాం

- పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

మల్యాల, మే 8: రైతులు ఆందోళన చెందవద్దని.. అకాల వర్షాలతో తడిసిన ప్రతీ ధాన్యపు గింజను మద్దతు ధరకే కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టం చేశారు. బుధవారం జగిత్యాల జిల్లాలోని మల్యాల మండల కేంద్రంతో పాటు రామన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయరనే అనుమానాలు వద్దని.. రైతులకు నష్టం జరగకుండా చూస్తామని తెలిపారు. తరుగు పేరిట అదనంగా ధాన్యం తూకం వేస్తున్నారని రైతులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా.. బస్తాకు 40 కిలోల 600 గ్రాములకన్నా ఎక్కువ తూకం వేయకూడదని నిర్వాహకులకు సూచించారు. ఈ విషయంలో మిల్లర్లకూ ఆదేశాలిస్తామన్నారు. ధాన్యం తరలించడానికి లారీల కొరత ఉందని నిర్వాహకులు తెలపగా పౌరసరఫరాల అధికారులను సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించడంతో.. నిర్మల్ మాజీ కలెక్టర్‌కు నెల రోజుల జైలు శిక్ష

- మునిసిపల్ కమిషనర్‌కు 15 రోజులు



ముషారఫ్ అలీ

నిర్మల్, మే 8 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులను ధిక్కరించడంతో నిర్మల్ మాజీ కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీకి రాష్ట్ర హైకోర్టు నెల రోజులపాటు జైలుశిక్షను విధించింది. మునిసిపల్ కమిషనర్‌కు 15 రోజుల శిక్ష వేసింది. నిర్మల్ మునిసిపాలిటీలో 44 మంది ఉద్యోగుల నియామకాలు, వేతనాల చెల్లింపునకు సంబంధించి ముషారఫ్ అలీ ఫారూఖీ కోర్టు ఉత్తర్వులను ధిక్కరించారన్న అభియోగాలపై హైకోర్టు జడ్జి మాధవీ దేవి విచారణ జరిపి ఈ తీర్పును వెలువరించారు. మునిసిపల్ ఉద్యోగి సయ్యద్ శాకీర్ హైమద్ ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేశారు. మునిసిపల్ ఉద్యోగాలు పొందిన 44 మంది ఉద్యోగులకు వేతనాలను చెల్లించాలంటూ రాష్ట్ర హైకోర్టు తీర్పునివ్వగా.. ఆ తీర్పుపై ముషారఫ్ అలీ ఫారూఖీ, మునిసిపల్ కమిషనర్.. ఇద్దరూ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో రాష్ట్ర హైకోర్టు విచారణ జరిపి తుది తీర్పును బుధవారం ప్రకటించింది.

వరంగల్ సీఈగా జి.అశోక్‌కుమార్

- మంచిర్యాల సీఈగా ఎ.మురళీధర్

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలో ఇద్దరు చీఫ్ ఇంజనీర్లు(సీఈ)లు పదవీ విరమణ చేయడంతో ఆ స్థానంలో ఇద్దరు ఎస్ఈలకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. జగిత్యాల ఇన్‌ఛార్జి ఎస్ఈగా పనిచేస్తున్న జి.అశోక్‌కుమార్‌ను వరంగల్ సీఈగా, సంగారెడ్డి ఇన్‌ఛార్జి ఎస్ఈగా పనిచేస్తున్న ఎ.మురళీధర్‌కు మంచిర్యాల సీఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇక సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె.దయాకర్‌రెడ్డికి అదే విభాగంలో ఎస్ఈగా, హుస్సేన్‌సాగర్ లేక్ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న పి.శంకర్‌రావుకు హైదరాబాద్ సర్కిల్ ఎస్ఈగా, చింతపల్లి(మాల్) ఈఈగా పనిచేస్తున్న ఎం.యాదన్‌కుమార్‌ను మాల్ డిప్యూటీ ఎస్ఈగా, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఈగా పనిచేస్తున్న అరుణజ్యోతిని ఈఈగా క్వాలిటీ కంట్రోల్, నిజామాబాద్ డివిజన్-2 ఈఈగా పనిచేస్తున్న ఎ.ఆర్.అశోక్‌కుమార్‌ను నిజామాబాద్ డిప్యూటీ ఎస్ఈగా, బోధన్ డివిజన్-1గా ఈఈగా పనిచేస్తున్న సయ్యద్ అహ్మద్ జానిని నిజామాబాద్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌గా, కొల్లాపూర్ ఈఈగా పనిచేస్తున్న జె.శ్రీనివాస్‌రెడ్డిని అచ్చంపేట డివిజన్-2 ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ నీటిపారుదల శాఖ కార్యదర్శి బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
గురువారం | 9-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 40
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
వరంగల్

కూలిన బతుకులు!

బాచుపల్లిలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ రిటైనింగ్ వాల్.. నాలుగేళ్ల బాలుడు సహా ఏడుగురి మృతి

మృతులు వలస కూలీలు.. మరో ఏడుగురికి గాయాలు.. రైజ్ డెవలపర్స్ సంస్థ నిర్లక్ష్యంతోనే ఘోరం

పాత ఇటుకల గోడపై సిమెంట్ కాంక్రీట్ వాల్.. భారీ వర్షంతో నీళ్లు చేరి ఒత్తిడికి కూలిన గోడ

పక్కన ఉన్న గుడిసెలపై పడ్డ శిథిలాలు.. పనులు ముగించుకొని వెళ్లిన గంటకే ఘోరం 10

నిర్మాణ సంస్థ యజమాని.. ఇద్దరు కాంట్రాక్టర్ల అరెస్టు.. ప్రాజెక్టు అనుమతులు నిలిపివేసిన హెచ్‌ఎండీఏ

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి.. నేడు, రేపు పలుచోట్ల వర్షం పడే అవకాశం

అదానీ, అంబానీల నుంచి..

ఎంత ముట్టింది?

ఐదేళ్లుగా విమర్శలు.. ఇప్పుడు మౌనమేల?

ఎన్నికల సమయంలోనే ఈ మార్పు ఏమిటి?

టెంపోల్లో ఎంత నల్లధనం అందింది?

కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ ప్రశ్నల వర్షం

పదేళ్లలో ప్రతీ రంగాన్ని అభివృద్ధి చేశాం

మూడు దశల ఎన్నికల్లో బీజేపీదే హవా

గెలిచే సీట్ల కోసం కాంగ్రెస్ భూతద్దంతో వెతుకుతోంది.. ఇకపై మైక్రోస్కోప్ అవసరం

ఇండీ గెలిస్తే ఐదేళ్లలో ఐదుగురు ప్రధానులు

అయోధ్య రామమందిరానికి తాళం వేయాలని కాంగ్రెస్ యోచన

కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లది అవినీతి బంధం

హైదరాబాద్‌ను మజ్లిస్‌కు లీజుకిచ్చారు

వేములవాడ, వరంగల్ బీజేపీ సభల్లో ప్రధాని



వేములవాడలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని మోదీ, బండి సంజయ్ తదితరులు

వేములవాడ, వరంగల్, సిరిసిల్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): గడచిన ఐదేళ్లుగా అదానీ, అంబానీలపై విమర్శలు గుప్పించిన కాంగ్రెస్.. ఎన్నికల ప్రక్రియ మొదలు కాగానే ఎందుకు మౌనం దాల్చిందో స్పష్టం చేయాలని ప్రధాని నరేంద్రమోదీ డిమాండ్ చేశారు. ఈ ఎన్నికలకు అదానీ, అంబానీల నుంచి ఎంత ముట్టిందో చెప్పాలన్నారు. 'ఐదేళ్లుగా విమర్శిస్తూ వచ్చి, ఎన్నికల ప్రక్రియ ఆరంభం కాగానే అదానీ, అంబానీలపై రాత్రికి రాత్రే విమర్శలు ఎందుకు ఆగిపోయాయి? తెలంగాణ గడ్డపై నుంచి ప్రశ్నిస్తున్నా... టెంపోల్లో ఎంత నల్లధనం మీకు చేరింది?' అని కాంగ్రెస్‌ను మోదీ నిలదీశారు. దాల్ మే కుచ్ కాలా హై అని వ్యాఖ్యానించారు. బుధవారం వేములవాడ, వరంగల్‌లలో బీజేపీ జనసభ పేరుతో నిర్వహించిన బహిరంగసభల్లో మోదీ ప్రసంగించారు. గడచిన పదేళ్లలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రతీ రంగాన్ని అభివృద్ధి చేస్తూ

మిగతా 12వ పేజీలో...

'రిజర్వేషన్‌'పై కాంగ్రెస్ ప్రచారం ఫెయిల్

అబద్ధాల ప్రచారంలో ఆ రెండు పార్టీలూ దిట్ట

రాష్ట్రంలో బీజేపీకి రెండంకెల ఎంపీ స్థానాలు 12

రేపు ఎల్బీ స్టేడియంలో మోదీ సభ: కిషన్‌రెడ్డి

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి

దక్షిణాదివారు ఆఫ్రికన్లలా కనిపిస్తారు

ఉత్తరాదివారు శ్వేతజాతీయుల్లా.. ఈశాన్య రాష్ట్రాలవారు చైనీయుల్లా.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా ఉంటారు: కాంగ్రెస్ నేత శామ్‌పిట్రోడా

రాష్ట్రపతిగా ముర్ముపై కాంగ్రెస్ వ్యతిరేకత ఇందుకే!

శరీర రంగును బట్టి అవమానిస్తే సహించం: మోదీ

బీజేపీనేతల ధ్వజం.. ఆయన వ్యక్తిగతమన్న కాంగ్రెస్

పార్టీ పదవికి శామ్‌పిట్రోడా రాజీనామా 9



నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

కేసీఆర్..

రైతు ఖాతాలు చూడు

మే 9లోపు రైతుభరోసా నిధులు వేస్తానన్నా.. 69 లక్షల మందికి ఆరో తేదీలోపే వేశా

సిద్దిపేటకు పట్టిన శనీశ్వరరావును వదిలిస్తా.. నిజామాబాద్ రైతుల్ని పట్టించుకోని మోదీ

ఆర్మూర్, నిజామాబాద్ సభల్లో సీఎం రేవంత్ వ్యాఖ్యలు

నిజామాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): "కేసీఆర్.. రైతుభరోసా వచ్చిందో రాలేదో.. ఏ రైతు ఖాతాలోనైనా చూడు. ఈ నెల 9లోపు రైతుభరోసా వేస్తానని.. వేయలేకపోతే అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాస్తానని సవాల్ చేశా. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతుల ఖాతాల్లో ఈనెల 6వ తేదీలోపే రైతుబంధు నిధులు వేశా. కేసీఆర్‌కు సిగ్గుంటే అమరవీరుల స్తూపం వద్ద.. లేదా ఆర్మూర్ అంబేడ్కర్ చౌరస్తా దగ్గరకు వచ్చి ముక్కు నేలకు రాయాలి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆగస్టు 15లోపు 2లక్షల రుణమాఫీ చేస్తే తాను రాజీనామా చేస్తానని హరీశ్‌రావు అన్నారని గుర్తుచేసిన రేవంత్.. "ఆర్మూర్ సిద్దులగుట్ట సాక్షిగా చెబుతున్నా.. ఆగస్టు 15కల్లా ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తా. సిద్దిపేటకు పట్టిన శనీశ్వరరావును శాశ్వతంగా వదిలిస్తా" అని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా.. బుధవారం నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌తోపాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలు, కార్నర్ సమావేశాల్లో రేవంత్ మాట్లాడారు. 2014లో పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో తనను గెలిపిస్తే వంద రోజుల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారని.. కానీ, ఆమె ఆ హామీని నిలబెట్టుకోకుండా రైతులను మోసం

మిగతా 11వ పేజీలో...



మోదీ మళ్లీ గెలిస్తే ఎన్నికలుండవు

రష్యా, చైనాలో మాదిరిగా.. 30 ఏళ్లపాటు తననే ప్రధానిగా ప్రకటించుకుంటారు

దేశ సంపదను 'ఏఏ'లకు దోచిపెట్టారు

రాష్ట్రంలో మరో పదిహేనేళ్లు మా ప్రభుత్వమే

పదేళ్లపాటు రేవంత్ రెడ్డే సీఎంగా ఉంటారు

జూన్4 తర్వాత తెలంగాణ భవన్‌కు తాళమే

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 11



వంద శాతం అధికారంలోకి

వస్తున్నాం

గతంలో జగన్‌ను అంచనా వేయలేకపోవడం వైఫల్యమే

ఏపీని నాశనం చేశారు.. భయానక వాతావరణం తెచ్చారు

వేధింపులు తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు

అతను సైకో అంటే నమ్మలేదు.. ఇప్పుడు అంతా అంటున్నారు

జైల్లో నాకు మంచం లేదు.. కమోడ్ లేదు.. స్నానానికీ చన్నీళ్లే

నన్ను చంపాలనుకున్నాడు.. విష ప్రయోగం చేస్తారనుకున్నా

ఏది జరిగితే అది జరుగుతుందని మనో ధైర్యంతో ఉన్నాను

ప్రజలు నా కోసం పోరాడారు.. ఇంత ఆదరణ ఎవరికీ దక్కదు

ఊపిరి ఉన్నంత వరకూ తెలుగు ప్రజలను ప్రపంచంలోనే

నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే నా అభిలాష 13

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' బిగ్ డిబేట్ విత్ ఆర్కేలో చంద్రబాబు

ఐదేళ్లు కంటి మీద నిద్ర లేకుండా ఉన్నా. నేను ఎన్ఎస్‌జీ రక్షణలో ఉన్నా. అయినా నా ఇంటి పైన డ్రోన్లు ఎగరేశారు. ఇల్లు ఖాళీ చేయాలని బెదిరించారు. ఆయన అనధికారం అంటే అనధికారమే. అక్రమం అంటే అది అక్రమమే. రాత్రుళ్లు జాగారం చేసిన రోజులున్నాయి. ఎవరో ఒకరిని అరెస్టు చేశారని వార్త రావడం.. వారిని కాపాడుకోవడానికి, చంపకుండా, టార్చర్ చేయకుండా చూసుకోవడానికి నిద్ర లేని రాత్రులు గడిపా. మానసిక క్షోభకు గురయ్యా.

పతనమైన ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ అభివృద్ధి బాటలో పెట్టడానికి సంబంధించి.. ఇప్పుడు నేను చేయలేకపోతే ఎవరూ చేయలేరు. ఎందుకంటే అది నా బ్రాండ్. నా ఫాస్ట్ ట్రాక్ రికార్డు. నేను కూడా చేయలేనంటే.. ఇక ఎవరూ చేయలేరు. ఎట్టి పరిస్థితుల్లో చేయాల్సిన బాధ్యత, చారిత్రక అవసరం నామీద ఉంది. 45 ఏళ్లుగా నన్ను గౌరవించిన ఈ కమ్యూనిటీకి నేను చేయాలి. పోరాడతాను. పనిచేస్తాను. నా జీవితంలో ఇప్పటి వరకు ఎంత పని చేశానో.. దాని కంటే ఇంకా పట్టుదలగా పనిచేసి ప్రజల రుణం తీర్చుకుంటాను.

'ఎయిరిండియా'లో మూకుమ్మడి సెలవులు

300 మంది సిక్‌లీవ్

90 విమానాలు రద్దు

ప్రయాణికుల పడిగాపులు

వివరణ కోరిన డీజీసీఏ

'టాటా'కు శిరోభారం

ఏప్రిల్లో విస్తారా పైలట్ల లీవ్ 9

చిన్నపాటి వానకే పది గంటలు కరెంట్ పోతదా?

అంతర్జాతీయంగా హైదరాబాద్ ప్రతిష్ఠకు మసక.. రాష్ట్ర ప్రభుత్వ దుర్మార్గపు చర్యల వల్లే ఈ దుస్థితి

మేం నగరాన్ని పవర్ ఐలాండ్‌గా మార్చాం.. ఇప్పుడు రియల్ వ్యాపారం, ఐటీ రంగం కుదేలైంది

చదరపు అడుగుకు రూ.75 సీఎంకు కప్పం.. అందుకే 5 నెలలుగా హెచ్‌ఎండీఏ అనుమతులు బంద్

ఊపిరి ఉన్నంత వరకు రాష్ట్ర ప్రజల కోసం కొట్లాడతా.. నేను అరెస్టులు, జైళ్లకు భయపడే రకం కాదు

మోదీ చెప్పిన అచ్చేదిన్ పోయి సచ్చే దినం వచ్చింది.. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుగా దుండిగల్, నర్సాపూర్, పటాన్‌చెరులో రోడ్‌షోలు

హైదరాబాద్ సిటీ/దుండిగల్/నర్సాపూర్/పటాన్‌చెరు, మే 8 (ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్‌ను మేం పవర్ ఐలాండ్‌గా మార్చాం. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా చేశాం. నిన్న కొద్దిపాటి వాన పడితే ఆరు నుంచి పది గంటల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఇలాంటి పరిస్థితి ఉంటే తెలంగాణ ప్రతిష్ఠ పోతుంది. పరిశ్రమలు వెళ్లిపోతాయి. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గపు చర్యల వల్ల అంతర్జాతీయంగా హైదరాబాద్ ఇమేజ్ తగ్గుతోంది' అని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

మిగతా 12వ పేజీలో...



బిజినెస్

మిలియనీర్ల అడ్డా ముంబై, ఢిల్లీ



భారత్ నుంచి ఈ రెండింటికి చోటు

» బెంగళూరులో సంపన్నుల సంఖ్య జూమ్

» హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ జాబితా విడుదల

న్యూఢిల్లీ: ప్రపంచంలో అత్యధికంగా మిలియనీర్లు నివసిస్తున్న 50 నగరాల జాబితాలో భారత్ నుంచి ముంబై, ఢిల్లీకి చోటు దక్కింది. ఈ ఏడాదికి గాను హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ విడుదల చేసిన ప్రపంచ సంపన్న నగరాల నివేదికలో ఈ విషయం వెల్లడైంది. 58,800 మంది మిలియనీర్లతో ముంబై 24వ స్థానంలో నిలవగా.. 30,700 మంది మిలియనీర్లతో ఢిల్లీ 37వ స్థానంలో ఉంది. అమెరికన్ కరెన్సీలో కనీసం 10 లక్షల కోట్ల డాలర్ల (మన కరెన్సీలో రూ.8.35 కోట్లు) సంపద కలిగిన వారిని మిలియనీర్‌గా పిలుస్తారు. ముంబై సంపన్నుల్లో 236 మంది సెంటీ మిలియనీర్లు (కనీసం 100 మిలియన్ డాలర్లు= రూ.835 కోట్లు) కాగా, 29 మంది బిలియనీర్లుగా (కనీసం 100 కోట్ల డాలర్లు= రూ.8,350 కోట్లు) ఎదిగారు. ఢిల్లీ సంపన్నుల్లో 123 మంది సెంటీ మిలియనీర్లు, 16 మంది బిలియనీర్లు ఉన్నారు. భారత సిలికాన్ వేలీగా పేరొందిన బెంగళూరు మిలియనీర్ల సంఖ్య శరవేగంగా పెరుగుతున్న ప్రపంచ నగరాల్లో ఒకటిగా నిలిచింది. హెన్లీ అండ్ పార్ట్‌నర్స్ నివేదిక ప్రకారం.. ప్రస్తుతం బెంగళూరులో 13,200 మంది మిలియనీర్లు ఉన్నారు. ప్రపంచంలో అత్యధిక మంది మిలియనీర్లున్న నగరాల్లో న్యూయార్క్ అగ్రస్థానంలో నిలిచింది. ఈ నగరంలో 3,49,500 మంది మిలియనీర్లున్నారు. ఈ నగర జనాభా 82.6 లక్షలు. అంటే, ప్రతి 24 మందిలో ఒకరు మిలియనీరే. గడిచిన దశాబ్దకాలంలో (2013-2023) న్యూయార్క్ సంపన్నుల సంఖ్య 48 శాతం పెరిగింది. అలాగే, పదేళ్లలో ముంబై మిలియనీర్ల సంఖ్య 82 శాతం వృద్ధి చెందగా.. ఢిల్లీలో 95 శాతం పెరిగింది.

ఎల్ అండ్ టీ లాభంలో వృద్ధి

» ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్

న్యూఢిల్లీ: ఈ మార్చితో ముగిసిన త్రైమాసికానికి లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 10.2 శాతం పెరిగి రూ.4,396.12 కోట్లకు చేరుకుంది. ఏకీకృత ఆదాయం రూ.68,120.42 కోట్లకు ఎగబాకింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.3 లక్షల కోట్లకు పైగా కొత్త ఆర్డర్లను అందుకున్నట్లు, ఆర్డర్ బుక్ రూ.4.75 లక్షల కోట్లకు చేరుకుందని ఎల్ అండ్ టీ పేర్కొంది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి (2023-24) లాభం 24.72 శాతం వృద్ధితో రూ.13,059.11 కోట్లుగా, రాబడి 20.60 శాతం పెరుగుదలతో రూ.2,21,112.91 కోట్లుగా నమోదైంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.28 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు ఎల్ అండ్ టీ చైర్మన్, ఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ తెలిపారు.

హీరో మోటోకార్ప్ ఆదాయం రూ.9,616 కోట్లు

» తుది డివిడెండ్ రూ.40

న్యూఢిల్లీ: హీరో మోటోకార్ప్ నాలుగో త్రైమాసికానికి రూ.943.46 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి గడించిన రూ.810.8 కోట్ల లాభంతో పోలిస్తే ఇది 16.7 శాతం అధికం. కాగా, కంపెనీ ఏకీకృత ఆదాయం రూ.8,434.28 కోట్ల స్థాయి నుంచి రూ.9,616.68 కోట్లకు పెరిగింది. మొత్తం ఖర్చులు సైతం రూ.7,508.94 కోట్ల నుంచి రూ.8,427.36 కోట్లకు పెరిగాయి. ఈ ఏడాది జనవరి-మార్చి కాలానికి 13.92 లక్షల మోటార్ సైకిళ్లు, స్కూటర్లను విక్రయించినట్లు కంపెనీ వెల్లడించింది. ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.37,788.62 కోట్ల ఆదాయంపై రూ.3,742.16 కోట్ల ఆదాయం ఆర్జించింది. 2023-24కు గాను వాటాదారులకు ఒక్కో షేరుకు రూ.40 తుది డివిడెండ్ చెల్లించనున్నట్లు కంపెనీ తెలిపింది. ఇప్పటికే చెల్లించిన రూ.100 తాత్కాలిక, ప్రత్యేక డివిడెండ్‌తో కలిపితే, గత ఆర్థిక సంవత్సరానికి చెల్లించే మొత్తం డివిడెండ్ రూ.140 అవుతుంది.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,757 కోట్లు



ఒక్కో షేరుకు రూ.16.10 డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ నికర లాభం మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికి 18 శాతం వృద్ధితో రూ.3,757 కోట్లకు చేరుకుంది. వడ్డీ ఆదాయం పుంజుకోవడంతో పాటు మొండిబకాయిలు మరింత తగ్గడం ఇందుకు దోహదపడింది. క్యూ4లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.34,025 కోట్లకు పెరిగింది. అందులో వడ్డీ ఆదాయం రూ.28,807 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.9,580 కోట్లుగా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి బ్యాంక్ నికర లాభం వార్షిక ప్రాతిపదికన 37 శాతం పెరిగి రూ.14,554 కోట్లకు చేరుకుంది. కాగా, 2023-24కు గాను వాటాదారులకు రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.16.10 (161 శాతం) తుది డివిడెండ్ చెల్లించాలని బ్యాంక్ బోర్డు సిఫారసు చేసింది. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈ ఏడాది మార్చి 31 నాటికి కెనరా బ్యాంక్ మొండి బకాయిలు (గ్రాస్ ఎన్‌పీఏ) 5.35 శాతం నుంచి 4.23 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 1.73 శాతం నుంచి 1.27 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి నాటికి గ్రాస్ ఎన్‌పీఏలు 3.25 శాతానికి, నికర ఎన్‌పీఏలు ఒక శాతానికి తగ్గవచ్చని కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజు అన్నారు.
- మొండిబకాయిల కోసం కేటాయింపులు కూడా 2,280 కోట్లకు తగ్గాయి. 2022-23 క్యూ4లో మొండిబకాయిల కోసం కేటాయింపులు రూ.2,399 కోట్లుగా నమోదయ్యాయి.
- 2023 మార్చి చివరినాటికి 87.31 శాతంగా నమోదైన ప్రొవిజన్ కవరేజీ రేషియో.. ఈ మార్చి 31 నాటికి 89.10 శాతానికి పెరిగింది.
- నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.95 శాతం నుంచి 3.05 శాతానికి మెరుగుపడింది. అయితే, బ్యాంకింగ్ రంగంలో ప్రస్తుతం కొనసాగుతున్న గరిష్ఠ వడ్డీ రేట్ల నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఎన్ఐఎం 2.95-3 శాతానికి పరిమితం కావచ్చని సత్యనారాయణ రాజు అన్నారు.
- 2023 మార్చి 31 నాటికి 16.68 శాతంగా నమోదైన మూలధన సమర్థత నిష్పత్తి (సీఆర్ఏఆర్).. ఈ మార్చి చివరి నాటికి 16.28 శాతానికి తగ్గింది.
- ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ రుణాల వృద్ధి 11-12 శాతంగా, డిపాజిట్ల వృద్ధి 9 శాతంగా నమోదు కావచ్చని సత్యనారాయణ రాజు అంచనా వేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రుణాలు, డిపాజిట్ల విస్తరణకు అదనపు మూలధనం అవసరం లేదన్నారు.
- ప్రస్తుతం కొనసాగుతున్న ప్రాజెక్ట్ ఫైనాన్స్ కోసం కేటాయింపులపై ఆర్‌బీఐ విడుదల చేసిన ముసాయిదా సర్క్యులర్‌పై మరింత స్పష్టమైన సమాచారం కోరుతున్నామని ఎండీ పేర్కొన్నారు. బ్యాంక్ ప్రాజెక్ట్ ఫైనాన్స్ పోర్ట్‌ఫోలియో రూ.1.10 లక్షల కోట్ల స్థాయిలో ఉందన్నారు.
- ప్రస్తుతం కెనరా బ్యాంక్ 9,604 శాఖలను, 10,209 ఏటీఎంలను కలిగి ఉంది. అలాగే, లండన్, న్యూయార్క్, దుబాయ్ తోపాటు గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో అంతర్జాతీయ బ్రాంచ్‌లను నిర్వహిస్తోంది.

ఐపీఓకు అనుబంధ సంస్థలు

కెనరా బ్యాంక్ అనుబంధ విభాగాలైన కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్, కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్‌లో పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ద్వారా కొంత వాటాను ఉపసంహరించుకోవాలని భావిస్తున్నట్లు సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం చివరినాటికి ఏదైనా ఒక అనుబంధ విభాగం ఐపీఓకు వచ్చే అవకాశం ఉందన్నారు.

వచ్చేసింది గూగుల్ వ్యాలెట్



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్ ఆండ్రాయిడ్ వినియోగదారులకు గూగుల్ వ్యాలెట్ యాప్‌ను బుధవారం విడుదల చేసింది. యూజర్లు ఈ యాప్‌లో తమ బోర్డింగ్ పాస్‌లు, లాయల్టీ కార్డులు, ఈవెంట్ టికెట్లు, ప్రజారవాణా పాస్‌ల వంటివి భద్రంగా దాచుకోవచ్చు. బుధవారం నుంచే ఈ డిజిటల్ వ్యాలెట్ పని చేయడం ప్రారంభించింది. గూగుల్ పే యాప్‌నకు ఇది కాంప్లిమెంటరీగా అందుబాటులోకి వచ్చింది. "గూగుల్ పే యాప్ ఎక్కడికీ పోదు. అది ఎప్పటికీ మా ప్రాథమిక పేమెంట్ యాప్‌గా కొనసాగుతుంది. నాన్ పేమెంట్ కేసుల్లో గూగుల్ వ్యాలెట్ ఉపయోగకరంగా ఉంటుంది" అని గూగుల్ ఆండ్రాయిడ్ జీఎం, ఇండియా ఇంజనీరింగ్ లీడ్ రామ్ పాపట్ల చెప్పారు. ఈ కొత్త సర్వీస్ కోసం ఎయిరిండియా, ఇండిగో, ఫ్లిప్‌కార్ట్, పైన్ లాబ్స్, కోచి మెట్రో, పీవీఆర్, ఐనాక్స్ వంటి 20 భారతీయ బ్రాండ్లతో గూగుల్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని భాగస్వామ్యాలు కుదుర్చుకోవాలని భావిస్తోంది. ఈ వ్యాలెట్ పూర్తిగా సురక్షితమని, కస్టమర్ల గోప్యతను కాపాడుతుందని రామ్ చెప్పారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,270 ▼	66,250 ▼	88,500 ▲
ముంబై	71,640 ▼	65,630 ▼	81,540 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

9వ తేదీ			
హైదరాబాద్	490	విజయవాడ	485
వరంగల్	492	గోదావరి	485
చిత్తూరు	573	విశాఖపట్నం	500
		డజను గుడ్లు రూ.66	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	140	గోదావరి	148
వరంగల్	140	విజయవాడ	148
కరీంనగర్	140	గుంటూరు	148
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	148
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	140		

కొనసాగిన అమ్మకాల జోరు

45 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ వరుసగా రెండో రోజూ నష్టాలతో ముగిసింది. సెన్సెక్స్ 45.46 పాయింట్ల నష్టంతో 73.466.39 వద్ద ముగిసింది. ఇంట్రా డేలో ఒక దశలో 437.93 పాయింట్ల వరకు నష్టపోయి 73,073.92 పాయింట్లను తాకింది. నిఫ్టీ మాత్రం ఎదుగూ బొదుగూ లేకుండా 22,302.50 పాయింట్ల వద్ద క్లోజైంది. ఐటీ కంపెనీలతో పాటు ప్రైవేటు బ్యాంకుల షేర్లలో అమ్మకాలు, ఎఫ్‌పీఐల అమ్మకాలు బుధవారం మార్కెట్‌ను దెబ్బతీశాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్ల టర్నౌట్ తక్కువగా ఉండడం, క్యూ4 ఆర్థిక ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడమూ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నట్టు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చి హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

ఇండిజీన్ ఇష్యూకి అదిరే డిమాండ్: హెల్త్‌కేర్ టెక్ కంపెనీ ఇండిజీన్ ఐపీఓ సూపర్ డూపర్ హిట్టయింది. బుధవారం బిడ్డింగ్ ముగిసే సమయానికి 69.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. కంపెనీ పబ్లిక్ ఇష్యూ ద్వారా 2,88,66,677 షేర్లను రూ.430-452 ప్రైస్ బ్యాండ్‌లో షేర్లు జారీ చేయగా, మదుపరుల నుంచి 201.22 కోట్ల షేర్లకు బిడ్స్ వచ్చాయి.

ఆధార్ హౌసింగ్ ఐపీఓ: ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ ఐపీఓ ప్రారంభమైన తొలి రోజే 43 శాతం సబ్‌స్క్రైబ్ అయింది. ఈ ఐపీఓ ద్వారా కంపెనీ 700.80 లక్షల షేర్లు జారీ చేస్తోంది. ఇష్యూ ప్రారంభమైన తొలి రోజే మదుపరుల నుంచి 304.53 లక్షల షేర్లకు బిడ్స్ వచ్చాయి. రూ.300-315 ప్రైస్ బ్యాండ్‌లో ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఈ ఐపీఓ జారీ చేస్తోంది.

ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ఐ-వెంచర్ ఇమ్మర్సివ్

హైదరాబాద్: ఔత్సాహిక ఎంటర్‌ప్రెన్యూర్ల కోసం ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఐ-వెంచర్ ఇమ్మర్సివ్ (ఐవీఐ) పేరిట ఒక ప్రోగ్రామ్ ప్రారంభించింది. 12 తరగతి పైబడి ఎలాంటి వ్యవస్థీకృత విద్య లేకుండానే తమకు ఆసక్తి గల రంగంలో ఇన్నోవేషన్‌కు కృషి చేసేందుకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది. అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక శిక్షణకు అడ్మిషన్లు ప్రస్తుతం జరుగుతున్నట్టు ఐఎస్‌బీ ప్రకటించింది. హైదరాబాద్ క్యాంపస్‌లోనే ఇది ఫుల్‌టైమ్ ప్రోగ్రామ్‌గా నిర్వహిస్తారు. ఔత్సాహికులు తమ నవ్య ఆలోచనలను ఆచరణీయం చేయడానికి అవసరం అయిన నిధుల కల్పన కూడా ఈ కార్యక్రమం ద్వారా అందుబాటులో ఉంటుంది.

నేటి మ్యాచ్


రాత్రి 7.30 గం. వేదిక: ధర్మశాల

పంజాబ్ X బెంగళూరు

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
హైదరాబాద్	12	7	5	0	14	0.406
చెన్నై	11	6	5	0	12	0.700
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	12	6	6	0	12	-0.769
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
ముంబై	12	4	8	0	8	-0.212
గుజరాత్	11	4	7	0	8	-1.320

ముంబై అవుట్



లఖ్‌నవూపై హైదరాబాద్ విజయంతో..ఈసారి ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేస్‌నుంచి అవుటైన తొలిజట్టుగా ఐదుసార్లు చాంపియన్ ముంబై నిలిచింది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో సన్‌రైజర్స్ (14) మూడో స్థానానికి ఎగబాకింది. ఇక కోల్‌కతా, రాజస్థాన్ చెరో 16 పాయింట్లతో మొదటి రెండు స్థానాల్లో కొనసాగుతున్నాయి. మరోవైపు ఈనెల 14న లఖ్‌నవూ-ఢిల్లీ జట్లు పరస్పరం తలపడనున్నాయి. ఈ రెండు జట్లలో ఒకదానికి 12 పాయింట్లు మించి లభించనున్నాయి. కాగా..12 మ్యాచ్‌లు ఆడిన ముంబై నాలుగు విజయాలు సాధించింది. మొత్తం ఎనిమిది పాయింట్లతో ప్రస్తుతం పట్టికలో తొమ్మిదో స్థానంలో ఉంది. ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్న ఆ జట్టు..రెండింటిలో నెగ్గినా గరిష్ఠంగా 12 పాయింట్లే లభిస్తాయి. అందువల్ల ముంబై టాప్-4లో నిలిచే అవకాశాలు ఏమాత్రం లేవు.

క్వార్టర్స్‌లో మనికా



జెడ్డా: భారత టేబుల్ టెన్నిస్ స్టార్ మనికా బత్రా సౌదీ స్మాష్ అంతర్జాతీయ టీటీ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది. గత మ్యాచ్‌లో ప్రపంచ రెండో ర్యాంకర్‌కు షాకిచ్చి సంచలనం సృష్టించిన మనికా.. బుధవారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో 11-6, 11-9, 11-7తో ప్రపంచ 14వ ర్యాంకర్ నినా మితెల్హామ్ (జర్మనీ)ను చిత్తుచేసింది.

రైజర్స్.. మజాకా!

లక్ష్యం 166
9.4 ఓవర్లలోనే ఛేదన

హెడ్, అభిషేక్ విధ్వంసం | 10 వికెట్లతో లఖ్‌నవూపై ఘన విజయం





హైదరాబాద్: పవర్ హిట్టింగ్‌తో ప్రత్యర్థులకు వణుకు పుట్టిస్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఉప్పల్‌లో మరోసారి పరుగుల మోత మోగించింది. కీలక మ్యాచ్‌లో ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (30 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్స్‌లతో 89 నాటౌట్), అభిషేక్ శర్మ (28 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్స్‌లతో 75 నాటౌట్) ఊచకోతతో.. 166 పరుగుల లక్ష్యాన్ని కేవలం 58 బంతుల్లోనే ఛేదించిన సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ అవకాశాలను మరింతగా మెరుగుపరచుకొంది. బుధవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 10 వికెట్ల తేడాతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ)ను మట్టికరిపించింది. తొలుత లఖ్‌నవూ నిర్ణీత 20 ఓవర్లలో 165/4 స్కోరు చేసింది. ఆయుష్ బదోని (30 బంతుల్లో 9 ఫోర్లతో 55 నాటౌట్), నికోలస్ పూరన్ (26 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 48 నాటౌట్), కెప్టెన్ కేఎల్ రాహుల్ (29) రాణించారు. పొదుపుగా బౌలింగ్ చేసిన భువనేశ్వర్ (4-0-12-2) రెండు వికెట్లు పడగొట్టాడు. లక్ష్య ఛేదనలో సన్‌రైజర్స్ 9.4 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 167 పరుగులు చేసి అలవోకగా నెగ్గింది. ఐపీఎల్‌లో లఖ్‌నవూపై ఆరెంజ్ ఆర్మీకి ఇదే తొలి గెలుపు కావడం విశేషం. మొత్తం 14 పాయింట్లతో సన్‌రైజర్స్ మూడో స్థానానికి దూసుకెళ్లింది. హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

వికెట్ పడకుండా..: ఛేదనలో హెడ్, అభిషేక్ పోటీ పడి మరీ షాట్లు ఆడడంతో.. వార్ వన్‌సైడ్ అయింది. లఖ్‌నవూ బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడిన వీరు.. ఫోర్లు, సిక్స్‌లతో స్టేడియాన్ని హోరెత్తించారు. దీంతో హైదరాబాద్ 62 బంతులు మిగిలుండగానే విజయాన్ని అందుకొంది. రెండో ఓవర్‌లో యశ్ బౌలింగ్‌లో అభిషేక్ నాలుగు ఫోర్లతో విధ్వంసానికి తెరతీయగా.. ఆ తర్వాతి ఓవర్‌లో హెడ్ 6,4,6,6తో ఏకంగా 22 పరుగులు పిండుకొన్నాడు. బిష్ణోయ్ బౌలింగ్‌లో అభిషేక్ సిక్స్ బాదగా.. హెడ్ 4,6తో జోరు చూపాడు. ఇక, 5వ ఓవర్‌లో నవీనుల్ బౌలింగ్‌లో శివాలెత్తిన హెడ్ సిక్స్, 4 ఫోర్లతో 23 పరుగులు రాబట్టాడు. ఈ క్రమంలో 16 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకొన్నాడు. శర్మ కూడా మరో రెండు సిక్స్‌లు బాదడంతో.. పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ 107/0తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మధ్య ఓవర్లలో కూడా వీరిద్దరూ ఎడాపెడా షాట్లతో విరుచుకుపడడంతో లఖ్‌నవూ బౌలర్లకు దిక్కుతోచలేదు. సిక్స్‌తో అభిషేక్ కూడా హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా.. 9వ ఓవర్‌లోనే టీమ్ స్కోరు 150 దాటింది. అదే జోరులో శర్మ భారీ సిక్స్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకొన్న బదోని-పూరన్: సన్‌రైజర్స్ బౌలర్ల దెబ్బకు టాపార్డర్ విఫలమైనా.. ఆయుష్ బదోని ధనాధన్ అర్ధ శతకంతో లఖ్‌నవూ మెరుగ్గానే ముగించింది. పూరన్‌తో కలసి డెత్ ఓవర్లలో చెలరేగిన బదోని.. ఐదో వికెట్‌కు 52 బంతుల్లో 99 పరుగుల అభేద్య భాగస్వామ్యంతో జట్టుకు పోరాడగలిగే స్కోరును అందించాడు. పవర్‌ప్లేలోనే ఓపెనర్ డికాక్ (2), స్టొయినిస్ (3)ను భువనేశ్వర్ అవుట్ చేయడంతో.. లఖ్‌నవూ స్కోరు నత్తనడకన సాగింది. హైదరాబాద్ ఫీల్డర్లు కూడా బౌలర్లకు చక్కని సహకారం అందించారు. బౌండ్రీ రోప్ వద్ద నితీష్ అందుకొన్న అద్భుత క్యాచ్‌తో డికాక్ వెనుదిరగగా.. సన్వీర్ సింగ్ డైవింగ్ క్యాచ్‌తో స్టొయినిస్ పెవిలియన్ చేరాడు. దీంతో తొలి ఆరు ఓవర్లు ముగిసేసరికి లఖ్‌నవూ 27/2తో ఈ సీజన్‌లోనే అత్యల్ప పవర్‌ప్లే స్కోరు నమోదు చేసింది. అయితే, కెప్టెన్ రాహుల్‌కు జత కలసిన క్రునాల్ పాండ్యా (24) రెండో వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. 8వ ఓవర్‌లో ఉనాద్కట్ బౌలింగ్‌లో రెండు వరుస సిక్స్‌లు బాదిన క్రునాల్.. స్తబ్దుగా ఉన్న స్కోరు బోర్డులో ఊపుతెచ్చాడు. మరోవైపు ఫోర్‌తో గేర్ మార్చేందుకు యత్నిస్తున్న రాహుల్‌ను కమిన్స్ పెవిలియన్ చేర్చి దెబ్బకొట్టాడు. ఎదురుదాడి చేస్తున్న క్రునాల్‌ను కమిన్స్ రనౌట్ చేయడంతో 11.2 ఓవర్లలో లఖ్‌నవూ 66/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో పూరన్, బదోని పరిస్థితిని చక్కదిద్దే బాధ్యత తీసుకొన్నారు. నటరాజన్ వేసిన 14వ ఓవర్‌లో మూడు ఫోర్లు కొట్టిన బదోని 17 పరుగులు రాబట్టాడు. ఆ తర్వాతి ఓవర్‌లో విజయ్‌కాంత్ బౌలింగ్‌లో పూరన్ సిక్స్‌తో బ్యాట్‌కు పని చెప్పడంతో టీమ్ స్కోరు సెంచరీ మార్క్ దాటింది. ఇక, డెత్ ఓవర్లలో వీరిద్దరూ జోరు పెంచారు. 19వ ఓవర్‌లో బదోని 2 ఫోర్లతో ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. చివరి ఓవర్‌లో పూరన్ మూడు బౌండ్రీలతో టీమ్ స్కోరును 160 మార్క్ దాటించాడు.

1 ఐపీఎల్‌లో ఇదే అత్యంత వేగవంతమైన ఛేదన

మిగిలి ఉన్న బంతుల (62) పరంగా ఐపీఎల్‌లో ఇదే అత్యధిక విజయం. 2022లో పంజాబ్‌పై ఢిల్లీ 57 బంతులుండగానే గెలిచింది.

సన్‌రైజర్స్ చేసిన 167 పరుగులే ఐపీఎల్‌లో ఏ జట్టుకైనా తొలి 10 ఓవర్లలో అత్యధిక స్కోరు. ఈ సీజన్‌లోనే హైదరాబాద్.. ఢిల్లీపై 158/4, ముంబైపై 148/2 స్కోర్లు చేసింది.

2 పవర్‌ప్లేలో అత్యధిక అర్ధ శతకాలు బాదిన రెండో బ్యాటర్‌గా హెడ్ (4). 6 హాఫ్ సెంచరీలతో వార్నర్ టాప్‌లో ఉన్నాడు.

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: రాహుల్ (సి) నటరాజన్ (బి) కమిన్స్ 29, డికాక్ (సి) నితీశ్ (బి) భువనేశ్వర్ 2, స్టొయినిస్ (సి) సన్వీర్ (బి) భువనేశ్వర్ 3, క్రునాల్ (రనౌట్) 24, పూరన్ (నాటౌట్) 48, బదోని (నాటౌట్) 55, **ఎక్స్‌ట్రాలు:** 4; **మొత్తం:** 20 ఓవర్లలో 165/4; **వికెట్ల పతనం:** 1-13, 2-21, 3-57, 4-66; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-12-2, కమిన్స్ 4-0-47-1, షాబాజ్ 2-0-9-0, విజయ్‌కాంత్ 4-0-27-0, ఉనాద్కట్ 2-0-19-0, నటరాజన్ 4-0-50-0.

సన్‌రైజర్స్: అభిషేక్ (నాటౌట్) 75, హెడ్ (నాటౌట్) 89, **ఎక్స్‌ట్రాలు:** 3; **మొత్తం:** 9.4 ఓవర్లలో 167/0; **బౌలింగ్:** కృష్ణప్ప 2-0-29-0, యశ్ ఠాకూర్ 2.4-0-47-0, రవి బిష్ణోయ్ 2-0-34-0, నవీనుల్ 2-0-37-0, బదోని 1-0-19-0.

స్పోర్ట్స్

మూడేళ్ల తర్వాత..



స్వదేశీ టోర్నీ బరిలో నీరజ్
ఫెడరేషన్ కప్‌లో ఒలింపిక్ చాంప్


న్యూఢిల్లీ: టోక్యో ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత నీరజ్ చోప్రా మూడు సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత స్వదేశంలో ఓ టోర్నీ బరిలో దిగుతున్నాడు. ఈనెల 12 నుంచి 15 వరకు భువనేశ్వర్‌లో జరిగే ఫెడరేషన్ కప్‌లో వరల్డ్ చాంపియన్ నీరజ్ తలపడుతున్నట్టు నిర్వాహకులు బుధవారం వెల్లడించారు. ఈమేరకు తన ఎంట్రీని చోప్రా ఖరారు చేసినట్టు తెలిపారు. ఈనెల 10న దోహాలో ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ సిరీస్ తొలి అంచె జరగనుంది. అందులో పోటీపడుతున్న స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్..అక్కడ నుంచి భారత్ రానున్నట్టు భారత అథ్లెటిక్స్ సమాఖ్య తెలిపింది. 26 ఏళ్ల చోప్రా..2021లో భువనేశ్వర్‌లోనే జరిగిన ఫెడరేషన్ కప్‌లో చివరిసారి స్వదేశంలో తలపడ్డాడు. అప్పట్లో ఈటెను 87.80 మీ. దూరం విసిరిన అతడు స్వర్ణ పతకం సాధించాడు.

12 పరుగులకే ఆలౌట్

టీ20ల్లో మంగోలియా చెత్త రికార్డు

సనో (జపాన్): టీ20 క్రికెట్ చరిత్రలో రెండో అత్యల్ప స్కోరు నమోదు చేసిన జట్టుగా పసికూన మంగోలియా చెత్త రికార్డును మూటగట్టుకొంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో జపాన్ నిర్దేశించిన 218 పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా.. మంగోలియా 8.2 ఓవర్లలో 12 పరుగులకే కుప్పకూలింది. టుర్ సుమాయా (11 బంతుల్లో 4) టాప్ స్కోరర్. గతేడాది ఫిబ్రవరిలో స్పెయిన్‌తో జరిగిన మ్యాచ్‌లో 10 పరుగులకే ఆలౌటైన ఐజల్ ఆఫ్ మెన్స్ జట్టు టీ20 క్రికెట్ చరిత్రలో అత్యల్ప స్కోరు నమోదు చేసింది.

శాంసన్‌కు జరిమానా



న్యూఢిల్లీ: ఐపీఎల్ క్రమశిక్షణ కోడ్‌ను ఉల్లంఘించిన రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్‌కు మ్యాచ్ ఫీజులో 30 శాతం కోత పడింది. మంగళవారం ఢిల్లీతో మ్యాచ్‌లో 222 పరుగుల ఛేదనలో రాజస్థాన్ 20 పరుగులతో ఓడింది. అయితే ఈ మ్యాచ్‌లో శాంసన్ (86) ధాటిగా ఆడుతున్న సమయంలో 16వ ఓవర్‌లో బౌండ్రీ రోప్ వద్ద షాయ్ హోప్ తీసుకొన్న వివాదాస్పద క్యాచ్‌తో అతడు అవుటయ్యాడు. క్యాచ్ అందుకొంటున్నప్పుడు హోప్ కాళ్లు బౌండ్రీ రోప్‌ను తాకినట్టుగా కనిపించింది. కానీ, థర్డ్ అంపైర్ మాత్రం తనను అవుట్‌గా ప్రకటించడంపై సంజూ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఫీల్డ్ అంపైర్‌తో వాగ్వాదానికి కూడా దిగాడు. లెవల్-1 ఉల్లంఘన కింద అతడి మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానా విధిస్తూ రిఫెరీ నిర్ణయం తీసుకొన్నాడు.

టీ20 వరల్డ్ కప్
ఐర్లాండ్ కెప్టెన్ స్టిర్లింగ్

డబ్లిన్: వరల్డ్ కప్‌లో తలపడే ఐర్లాండ్ జట్టును బుధవారం ప్రకటించారు. 15 మంది సభ్యుల జట్టుకు వెటరన్ ఓపెనర్ పాల్ స్టిర్లింగ్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. వచ్చే నెల ఒకటి నుంచి వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న మెగా టోర్నీ గ్రూప్ 'ఎ'లో ఐర్లాండ్ తలపడనుంది. జూన్ ఐదున న్యూయార్క్‌లో జరిగే తమ తొలి మ్యాచ్‌లో భారత జట్టును ఐర్లాండ్ ఢీకొననుంది. ఇక మెగా టోర్నమెంట్‌కు న్యూగినీ జట్టును కూడా ప్రకటించారు. అసడోలా వాలా సారథ్యంలో న్యూగినీ కప్పు బరిలో దిగనుంది.



స్టిర్లింగ్

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి

▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్లాస్టిక్‌పై విఫలపోరు

ప్లాస్టిక్‌ని భూతం అంటాం కానీ, దాన్ని అంతం చేయడానికి మాత్రం మనసొప్పడం లేదు. ప్లాస్టిక్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయాలన్న సదాశయంతో రెండేళ్ళక్రితం ప్రపంచదేశాల మధ్య ఒక ప్రయత్నం ఆరంభమైంది. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఉన్న 175దేశాల ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పడి, ఈ ఏడాది చివరకల్లా ప్లాస్టిక్ విషయంలో ఒక విధాన నిర్ణయానికి రావాలని సంకల్పించాయి. ఇప్పటివరకూ మూడువిడతల చర్చలు జరిగినప్పటికీ ఈ భూతాన్ని అంతం చేసి భవిష్యత్తును కాపాడుకొనే విషయంలో ఈ దేశాలు ఒకేతాటిపైకి రాలేకపోయాయి. గతవారం కెనడాలో నాలుగోవిడత చర్చలు కూడా విఫలం కావడాన్ని బట్టి ప్లాస్టిక్ పరిశ్రమకు రాజకీయంగా,ఆర్థికంగా ఎంతబలం ఉన్నదో అర్థమవుతుంది.

దక్షిణకొరియాలో ఈ నవంబరులో మరోవిడత చర్చలు జరగబోతున్నప్పటికీ, ఈ ఏడాది ముగిసేలోగా 'గ్లోబల్ ప్లాస్టిక్స్ ట్రీటీ' సాధ్యమయ్యే అవకాశాలైతే లేవు. ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం, భారీ వ్యర్థాలను మిగల్చే చోట్ల తయారీని పూర్తిగా మానివేయడం, ఉత్పత్తిలో భాగంగా హానికర రసాయనాల వాడకాన్ని ఆపివేయడం, హెచ్చుస్థాయిలో రీసైక్లింగ్ లక్ష్యాలను నిర్ణయించుకోవడం ఇత్యాది అంశాల్లో నిర్దిష్టమైన గడువులను విధించుకోవాలన్నది ఈ దేశాల తాపత్రయం. ఏయే లక్ష్యాలను ఎప్పటిలోగా సాధించాలో తెలియచెబుతున్న ఒక ఆచరణసాధ్యమైన ఒప్పందాన్ని అన్నిదేశాలు కలసికట్టుగా సాధించగలిగితే అంతకంటే అద్భుతం మరొకటి లేదు. కానీ, సహజంగానే ఆర్థికం దీనికి అడ్డుపడింది. చమురు ఉత్పత్తి దేశాలతో పాటు దానిని భారీగా శుద్ధిచేస్తూ లాభపడుతున్న దేశాలు ఒక అవగాహనకు రాకుండా మోకాలడ్డుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తిని నిలిపివేసే విషయంలో గడువులు విధించడాన్ని మిగతా కొన్ని దేశాలతో పాటు భారత్ కూడా వ్యతిరేకిస్తోందని వార్తలు వచ్చాయి. 2040ను లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటినుంచే ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించడం, లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందని ఆఫ్రికన్ దేశాలతోపాటు, అనేక యూరోపియన్ దేశాలు కూడా భావించాయట. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలంటే ప్రత్యామ్నాయాలను అభివృద్ధిపరచాలని, అవి తక్కువ ఖర్చుతో కూడుకున్నవై సులభంగా అందుబాటులో రావాలని భారత్ భావిస్తోంది. సదరు ప్రత్యామ్నాయాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడంతో పాటు అది సులభంగా మిగతాదేశాలకు బదిలీకావాలని కూడా భారత్ అంటోంది. ఉమ్మడి లక్ష్యమే అయినప్పటికీ ధనికదేశాలు, అధిక ఉత్పత్తిదేశాలు ఎక్కువ బాధ్యతలను పంచుకోవాలన్నది ప్రతిపాదన.

ప్లాస్టిక్ కాలుష్యం మీద అన్ని దేశాలదీ ఒకే అభిప్రాయం. మానవ మనుగడను ప్రమాదంలో పడేస్తున్న దీనిని పూర్తిగా నిషేధించుకోవాలన్న విషయంలోనూ భేదాభిప్రాయాలు లేవు. కానీ, లక్ష్యసాధన దిశగా అడుగులు ఎలావేయాలన్న విషయంలో ఒక్కమాట సాధ్యపడటం లేదు. పెట్రో కెమికల్ పరిశ్రమ బలంగా ఉన్నదేశాలు ప్లాస్టిక్ తయారీమీద నియంత్రణలు విధించాలన్న ప్రతిపాదనను ఏమాత్రం పడనీయడం లేదు. అభివృద్ధి చెందుతున్నదేశాలకంటే ధనికదేశాల్లో ప్లాస్టిక్ పరిశ్రమ వెలిగిపోతున్నది కనుక అవి ప్రతీ ఆలోచనకూ అడ్డుపడుతున్నాయి. పేద దేశాలతో పోల్చితే అభివృద్ధిచెందిన దేశాల్లో మరిన్ని వందల రకాల ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉంటూ, అక్కడి జనజీవనంతో మిళితమైపోయాయి. వినియోగరంగాన్నీ, ఆర్థికాన్నీ ప్లాస్టిక్ శాసిస్తోంది.

ప్లాస్టిక్స్ ఒప్పందం ప్రతిపాదన ముందుకు కదిలిన 2022లో భారత దేశం 19రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. మరిన్నింటిని కూడా చేర్చవలసిన అవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శించిందని అప్పట్లోనే పర్యావరణ ఉద్యమకారులు విమర్శించారు. ఆ తరువాత కాలంలో ఈ నిషేధం కూడా దేశవ్యాప్తంగా ప్రభావవంతంగా అమలుజరగలేదు. మట్టిలో కలవదనీ, మనిషిప్రాణానికి మహాప్రమాదకారనీ, పర్యావరణాన్ని నాశనం చేస్తోందనీ ప్లాస్టిక్ గురించి భయపడని క్షణం లేదు, తిట్టుకోనిరోజు ఉండదు. దాని తయారీ భూతాపాన్ని తీవ్రంగా హెచ్చిస్తోంది. ప్లాస్టిక్ ఉత్పత్తి ఏయేటికాయేడు పెరిగిపోతూ, ఏటా మరింత చెత్త చేరుతూంటే, మొత్తం ప్లాస్టిక్స్‌లో పదోవంతు కూడా రీసైకిల్ కావడం లేదు. ఈ విషవలయంనుంచి ప్రజలను రక్షించి ఒడ్డునపడేయాల్సిన ప్రభుత్వాలు ఇలా నిమ్మకునీరెత్తినట్టు ఉండటం విషాదం.

వంచన పాలైన పాలమూరు – ఇంకా వలసే దిక్కైన ప్రజలు!

పదేళ్ళు కావస్తున్నా 'పాలమూరు – రంగారెడ్డి' ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. 2015లో పరిపాలనా అనుమతిని లభించినప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రాజెక్ట్ అంచనా వ్యయం రెండింతలు అయ్యింది. 2004–2014 మధ్య కాలంలో కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలో ఉంది. నీటిపారుదల రంగాన్ని వేగంగా అభివృద్ధి చేయడం ద్వారా దేశంలో ఆహార కొరతను తీర్చవచ్చు అని భావించి 11వ పంచవర్ష ప్రణాళిక (2007–12)లో రాష్ట్రాలలో నిర్మించే బహుళార్థక సాధక ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నాయకత్వంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ హోదా కల్పించబడిన ప్రాజెక్టులకు 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. మిగిలిన 10 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. ఇందులో భాగంగా యూపీఏ ప్రభుత్వం దేశంలో 16 ప్రాజెక్టులకు జాతీయహోదా కల్పించింది. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వాలనేది నాటి కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తమకు ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చే ఉద్దేశం లేదని ప్రకటించింది. ఇక 2022లో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎమ్‌కేఎస్‌వై) కింద ప్రాజెక్టుల గుర్తింపు నిధుల కేటాయింపునకు సంబంధించి కొత్త నిబంధనలను జారీ చేసింది బీజేపీ ప్రభుత్వం. దీని ద్వారా దేశంలో ఇకపై ఏ సాగునీటి ప్రాజెక్టుకైనా జాతీయహోదా లభిస్తే 90శాతం బదులు 60శాతం నిధులను మాత్రమే కేంద్రం ఇస్తుంది. మిగిలిన 40శాతాన్ని రాష్ట్రాలు భరించాలి. దీనిని బట్టి వ్యవసాయ రంగం సాగు, తాగు నీటి రంగాలపై బీజేపీ దృష్టికోణం ఏమిటో అర్థమవుతున్నది.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్ సాక్షిగా కొత్తగా ఏ రాష్ట్రానికి జాతీయ హోదా ప్రాజెక్టు ఇవ్వమని ప్రకటించారు. తెలంగాణ ప్రాజెక్టు జాతీయ హోదా విషయంలో ప్రత్యేకించి దక్షిణ తెలంగాణకు చెందిన కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్‌రెడ్డి తన సొంత జిల్లా రంగారెడ్డిలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా 5 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిసి తనే ముందుండి జాతీయ హోదా సాధించుకు రావల్సింది పోయి దేశంలో తెలంగాణ కంటే పేద రాష్ట్రాలు చాలా ఉన్నాయనీ, ఒకవేళ దేశంలో ఏ రాష్ట్రానికైనా జాతీయ హోదా ఇస్తే తెలంగాణ ప్రాజెక్టు తీసుకువస్తానని మీడియా సాక్షిగా ప్రకటించారు. మరి సరిగ్గా కర్ణాటక ఎన్నికలకు కొన్ని నెలల ముందు కర్ణాటక రాష్ట్రంలోని అప్పరభద్ర ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వడమే కాకుండా 2023–2024 బడ్జెట్‌లో రూ.5300కోట్లు కేటాయించింది. మిగతా రాష్ట్రాల అభ్యంతరాలు పట్టించుకోకుండా కేంద్ర జల సంఘం వెంటనే అనుమతి ఇచ్చేసింది. ఆ వెంటనే కేంద్రంలో మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపేసింది. ఇన్ని జరుగుతున్నా ఈ రాష్ట్ర బీజేపీ నాయకులు తమ ప్రాంత హక్కుల కోసం ఎందుకు నోరు మెదపలేదో ప్రజలకు సమాధానం చెప్పాలి.

తెలంగాణ ఏర్పడిన తరువాత 2015లో మొదలైన పాలమూరు రంగారెడ్డి ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదు. కాని 2017లో మొదలైన కాళేశ్వరాన్ని అంతకు మూడింతలు నిధులు వెచ్చించి పూర్తి చేశారు. కరువు, వలసలు, ఫ్లోరైడ్‌తో బాధపడే ప్రాంతాన్ని పక్కకు పెట్టి కాళేశ్వరాన్ని పూర్తిచేయడాన్ని చూసి ఈ ప్రాంత ప్రజల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నమ్మకం పోయింది. ఫలితంగా దక్షిణ తెలంగాణలో ఆ పార్టీ ఆనవాళ్ళు లేకుండా పోయింది.

అత్యంత వెనుకబడ్డ పాలమూరు జిల్లాలో రాష్ట్రం ఏర్పడి పదేళ్ళయినా బీమా, నెట్టెంపాడు చివరి ఆయకట్టుకు నీళ్ళు ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు. ఆర్‌డీఎస్‌లో తెలంగాణ వాటా 15.9 టీఎంసీలను పూర్తిగా ఇప్పటికీ ఉపయోగించుకోలేకపోతున్నాము. కాని ఈ ప్రాంత మంత్రికి మాత్రం నీళ్ళమంత్రి అని బిరుదు వచ్చింది. ఇక బీజేపీ నాయకులు 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ పూర్తిగా విస్మరించారు. 2014 ఎన్నికల ప్రచారంలో మోదీ మొదలుకొని దివంగత సుష్మాస్వరాజ్ వరకు అందరూ హామీ ఇచ్చారు కాని జాతీయహోదా రాలేదు. పదేళ్ళయినా పాలమూరు నుండి ముంబైకి బస్సులు పోతూనే ఉన్నాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, చేవెళ్ళ, నల్లగొండ, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఓట్ల కోసం వచ్చే బీజేపీ నాయకులను పాలమూరు – రంగారెడ్డికి జాతీయహోదా ఎందుకు ఇవ్వలేదు అని నిలదీయాల్సిన అవసరం ఉంది.

– రాగి శ్రీనివాస్ రెడ్డి

గ్రహిస్తారు, అనుగ్రహిస్తారు, ఆగ్రహిస్తారు

మేరేరామ్ అన్న నాటకం చూశాను. అందులో రావణుడు చనిపోతూ అన్న ఈ మాటలు కదిలించాయి. "నా పతనానికి కారణం ఏమిటంటే, నాకు నా జ్ఞానం గురించి అహంకారం ఉంది. రాముడికేమో అహంకారానికి సంబంధించిన జ్ఞానం ఉంది...". ఈ విషయం అర్థంచేసుకుని మనం మన పనితీరులో మార్పు చేసుకుంటేనే ఉపయోగం. జై భారత్... ఇది జీగ్రూప్ అధినేత సుభాష్ చంద్ర ఈ మధ్య చేసిన ట్వీట్. అంతకు ముందు రోజే ఆయన పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో స్వతంత్ర పత్రికారంగానికి ఉన్న శక్తిని స్మరించుకున్నారు.

ఈ మధ్య భారతదేశంలో కొన్ని అనూహ్యమైన ఆశ్చర్యాలు కూడా ఎదురవుతున్నాయి. ఈ సుభాష్ చంద్ర, జీటీవీ చానెళ్ల మీడియా సంస్థ ఎస్సెల్ గ్రూప్ అధినేత. గోదీ మీడియా అని విమర్శకులు పిలిచే మోదీ సన్నిహిత మీడియాలో ఈ జీటీవీ ది ప్రధానపాత్ర. బీజేపీ సహాయంతో రాజ్యసభకు ఒకసారి సుభాష్ చంద్ర ఎన్నికయ్యారు కూడా. ఇంతకూ ఆయన తన ఇటీవలి ట్వీట్‌లో చెప్పిన రావణాసురుడు ఎవరు? అహంకారం ఎవరిది? జీ మీడియా కార్పొరేషన్ సీఈవో అభయ్ ఓఝాతో సహా కొందరు ముఖ్యుల నిష్క్రమణ, ప్రభుత్వ అనుకూల విధానాన్ని విరమించుకుంటున్నందువల్లనే అని వినిపిస్తున్న వార్తల నేపథ్యంలో, సుభాష్ చంద్రకు పత్రికాస్వేచ్ఛ గుర్తు వచ్చిందా? లేదా, దేశంలో గాలి మళ్లుతున్నదని ముందుగానే గ్రహించి, ఎన్నికల ప్రక్రియ మధ్యలోనే అధికార శిబిరానికి వీడ్కోలు చెప్పారా? వార్తాప్రసారకులలోనే కాదు, వీక్షకులలో కూడా మార్పు వచ్చిందని, ప్రభుత్వంపై విమర్శలకు కూడా కోట్లాది వీక్షణలు దొరుకుతున్నాయని ధ్రువ్ రాఠీ, రవీశ్ కుమార్ వంటి వారి విజృంభణ తెలియజేస్తోంది. అయితే, స్వేచ్ఛాభాషణ పెరిగినంత మాత్రాన, పెను రాజకీయమార్పులు జరుగుతాయని అనుకోనక్కరలేదు.

అహంకారపు వేడి అస్మదీయులకు కూడా సోకి, అంతిమంగా అధికార మార్పిడికే కారణమయిన అనుభవం తెలంగాణ రాష్ట్రంలో జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం మీద సవాలక్ష ఫిర్యాదులు ఉండవచ్చు, క్షేత్రస్థాయిలో అభివృద్ధి సమస్యలు అనేకం ఉండి ఉండవచ్చు కానీ, వాటన్నిటికి ఎగువన, ప్రజల అభిమతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన అంశం మాత్రం 'అహంకారమే'. కేసీఆర్ వ్యవహార సరళిలోని ఆభిజాత్యం, అధికారస్వరం మొన్నటి ఎన్నికల నాటికి ప్రజలు భరించలేని స్థాయికి చేరుకున్నాయి. మరి నరేంద్రమోదీ తీరులో కూడా పతనానికి దారితీసే అవలక్షణం కనిపిస్తున్నదని సుభాష్ చంద్ర చెబుతున్నారా? ప్రజల ఎంపికల మీద నిజంగా ఇటువంటి వ్యక్తిత్వ అంశాలు ప్రభావం వేస్తాయా? అసలు ఎన్నికల తీర్పు వెనుక ఉండే చలనసూత్రాలు, తర్కం ఏమిటి?

రాజకీయవాదులు ప్రజలను ఆకర్షించడానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. వాటిలో ముఖ్యమైనది, అభినయం. తమ స్వభావాలు, అభిప్రాయాలు ఎటువంటివైనా ప్రజల ముందుకు వెళ్లినప్పుడు, ముఖ్యంగా ఎన్నికల వేళ, గౌరవంగా, ప్రేమగా, సానుభూతిగా మాట్లాడడానికి ప్రయత్నం చేస్తారు. చనువుగా ఉండడానికి చూస్తారు. అధికారంలోకి వచ్చాక కూడా, ఆ నటనను కొనసాగించాలనే అనుకుంటారు కానీ, క్రమంగా స్వభావానిదీ, పదవుల దర్పానిదీ పైచేయి అవుతుంది. స్వరం మారుతుంది. జనాన్ని విదిలించి దూరం పెడతారు. ప్రజలకు కూడా ఇది తెలుసు. కొంతవరకు అర్థం చేసుకుని, సహిస్తారు. అది ఒక నిర్ణయంగా మారడానికి సమయం పడుతుంది. తాము గమనిస్తున్న ప్రతికూల అంశం ఒక నిష్పత్తి దాటిన తరువాత, జనం ఇక లెక్కపెట్టుకోవడం మొదలు పెడతారు. అవకాశం వచ్చినప్పుడు తమ చేతిలో ఉన్న



> ఇందిర నుంచి జగన్ దాకా అన్ని సన్నివేశాలలోనూ, ప్రజలు ఏదో ఒక అనుకూలతను లేదా ప్రతికూల అంశాన్ని పూర్తి అనుభవ జ్ఞానంతో లేదా సహజాత శక్తితో గ్రహించారు. పత్రికల్లోనూ టీవీ చర్చల్లోనూ సిద్ధాంత చర్చల్లోనూ వినిపించే విశ్లేషణలతో, రాజకీయ కథనాలతో వారికి పెద్దగా నిమిత్తం ఉండదు. తాము కనెక్ట్ అయ్యే ఒక సంకేతం వారికి అందితే చాలు. ఉష్ణోగ్రతో శీతలత్వమో వారికి తాకితే చాలు. అట్లాగని, ప్రజాపక్ష మేధావులు, ఉద్యమకారులు కల్పించే భావ వాతావరణం అవసరం లేదని కాదు. ప్రజల గ్రహింపును అది ఉద్దీపింపజేస్తుంది. ఆ పౌరసమాజం తమ ఆలోచనలతో చర్చలతో కల్పించే వాదనా, సాధారణ ప్రజ గ్రహించే సంకేతమూ ఒకటే అయినప్పుడు, వాటి ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో అయితే, అది ప్రభంజన ఫలితంగా ఉంటుంది.

ఆయుధాన్ని ఉపయోగించుకుంటారు. పూర్తి అక్షరాస్యత ఉండి, రాజకీయచైతన్యం అధికంగా ఉండే పశ్చిమదేశాలలో సైతం అన్నీ తెలిసి ఓటు చేయగలిగే వివేకం లేదు. ఇక, భారత్ వంటి ఎదుగుతున్న దేశంలో, పూర్తి అవగాహనతో, విచక్షణతో ఓటు చేయగలిగే పరిస్థితి ఎక్కడ? అందుకని, సులభ సంకేతాల నుంచే ప్రజల సమ్మతి కానీ, అసమ్మతి కానీ రూపొందుతుంది. మనసు పడడమో, మనసు విరగడమో!

అయితే, ఓటు ఆయుధానికి పెద్ద పదును లేదు. ఒకరిని తీసి మరొకరిని ఎక్కించడానికి తప్ప ఓటరుకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. ముప్పాతిక సంవత్సరాల భారత ప్రజాస్వామ్యంలో చాలా గొప్పగా సాధించామని ప్రశంసకులు అంటుంటారు. సాధించింది శూన్యమని విమర్శకులూ అంటారు. ప్రజలు తమ అభిమతాన్ని ఎన్నికలలో స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితులు లేవని, అధికారం ఇమ్మని జనం ముందుకు వచ్చే అభ్యర్థుల మధ్య, పార్టీల మధ్య పెద్ద వ్యత్యాసమే లేదని, చట్టసభల ద్వారా కాక, వీధుల్లోనే ప్రజలు ఎక్కువ పోరాటాలు చేసి సాధించుకున్నారని రాజకీయ చరిత్రకారులు చెబుతుంటారు. ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి, గందరగోళపరచి, ప్రలోభపరచి జరిగే ఎన్నికల ప్రచారం ఏ విధంగా అవగాహనాయుత ఓటింగ్ సాధిస్తుందన్న ప్రశ్న సహేతుకమైనదే. ప్రజల తరఫున పనిచేయవలసిన ప్రజాప్రతినిధులు సామాజిక వనరులను, సంపదను ప్రైవేటు లాభార్జనాపరులకు కట్టబెట్టే కమిషన్ ఏజెంట్లుగా పని చేస్తున్నారన్నది కూడా చాలావరకు నిజమే. అట్లాగని, ఇంతకాలంగా జరుగుతూ వచ్చిన ఎన్నికలలోని ప్రజల తీర్పుల్లో ఒక క్రమంకానీ, అంతస్సూత్రం కానీ, మార్పు కానీ లేదని అనగలమా? భారతదేశంలోని వివిధ ప్రజా వర్గాలు అవకాశాలకు, అధికారానికి దగ్గర కాలేదని చెప్పగలమా? ప్రాంతాలు, లింగ, కుల తదితర సామాజిక వర్గాలు తమ సాధికారతాస్థలాన్ని విస్తరించుకోవడాన్ని విస్మరించగలమా? అదే సమయంలో, పారిశ్రామిక, కార్పొరేట్ సంపన్నులు, భూస్వామ్యవర్గాలు తమ తమ ప్రయోజనాలను రక్షించుకోవడానికి, తమ ఆస్తులను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడానికి, ఆర్థిక అంతరాలను అగాధాలుగా మార్చడానికి ఆయా ప్రభుత్వాలే ప్రత్యక్షంగానో పరోక్షంగానో కారణమని చెప్పకుండా ఉండగలమా?

ప్రజల అభిమతాన్ని సాధించడానికి చేసే రకరకాల విన్యాసాలు, ఆ సమ్మతి పొందిన తరువాత పొందిన అధికారంతో చేసే దాష్టీకాలూ భారత ప్రజాస్వామ్య చరిత్ర పొడవునా చూడవచ్చు. అయితే, ప్రజలు ఈ క్రమంలో కేవలం మభ్యపడేవారిగాను, మాయకు లోబడేవాళ్లుగాను లేరు. వారు కూడా పరిస్థితులను ఓట్ల ద్వారానో, ఉద్యమాల ద్వారానో మారుస్తూ వచ్చారు. చాయిస్ లేకపోవడం వల్లా, తీవ్ర ఉద్వేగాల ప్రభావం వల్లా ప్రజలు కొన్ని సందర్భాలలో గాలివాటంలో కొట్టుకుపోయిన మాట నిజమే. అందుకు కూడా కొన్ని నిగూఢ రాజకీయార్థిక, ఉద్వేగ కారణాలు ఉండవచ్చు. కానీ, ఎక్కువ కాలం అహంకారాన్ని, ఉన్మాద రాజకీయాలను భారత ప్రజలు సహించిన ఉదాహరణలు లేవు. 1970 దశకం మొదట్లో విజయేందిరగా జయజయధ్వానాలు అందుకున్న ఇందిర, అయిదేళ్లు గడిచేసరికి నియంతగా నిలబడ్డారు, మరో రెండేళ్లకు ఘోరపరాజయం పొందారు. కలహాల జనతా పాలన తిరిగి ఇందిరకే దారి ఇచ్చింది. కార్గిల్ నేపథ్యంలో అవతరించిన మొదటి ఎన్డీయే ప్రభుత్వం, ఐదేళ్లకే దేశం మెరిసిపోతున్నదన్న ఆభాస నినాదంతో పరాజయం పాలయింది. రాజీవ్ ప్రభంజనాన్ని ఎదుర్కొని ఘన విజయం సాధించిన ఎన్టీయార్ తరువాతి దఫాకు



■ కె. శ్రీనివాస్

సందర్భం

ఘోరంగా ఓడిపోయారు. తరువాత అధికారం పొందిన కాంగ్రెస్ ఏడాదికో ముఖ్యమంత్రిని మార్చి, సకల రంగాలలో విధ్వంసపాలన అమలుజరిపి, తిరిగి జనం అదే ఎన్టీయార్‌కు ఘనవిజయం ఇచ్చేట్టు చేసింది. వ్యవసాయానికి, గ్రామీణరంగాలకు వ్యతిరేకమన్న ముద్ర 2004లో చంద్రబాబుకు ప్రతికూలంగా పనిచేసింది. కానీ, నగరాభివృద్ధిలోను, పాలనలోను ఉన్న అనుభవం కారణంగా విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆయనను మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఒక అవకాశం ఇద్దామని జగన్మోహన్ రెడ్డికి ఇచ్చిన అవకాశం దుష్పరిపాలనకు దారితీయడంతో, ఇప్పుడు తిరిగి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు వేటు వేసి తీరతారన్న వాతావరణం వ్యాపించి ఉంది. ఈ అన్ని సన్నివేశాలలోనూ, ప్రజలు ఏదో ఒక అనుకూలతను లేదా ప్రతికూల అంశాన్ని పూర్తి అనుభవ జ్ఞానంతో లేదా సహజాత శక్తితో గ్రహించారు. పత్రికల్లోనూ టీవీ చర్చల్లోనూ సిద్ధాంత చర్చల్లోనూ వినిపించే విశ్లేషణలతో, రాజకీయ కథనాలతో వారికి పెద్దగా నిమిత్తం ఉండదు.

> పూర్తి అక్షరాస్యత ఉండి, రాజకీయ చైతన్యం అధికంగా ఉండే పశ్చిమదేశాలలో సైతం అన్నీ తెలిసి ఓటు చేయగలిగే వివేకం లేదు. ఇక, భారత్ వంటి ఎదుగుతున్న దేశంలో, పూర్తి అవగాహనతో, విచక్షణతో ఓటుచేయగలిగే పరిస్థితి ఎక్కడ? అందుకని, సులభ సంకేతాల నుంచే ప్రజల సమ్మతి కానీ, అసమ్మతి కానీ రూపొందుతుంది. మనసు పడడమో, మనసు విరగడమో!

తాము కనెక్ట్ అయ్యే ఒక సంకేతం వారికి అందితే చాలు. ఉష్ణోగ్రతో శీతలత్వమో వారికి తాకితే చాలు. అట్లాగని, ప్రజాపక్ష మేధావులు, ఉద్యమకారులు కల్పించే భావ వాతావరణం అవసరం లేదని కాదు. ప్రజల గ్రహింపును అది ఉద్దీపింపజేస్తుంది. ఆ పౌరసమాజం తమ ఆలోచనలతో చర్చలతో కల్పించే వాదనా, సాధారణ ప్రజ గ్రహించే సంకేతమూ ఒకటే అయినప్పుడు, వాటి ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో అయితే, అది ప్రభంజన ఫలితంగా ఉంటుంది.

2014 నుంచి రెండు దఫాలు నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడడానికి ప్రాథమికంగా ప్రజలు కనెక్ట్ అయిన సంకేతాలే కారణం. యూపీఏ ప్రభుత్వం అవినీతో, విధాన వైకల్యమో, బీజేపీ అచ్ఛేదిన్ వాగ్దానమో ఏదో మొగ్గును సృష్టించింది. 2019లో తీవ్ర జాతీయభావాల దగ్గర నుంచి మతభావోద్వేగాల దాకా ప్రజల మనస్సులను ఆవరించాయి. ప్రతిపక్షం అత్యంత బలహీనంగా ఉండడం మరో కారణం. సాధించినవాటిని గొప్పగా చెప్పుకోవడం కంటె, బలహీనంగా కనిపిస్తున్న ప్రత్యర్థి విధానాంశాలే ప్రస్తుత ఎన్నికల్లో ఎందుకు చర్చలో ఉంటున్నాయి? రాముడికి ఉన్న అహంకార జ్ఞానం రామ ప్రతినిధులమని చెప్పే రాజకీయవాదులకు ఉండడం లేదా? సుభాష్ చంద్ర 'అహంకారం' అని గుర్తించిన దాన్ని, సాధారణ ప్రజలు నియంతృత్వంగానో, పరమాధి కారంగానో గుర్తిస్తున్నారా? 2024లో ఓటర్లకు అందవలసిన సంకేతం అందిందా?

శక్తిమంతమైన దేశం బీజేపీ లక్ష్యం

అభివృద్ధి పేరిట అవినీతిని ప్రోత్సహించిన ఘనత కాంగ్రెసుది.. అభివృద్ధి పేరుతో ఈ దేశానికి కొత్త నగిషీలు చెక్కింది బీజేపీ. కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించింది. బీజేపీయేతర ప్రభుత్వాలకు కూడా ఎలాంటి వివక్షకు తావులేకుండా కేంద్ర నిధులను ఇచ్చింది. సమాఖ్య స్ఫూర్తిని చాటింది. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ పేరుతో ప్రాంతీయ ఉత్పత్తులకు పెద్దపీట వేయడం వంటి నిర్ణయాలతో దేశాన్ని బలమైన పునాదుల మీద నిర్మాణం చేస్తున్నది. పునాది సామర్థ్యం మీదే భవన బలం ఆధారపడి ఉంటుంది.. అలాగే ఈ దేశం శక్తిమంతమైన దేశంగా ఆవిర్భవించాలంటే బలమైన పునాదులు అవసరం. ఆ కార్యాన్ని నరేంద్రుడు భుజానికెత్తుకున్నాడు. దేశాన్ని తిరుగులేని శక్తిగా నిలుపుతున్నాడు.

పదేళ్లలో వినూత్నమైన మార్పులు తీసుకొచ్చింది బీజేపీ. వివాదాస్పద 370 ఆర్టికల్‌ను కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొని జమ్మూ–కాశ్మీర్‌ను రావణకాష్ఠంలా మార్చింది. అందుకే ఆ ఆర్టికల్ రద్దు చేసి ఒకే దేశం–ఒకే రాజ్యాంగం–ఒకే జెండా అనే విధానాన్ని అమలు చేసింది. పొద్దున లేస్తే మేధావుల పేరిట బీజేపీని వ్యతిరేకించేవారు సైతం ట్రిపుల్ తలాక్ విషయంలో బీజేపీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించక తప్పని పరిస్థితిని కల్పించింది. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకమని చెప్పుకునేవారు. కానీ, ట్రిపుల్ తలాక్ రద్దు తర్వాత ముస్లిం మహిళలు బీజేపీ జెండాను ఆయా చోట్ల గుండెలకు హత్తుకున్నారు. ఏళ్లనాటి కల సాకారం అయిందని ఉద్వేగాన్ని ప్రదర్శించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాలతో మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా చెత్తబుట్టలో వేసింది. అవసరమైనప్పుడు కదిలించి.. ఎన్నికలయ్యాక దానిని పక్కన పెట్టడం కాంగ్రెస్‌కు షరామామూలే. కానీ, దశాబ్దాల ఆకాంక్షయిన మహిళా బిల్లును ప్రవేశపెట్టి మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది బీజేపీ. ఈ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నానా యాగీ చేసినా, ఆ అవాంతరాలను కూడా దాటుకొని మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేయించిన ఘనత బీజేపీది.

పదేళ్ల నరేంద్రుని పాలన ఈ దేశానికి ఓ మార్గం చూపింది. ఇప్పుడు ఆ తోవలో మరిన్ని విజయాలను అందుకునేందుకు దేశమంతా బీజేపీ విజయం కోసం వెయ్యికళ్ళతో ఎదురు చూస్తోంది. ఇప్పటికే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే యూసీసీ (యూనిఫామ్ సివిల్ కోడ్), ఒకే దేశం–ఒకే ఎన్నిక, ఎన్నార్సీ వంటి కీలక బిల్లులను తీసుకురానుంది. ఇదంతా సుస్థిరమైన, సమర్థవంతమైన నాయకత్వంతోనే సాధ్యం.

– కిరణ్ చింతపల్లి, ఉస్మానియా యూనివర్సిటీ

ఆట ఓ యుద్ధతంత్రం

వాడు బరిలో లేడు
అయినా../ వాడితోనే ఆట మొదలైంది
ఎవడు కూత పెడుతున్నాడో
ఎవడు పట్టుబడుతున్నాడో/ అంతా గందరగోళమే
పొంచి పొంచి/ పంజా విసురుతూ
పరుగుకాళ్ళకు సంకెళ్ళేస్తూ...
గీత కివతలి వైపే మూసేస్తున్నారు
కూత కంఠాన్ని ఆపేస్తున్నారు
పంపేవాడొకడు... వచ్చేవాడొకడు
వొక్క పాయింటన్నా తెస్తాడనీ
'కోటి' ఆశల సూటు 'కేసు' లెన్నో
ఒకరి ఆట ఇంకెవ్వరో ఆడేస్తున్నారు
మరెవడో అవుటై పోతున్నాడు
బలాల బలగాల కలగాపులగాలకు
ఎంపైర్లూ దోషులవుతున్నారు
ప్రత్యక్షదృశ్యాలన్నీ పరదా చాటుకు వెళుతున్నాయి
పొట్టి క్రికెట్ ఆటలా/ గెలుపు ఓటములు
చివరి బంతి వరకూ ఓ సందిగ్ధం
ఆట ముగియకముందే
గెలుపు మీసం మెలేస్తున్నాడొకడు
ప్రచారహోరులో మాటల తూటాలు
దూసుకొస్తున్నాయి../ దుమ్ము రేపుతున్నాయి
ఇప్పుడు ఆటంటే..!/ ఆనందాల వినోదం కాదు
గెలుపు దృశ్యమంటే/ ఆట ముగింపు అంతకన్నా కాదు
శకుని పాచికలాట/ రాజ్యాలను కూల్చే కుతంత్రం
ఎత్తుకు పై ఎత్తుల తంత్రం
ప్రతీ రంగంలోనూ
శత్రువుంటాడు... మిత్రుడూ ఉంటాడు
పరోక్షంగా ఓ యుద్ధం దాగుంటుంది.
ఇప్పుడు యుద్ధమంటే..!
శత్రువుతో పోరాటం కాదు
మిత్రుడి వెన్నుపోటును గుర్తించటమే

– డా. కటుకోఝ్వల రమేష్

కమీషన్ల కాళేశ్వరాన్ని ఎంతకని సమర్థిస్తారు?

ఏప్రిల్ 25, 2024 రోజున ఆంధ్రజ్యోతి దినపత్రికలో వీరమల్ల ప్రకాష్ రాసిన వ్యాసం 'కాళేశ్వరంపై అకారణంగా విషం చిమ్ముతారు ఎందుకు?' శీర్షికన ప్రచురితమైంది. ఈ వ్యాసంలో ప్రకాష్ తెలంగాణలో ఎత్తిపోతల ప్రాజెక్టును నేను వ్యతిరేకిస్తున్నట్టు ప్రస్తావించడం చూస్తే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో జరిగిన అవకతవకల పైనుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. అదేవిధంగా కేవలం ఖర్చులు – ప్రయోజనాల నిష్పత్తి కోణంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును నేను వ్యతిరేకిస్తున్నట్టుగా ప్రకాష్ చెప్పడం పూర్తిగా అవాస్తవం. నేను రాసిన వ్యాసాల్లో కేవలం ఖర్చులు – ప్రయోజనాల నిష్పత్తి ఆధారంగా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని చెప్పలేదు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కంట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) తన నివేదికలో స్పష్టంగా చెప్పింది. ఈ ప్రాజెక్టుపై ఖర్చు పెట్టే ప్రతి వంద రూపాయలకు కేవలం 52 రూపాయల ప్రయోజనం మాత్రమే లభిస్తుందని వెల్లడించింది. నేను ఇంతకుముందు రాసిన వ్యాసాల్లో సాంకేతిక సంక్లిష్టత, పర్యావరణ ముప్పు, నిర్మాణంలో నాణ్యత లోపం, ఉద్దేశపూర్వకంగా స్వప్రయోజనాల కోసం ప్రాజెక్టు ఖర్చును విపరీతంగా పెంచడం, ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే ప్రయోజనాలకు మించి నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండి అవి తెలంగాణ అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచే పరిస్థితి.. ఈ వాస్తవాలను ప్రస్తావించాను. భవిష్యత్తులో ఈ కాళేశ్వరం ప్రాజెక్టును ఇక ముందుకు తీసుకోకపోవడం ఆపి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాను.

ప్రకాష్ తన వ్యాసంలో అమెరికాలోని కొలరాడో నదిపై కట్టిన హూవర్ డ్యాము, ఈజిప్టులో నైలు నదిపై నిర్మించిన అస్వాన్ డ్యాము, చైనాలో యాంగ్జీ నదిపై నిర్మించిన త్రీ గార్జెస్ డ్యామ్‌లను ప్రస్తావిస్తూ కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును సమర్థించే ప్రయత్నం చేశాడు. ఒక మామిడిపండును రేగుపండుతో పోల్చినట్లు ఉంది ప్రకాష్ చేసిన ప్రయత్నం. ఎందుకంటే చైనా, ఈజిప్టు, అమెరికాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టులు గ్రావిటీ ఆధారంగా కేవలం ఉపరితల కాలువల ద్వారా వ్యవసాయానికి నేరుగా నీరు అందించే ప్రాజెక్టులు. అంటే ప్రస్తుతం మన నాగార్జునసాగర్ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు వంటివి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు విషయానికొస్తే ఇది పూర్తిగా ఎత్తిపోతల ద్వారా పనిచేసే ప్రాజెక్టు. ప్రకాష్ ఇలా ఏ విధంగా పొంతన లేని పోలికతో నేను భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు వ్యతిరేకమనే భావన కలిగించే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా మన దేశంలో, మన రాష్ట్రంలో ఉన్న గ్రావిటీ ఆధారిత ప్రాజెక్టులైన బాక్రానంగల్, తుంగభద్ర, హిరాకుడ్, నాగార్జునసాగర్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను ప్రస్తావించకుండా, తెలంగాణ ప్రజలకు చైనా అమెరికా ఈజిప్టులలో నిర్మించిన ప్రాజెక్టులపై అవగాహన లేదని భావించి, ఉద్దేశపూర్వకంగా ఏ మాత్రం పోలిక లేకుండానే ఈ భారీ నీటిపారుదల ప్రాజెక్టులతో కాళేశ్వరం ప్రాజెక్టును పోల్చారు. ఇంకా తెలంగాణ ప్రజలు అమాయకులనే భావనలోనే కేసీఆర్ భజన మండలి ఉన్నట్టు దీన్నిబట్టి అర్థమవుతుంది.

ఏప్రిల్ 11, 2024న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన నా వ్యాసం 'కాళేశ్వరానికి ఒక పాత రష్యన్ ప్రాజెక్టు గుణపాఠం'లో రెండు ఎత్తిపోతల ప్రాజెక్టుల మధ్య ఉన్న పోలికలను ప్రస్తావించాను. పూర్వపు సోవియట్ యూనియన్ తలపెట్టిన భారీ నదీ జలాల మరలింపు

> ఇతర దేశాల్లోనూ ఉన్న పూర్వ అనుభవాలను పరిగణించకుండా, ముఖ్యంగా పూర్వపు సోవియట్ భారీ నదీజలాల మరలింపు ప్రాజెక్టు గుణపాఠాలను పూర్తిగా విస్మరించి, సొంత ఇంజనీర్ల నిపుణుల కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి కేవలం స్వప్రయోజనాలు, కమీషన్ల కోసం మాత్రమే ఈ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. ఈ అడ్డుగోడను ఎంత త్వరగా తొలగించుకుంటే భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అంత ఆర్థిక వనరుల కొరత తగ్గుతుంది.

ప్రాజెక్టును నిలిపివేయడానికి ఆనాటి సోవియట్ యూనియన్ ప్రణాళిక సంఘం స్పష్టంగా చెప్పిన మూడు కారణాలు ఏమిటంటే– సాంకేతికంగా ఈ ప్రాజెక్టు చాలా సంక్లిష్టమైనదని, పర్యావరణానికి పెద్ద ముప్పని, ఇంకా ఆర్థికంగా భారమని. కానీ ప్రకాష్ ఏప్రిల్ 25, 2024న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన తన వ్యాసంలో ఈ రష్యన్ నదీ జలాల మరలింపు ప్రాజెక్టును రాజకీయ కారణాలవల్ల మూసివేసినట్టుగా తన ఊహాగానంతో సృష్టించిన కారణాలను చెప్పుకొస్తూ, ఆ అనుభవాలు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు వర్తించవని చెప్పే ప్రయత్నం చేశారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. అంతేగాక నా వ్యాసంలో స్పష్టంగా తెలిపినట్టు ఈ పూర్వపు సోవియెట్ యూనియన్ భారీ నది జలాల మరలింపు ప్రాజెక్టు 1986లో పూర్తిగా మూసివేసిన తర్వాత ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఇలాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోలేదు. దీనికి ప్రధాన కారణం సోవియెట్ యూనియన్ అనుభవాలు. కానీ ఈ విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా ప్రకాష్ పోలిక లేని అమెరికా, ఈజిప్ట్, చైనాల్లోని గ్రావిటీ ఆధారిత భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులను కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో పోల్చారు.

ఈ సందర్భంగా నీటిపారుదల ప్రాజెక్టులలో భారతదేశం ఇతర ఆసియా దేశాలకు ఏ విధంగా దిక్సూచి అయిందో తెలుసుకోవడం అవసరం. 1947లో స్వాతంత్ర్యం అనంతరం మన దేశంలో మొత్తం



నీటిపారుదల కింద ఉన్న నికర విస్తీర్ణం కేవలం ఐదు కోట్ల ఎకరాలు మాత్రమే. ఈ విస్తీర్ణం కూడా దాదాపు ఎక్కువ శాతం చెరువులు, బావుల కింద ఉండేది. స్వాతంత్ర్యానంతరం భారతదేశం పేదరికం, ఆహార కొరత, కరువు, నిరుద్యోగం లాంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉండేది. వీటి పరిష్కారంలో భాగంగా తొలి ప్రధాని నెహ్రూ మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలో (1951–1966) భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి 1960వ దశకంలోనే ఏడు భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించి దేశానికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. ఆ తదనంతరం ఇదే పరంపరని కొనసాగిస్తూ వివిధ భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులను 1985 వరకు నిర్మించారు. మొత్తం దేశంలో ఉన్న జాతీయ హోదాతో కూడిన 16 భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, మరో వంద మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులన్నీ దాదాపుగా 1951 నుండి 1980 మధ్యకాలంలో నిర్మించినవే. ఇవేగాక దాదాపుగా మరో 4000 చిన్న తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులను వివిధ రాష్ట్రాలలో ఇదే కాలంలో నిర్మించారు. వీటి ఫలితంగా దేశంలో నికరంగా నీటిపారుదల విస్తీర్ణం 2014 నాటికి 17 కోట్ల ఎకరాలకు చేరింది. ఆహార ధాన్యాలు ఉత్పత్తి 6 రెట్లు పెరిగి, పేదరికం గణనీయంగా తగ్గి, ఆహార భద్రతను సాధించాం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం ప్రత్యక్షంగా చూసాం. నెహ్రూ అభివృద్ధి విధానంలో భాగంగా నిర్మించిన భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రయోజనాలను చూసి 1965 తరువాత ఆసియా ఖండంలో వివిధ దేశాలు నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి సారించి కొత్త ప్రాజెక్టులు నిర్మించారు. ఉదాహరణకు థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియా లాంటి ఆగ్నేయ ఆసియా దేశాల్లోనూ, ప్రకాష్ ప్రస్తావించిన చైనాలోని యాంగ్జీ నదిపై త్రీ గార్జెస్ డ్యాము (1994 నుండి 2003), ఈజిప్ట్‌లో నైలు నదిపై అస్వాన్ డ్యాము (1960 నుండి 1970) లాంటివి నిర్మించారు. ఈ విధంగా మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ నిర్మించిన అన్ని భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు గ్రావిటీ ఆధారిత భూమి ఉపరితల కాలువల ద్వారా నేరుగా వ్యవసాయానికి నీరు అందించే విధంగా మాత్రమే నిర్మించారు. ప్రపంచంలో ఎక్కడ కూడా కాళేశ్వరం లాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించలేదు.

ఇలా మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న పూర్వ అనుభవాలను పరిగణించకుండా, ముఖ్యంగా పూర్వపు సోవియట్ భారీ నది జలాల మరలింపు ప్రాజెక్టు గుణపాఠాలను పూర్తిగా విస్మరించి, సొంత ఇంజనీర్ల నిపుణుల కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి కేవలం స్వప్రయోజనాలు, కమీషన్ల కోసం మాత్రమే ఈ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధికి పెద్ద అడ్డు గోడగా మారే ప్రమాదం ఉంది. ఈ అడ్డుగోడను ఎంత త్వరగా తొలగించుకుంటే తెలంగాణ అభివృద్ధికి అంత ఆర్థిక వనరుల కొరత తగ్గుతుంది.

■ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య
వ్యవసాయ ఆర్థికవేత్త

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
గురువారం 9 మే 2024

వరంగల్ లక్ష్మీపూర్‌లో జరిగిన బీజేపీ జనసభకు హాజరైన ప్రజలు





నాయకులు బహూకరించిన గదతో మోదీ

కమల వికాసం తథ్యం

మిల్స్‌కాలనీ(వరంగల్), మే 8: ప్రజలు బీజేపీపై అత్యంత విశ్వాసంతో ఉన్నారని, ఓరుగల్లులో 'కమలం' వికసించడం తథ్యమని, ఇక్కడ ఎగిరేది బీజేపీ జెండా యేనని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. పార్ల మెంట్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఖిలావరంగల్ మండలం లక్ష్మీపూర్‌లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ జనసభకు ఆయన హాజరయ్యారు. 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం' అంటూ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన సుమారు 46 నిమిషాల పాటు మాట్లాడారు. తన కర్మభూమి అయిన అహ్మ దాబాద్‌లో తాను పూజించేది, వరంగల్‌లో ఉన్నది భద్రకాళి అమ్మవారేనన్నారు. భద్రకాళికి, రామప్ప దేవాలయానికి నమస్కరిస్తూ.. కాకతీయుల సామ్రాజ్య గౌరవానికి ఇవి ప్రతీకలని కొనియాడారు. 1984 ఎన్నికల్లో దేశంలో బీజేపీ గెలిచిన రెండు స్థానాల్లో హనుమకొండ ఒకటని, కష్టకాలంలో వరం గల్ ప్రజలు బీజేపీకి అండగా నిలిచారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం, పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం బీజే పీనే గెలిపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రజలను కాంగ్రెస్, బీఆర్ఎస్ కబంధ హస్తాల్లోంచి విడిపించేం దుకు బీజేపీ ప్రయత్నం చేస్తోందని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమ్మక్క-సారక్క గిరిజన విశ్వవిద్యా లయం ఏర్పాటు చేస్తుంటే రాష్ట్రంలోని కాంగ్రెస్ మాత్రం అడ్డంకులు సృష్టిస్తోందని, అలాగే వరంగ ల్‌లో టెక్స్‌టైల్ పార్కును ప్రారంభిస్తే దాని నిర్వహ ణకు అడ్డంకిగా మారిందన్నారు. వేదికపై ఉన్న మంద కృష్ణమాదిగను చూపిస్తూ తన చిన్న తమ్ముడు కృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం అహర్నిశలు కష్టపడుతున్నా డని, పోరాటాలు చేస్తున్నాడని, ఎస్సీ వర్గీకరణ చేస్తా నని తాను ఇదే గడ్డపై హామీ ఇచ్చానని, ఆ హామీని నెరవేర్చి చూపుతానని స్పష్టం చేశారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ గెలిచిన అభ్యర్థుల కోసం భూతద్దం పెట్టి వెతుక్కోవాలని ఎద్దేవా చేశారు.

- అభివృద్ధి, భవిష్యత్ కోసం బీజేపీనే గెలిపించాలి
- భద్రకాళి, రామప్ప ఆలయాలు కాకతీయుల గౌరవానికి ప్రతీకలు
- గిరిజన వర్సిటీ ఏర్పాటు, టెక్స్‌టైల్ పార్కు నిర్వహణకు కాంగ్రెస్ అడ్డంకులు సృష్టిస్తోంది..
- కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్‌ను ఆ పార్టీ కాపాడుతోంది..
- రాష్ట్రంలో 'ఆర్ఆర్' ట్యాక్స్ అమలవుతోంది
- ఓరుగల్లు జన సభలో ప్రధాని నరేంద్ర మోదీ

వేములవాడ రాజన్న మీద ఒట్లు పెడుతూ, సనాతన ధర్మాన్ని తూలనాడుతున్న కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లు వేద్దామా.. అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ హామీలన్నీ అబద్ధాలే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలేనని మోదీ కొట్టిపారేశారు. రాష్ట్రం కోసం బలిదానమైన వారి కుటుంబాలకు పింఛను, 250 చద రపుగజాల ఇంటి స్థలాన్ని ఇస్తా మని మోసం చేశారన్నారు. అధికా రంలోకి రాగానే మహిళలకు ఇస్తా మన్న రూ.2500 పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారని, రాష్ట్రంలో వి ద్యుత్ కోతలు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో 'డబుల్ ఆర్' ట్యాక్స్ నడుస్తుందని, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి హైదరాబాద్‌లోని ఒక ఆర్‌కు, ఢిల్లీ లోని మరో ఆర్‌కు పంపుతున్నారని రేవంత్, రాహుల్‌గాంధీని ఉద్దేశించి పరోక్ష విమర్శలు చేశారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి దాన్ని ఆగస్టు 15కు వాయిదా వేశారని, ఆ తర్వాత చేతులెత్తేయడం ఖాయమన్నారు.



ప్రధాని నరేంద్ర మోదీ చిత్ర పటంతో బాలుడు

కమలం శ్రేణుల్లో జోష్
ప్రధాని మోదీ పర్యటన సాగిందిలా.. 7



వరంగల్, మానుకోట అభ్యర్థులు అరూరి రమేశ్, సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ సర్కారు కాపాడుతోంది..

రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ కాపాడుతుందని, కాళేశ్వరం ప్రాజెక్టు రూపంలో బీఆర్ఎస్ అక్రమాలు చేస్తే దానిని కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ శతవిధాలా ప్రయత్నాలు చేస్తోందని ప్రధాని విమర్శించారు. బీఆర్ ఎస్ అక్రమాలకు కాంగ్రెస్ పరోక్ష సహకారంతో కాళేశ్వరం పాపాన్ని రైతులు మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికా రంలోకి వస్తే దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తానని వాళ్లు మోసం చేశారని, ఇప్పుడు కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలతో తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుంద న్నారు. రాష్ట్రంలోని రైతులకు బీజేపీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని, పసుపు బోర్డును ఏర్పాటు చేసిందని, వరి, పత్తికి మద్దతు ధరలు చెల్లి స్తోందని, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించామని, దీంతో రైతులకు ఎరువులు, యువతకు ఉపాధి కల్పన దొరుకుతున్నాయని వివ రించారు. రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి అందుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను తగ్గించి వాటిని ముస్లింలకు కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆరోపించారు. దేశం లోని అన్ని వర్గాల రిజర్వేషన్లు తగ్గించి ముస్లింలకు కట్టబెట్టడాన్ని మీరు సమ ర్థిస్తారా.. అని ప్రశ్నించారు. అలాంటి మోసకారి కాంగ్రెస్‌ను భూస్థా పితం చేయాలని పిలుపుని చ్చారు. శరీర రంగును బట్టి సామర్థ్యతను నిర్ధారించే కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.



కాంగ్రెస్ ఎక్కడుంటే అక్కడ స్కాంలే..

పదేళ్ల కిందట కాంగ్రెస్ చేసిన స్కాంలు అందరికీ తెలిసినవేనని, స్కాంలు, వరుస బాంబు పేలుళ్లు ఇవే నాడు అభివృద్ధికి ఆటంకా లుగా నిలిచాయని మోదీ పేర్కొన్నారు. ఇండియా కూటమిలో ఒక్కో పార్టీలో ఒక్కో ప్రధాని అభ్యర్థి ఉన్నారని, ఐదేళ్లు ఒక్కో ప్రధాని పాలన చేస్తారని ఎద్దేవా చేశారు. ఇలాంటి పాలన ఎలా ఉంటుం దో ప్రజలు నిర్ణయించుకోవాలని, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు ఆ పార్టీకి ఏటీఎంలుగా మారుతున్నాయని, జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎంపీ ఇంట్లో రూ.300 కోట్ల నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయన్నారు. ప్రధానిగా తాను వారి అవినీతి అక్రమాలపై చర్యలు తీసుకుంటుంటే వారు తనను తిడుతున్నారన్నారు.

అరూరి, సీతారాం నాయక్‌ను గెలిపించాలి

వరంగల్ నుంచి అరూరి రమేష్‌ను, మహబూబాబాద్ నుంచి సీతారాం నాయక్‌ను గెలిపించాలని కోరిన మోదీ.. ఇద్దరిని పార్లమెంట్‌కు పంపి తన బలాన్ని పెంచాలని, ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధిని సాధిం చుకోవాలన్నారు.

ఈ సభలో వరంగల్, మాను కోట అభ్యర్థులు అరూరి రమేష్, డాక్టర్ సీతారాం నాయక్, ఎమ్మా ర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, క్రమశిక్షణ కమి టీ రాష్ట్ర చైర్మన్ మార్తినేని ధర్మా రావు, పార్లమెంట్ ప్రభారి డాక్టర్ మురళీధర్‌గౌడ్, బీజేపీ వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, స్థానిక కార్పొరేటర్ జలగం అనిత రంజిత్‌రావు తదిత రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు బంగారు భవిష్యత్తు

- దేశాన్ని అమ్మకానికి పెడుతున్న మోదీ
- వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య
- తొర్రూరులో రోడ్‌షో, కార్నర్ మీటింగ్



తొర్రూరు కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న కడియం కావ్య

తొర్రూరు, మే 8: కాంగ్రెస్‌తోనే పేదలకు బంగారు భవిష్యత్తు అని, రాహుల్‌గాంధీ దేశం కోసం ఎంతో కష్టపడుతున్నారని వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. బుధవారం సాయంత్రం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ముందు రోడ్‌షోలో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో ఆమె మాట్లాడుతూ.. వరంగల్ లోక్‌సభకు 25 ఏండ్ల తర్వాత ఓ మహిళకు పోటీచేసే అవకాశం వచ్చిందన్నారు. తాను డాక్టర్‌నని, పేద ప్రజలకు ఉచితంగా వైద్యం అంది స్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మరింత సేవ చేయడా నికే తాను లోక్‌సభ అభ్యర్థిగా నిలడ్డానన్నారు. బీజేపీకి మళ్లీ అధికారంలోకి వస్తే ప్రజలకు కష్టాలు తప్పవని, ప్రజల ఆస్తులను ప్రధాని మోదీ ఇప్పటికే కార్పొరేట్ సంస్థలకు కట్ట బెడుతూ అమ్మకానికి పెడుతున్నాడని ఆరోపించారు. మతం పేరుతో ప్రజల మధ్య ద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. రాజ్యాంగంలో హక్కులను కాలరాసేందుకు బీజేపీ చూస్తోందని తెలిపారు. రాజ్యాంగంలో మార్పులు జరిగితే ప్రతీ ఒక్కరిపై ప్రభావం ఉంటుందని, ప్రజలు గౌరవప్రదమైన జీవితాన్ని పొందలే రని, హక్కులు కోల్పోతామని ఆందోళన వ్యక్తం చేశారు.

మతాలను విడదీసి రాక్షసపాలన సాగిస్తున్నాడని కావ్య ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలపై దాడులు జరు పుతూ కుల, మతాల పేరుతో ప్రజలను కష్టాలపాలు చేశా డన్నారు. రాజ్యాంగం లౌకికత్వం ప్రమాదంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంబేద్కర్‌ను అవమాన పరిచే వి ధంగా మోదీ వైఖరి ఉందని, భవిష్యత్ కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కేంద్రంలో 5 న్యాయ సూత్రాలతో అన్ని పథకాలు అమలు చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు అమలుప ర్చారని, ప్రతిపక్షాలు చెప్పే మోసపూరిత మాటలు నమ్మవ ద్దన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతీ పేద మహిళ ఖాతాలో ఏటా రూ.లక్ష జమ, వంద రోజుల ఉపాధి పనులను 200 రోజులకు పొడగిస్తామ న్నారు. వరంగల్ జిల్లాను విభజించిన బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. బీజేపీ అభ్యర్థి భూములు మింగే అన కొండ అని, వర్ధన్నపేటలో సెంటు భూమిని కూడా వదలలే దని దాంతో ప్రజలు బుద్ధిచెప్పారన్నారు. ఈ ఎన్నికల్లో ఆరూరి రమేష్‌కు ఓటు వేయవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

కావ్యను గెలిపించాలి..

లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యకు ఓటువేసి, గెలిపిం చాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కోరారు. పాలకు ర్తిలో దయాకర్‌రావు చేసిన అభివృద్ధి శూన్యమని, చెన్నూరు రిజర్వాయర్ పేరుతో వేలకోట్ల రూపాయల కమీషన్లు దోచుకున్నారని విమర్శించారు. బీజేపీ ఒక మనువాద పార్టీ అని, భారత రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తి వేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలను రోడ్డున పడే యాలని కుట్ర చేస్తోందన్నారు. బీజేపీకి ఓటు వేసి భవిష్యత్తు ఆగం చేసుకోవ ద్దన్నారు. తెలంగాణను భ్రష్టు పట్టించింది కేసీఆర్ అని విమర్శించారు. కారు రిపే రుకు రావడంతో కేసీఆర్ బస్సెక్కారని, ప్రజలు బస్సును కూడా దించుతారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక సీటు కూడా రాదన్నారు. కడియం కావ్య విజయం సాధిస్తే నియోజకవర్గ అభివృద్ధికోసం అత్యధిక నిధులు వస్తా యన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామన్నారు. ప్రజలు కడియం కావ్యకు ఓటు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మునిసి పల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, పెదగాని సోమయ్య, తొర్రూరు, పెద్దవంగర, రాయపర్తి మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కడియం కావ్య

వరంగల్‌ను అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య

గీసుగొండ, మే 8: తనను వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి అధిక మెజారిటీతో గెలిపిస్తే వరంగల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య అన్నారు. మండలంలోని శాయంపేట, కొనాయిమాకుల గ్రామాల్లో బుధవారం నిర్వహించిన పార్టీ బూత్ కమిటీల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కుల మతాల పేరుతో బీజేపీ విద్వేషాలను సృష్టిస్తుందన్నారు. బీజేపీ శ్రీరాముడి పేరు చెప్పి ఓట్లు పొందాలని చూస్తుందన్నారు. బీజేపీ రాముడిని జెండాలపై చూపిస్తే కాంగ్రెస్ గుండెల్లో చూపిస్తుంద న్నారు. బీఆర్ఎస్ మాయమాటలను ప్రజలు నమ్మే స్థితి లో లేరన్నారు. చారిత్రాత్మక వరంగల్ స్థానాన్ని గెలిచి రాహుల్‌గాంధీకి గిఫ్టగా అందించాలని ఆమె కోరారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు లో భూములు కోల్పోయిన నిర్వా సితులకు ఇళ్ల స్థలాలను త్వరలోనే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. శాయంపేటలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో కడియం కావ్యతో కలిసి పాల్గొన్న ఆయన మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేసే కైటెక్స్, యంగ్వాన్ కంపెనీలలో 70 శాతం స్థానికులకు ఉపాధి కల్పించేందుకు ఆయా కంపెనీలు ఒప్పుకు న్నాయన్నారు. కావ్యను భారీ మెజారిటీతో గెలిపిం చేందుకు అందరు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఏఐసీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకట స్వామి, మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, పీసీసీ ప్రధాన కార్యదర్శి భీమగాని సౌజన్య, అధికార ప్రతి నిధి కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీని వాస్, ప్రవీణ్, కేదాసి మోహన్ పాల్గొన్నారు.

2.62లక్షల ఎకరాల్లో సాగు..

- ఖరారైన వానాకాలం ప్రణాళిక
- ఎరువులు, విత్తనాల నిల్వలకు ఏర్పాట్లు

వివరాలు : 8లో..

బుధవారం ఉష్ణోగ్రత	
గరిష్ఠం : 36.0° C	కనిష్ఠం : 20.5° C

గుజ్జులకే బీజేపీ అభ్యర్థిత్వం

- పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో ప్రేమేందర్‌రెడ్డి
- రెండోసారి ఖరారు చేసిన బీజేపీ అధిష్ఠానం



హనుమకొండ టౌన్, మే8: వరంగల్- ఖమ్మం- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక బీజేపీ అభ్యర్థిగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఆ పార్టీ ఎంపికచేసింది. ఈ మేరకు బుధవారం పార్టీ అధిష్ఠానం అధికారికంగా ప్రకటన విడుదల చేసింది. ఈ స్థానానికి ప్రేమేందర్‌రెడ్డితో పాటు పార్టీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శులైన కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి, వరంగల్‌కు చెందిన పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తీవ్రంగా ప్రయత్నం చేశారు. అయినా రెండోసారి మళ్లీ ప్రేమేందర్‌రెడ్డి వైపే అధిష్ఠానం మొగ్గు చూపింది.

హనుమకొండ జిల్లా దామెర గ్రామంలో గుజ్జుల వెంకటకృష్ణారెడ్డి- చిలు కమ్మ దంపతులకు జన్మించిన ప్రేమేందర్‌రెడ్డి.. డిగ్రీ వరకు వరంగల్‌లోనే విద్యను అభ్యసించారు. ఆ తర్వాత ఉస్మానియా

మిగతా 8వ పేజీలో..

రాబోయే కాలం బీఆర్ఎస్‌దే..

- కాంగ్రెస్, బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయింది
- పార్లమెంట్‌లో బీఆర్ఎస్ గళం బలంగా ఉండాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- దేవరుప్పుల మండలంలో కార్యకర్తల సమావేశాలు




7

సీతారాంపురంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

నేటినుంచి భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు

- 12 రోజుల పాటు సేవా కార్యక్రమాలు
- ప్రతీ రోజు కులాల వారీగా పూజలు, అన్నదానాలు



వరంగల్ కల్చరల్, మే 8: చారిత్రా త్మక ఓరుగల్లు నగరంలో స్వయం భూగా విరాజిల్లుతున్న భద్రకాళి అమ్మవారి కల్యాణ బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఇందుకుగాను ఆలయం లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేశంలోనే ఎక్కడా జరుగని విధంగా వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయంలో ఏడాదిలో నాలుగు సార్లు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. వైశాఖ మాసం మే నెలలో నిర్వహించే బ్రహ్మోత్సవాలు రెండోసారి గురువారం ఉదయం 4 గంటలకు నిత్య పూజలు, గణపతి, సుదర్శన, చండీహోమాలతో ప్రారంభం కానున్నాయి. ఉదయం గణపతి సేవ, సాయంత్రం

మిగతా 8వ పేజీలో..

ఏనుమాముల మార్కెట్‌కు
ఆరు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మే 8: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఆరు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 (శుక్రవారం) నుంచి 15వ తేదీ (బుధవారం) వరకు సెలవులు ప్రకటించారు. మే 16 నుంచి మార్కెట్‌లో సరుకుల క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, కార్మికులు, వ్యాపారులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి కోరారు.

ఇనుప స్టూల్ మీద పడి శిశువు మృతి


రోషిత (ఫైల్)

కాజీపేట, మే 8: ఊయల కోసం కట్టిన ఇనుప స్టూల్ మీదపడటంతో ఆరు నెలల శిశువు మృతి చెందింది. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన లోక్‌నాథ్ ఖుర్షే దంపతులు కొంతకాలంగా కాజీపేట సోమిడిలో ఉంటూ నగరంలో కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నారు. బుధవారం లోక్‌నాథ్ ఖుర్షే భార్య ఆరు నెలల రోషితను ఇనుప స్టూల్‌కు, ఓ దర్వాజకు చీరతో ఊయల కట్టి రెండోకూతును చాంద్ ఖుర్షేను కాపాలా పెట్టి ఇంట్లో పనిచేసుకుంటుండగా ఆకస్మాత్తుగా స్టూల్ బ్యాలెన్స్ తప్పి రోషితపై పడింది. ఈ ఘటనలో రోషిత తలకు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం చిన్నారి మృతి చెందింది. తండ్రి లోక్‌నాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రేపటి నుంచి శ్వేతార్కలో వసంతోత్సవాలు


మాట్లాడుతున్న ఐనవోలు రాధాకృష్ణ శర్మ

కాజీపేట, మే 8 : కాజీపేట శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో ఈ నెల 10 నుంచి 14 వరకు శ్వేతార్క మూలగణపతి స్వామికి 26వ వసంతోత్సవ, కల్యాణోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సిద్ధాంతి, దేవాలయ వేదిక కార్యక్రమ నిర్వాహకులు ఐనవోలు రాధాకృష్ణ శర్మ తెలిపారు. శ్వేతార్క ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాధకృష్ణ శర్మ వేడుకలు వివరాలు తెలపారు.

మే 10న శుక్రవారం ఇక్షురాభిషేకం, చండీహోమం, లక్ష పుష్పార్చన, సహస్ర మోదక పూజ, రాత్రి 6 గంటలకు బ్రహ్మశ్రీ మంగళంపల్లి వేణుగోపాల శర్మ గారిచే గణపతి ఉపాసన వల్ల కలిగే ఫలితాలు అనే అంశంపై ఉపన్యాసం, 11న సప్తవర్ణాభిషేకం, సందర్శన హోమం, లక్ష తమలపాకుల పూజ, సహస్ర ఉండ్రాళ్ల పూజ, సాయంత్రం 6 గంటలకు జ్యోతిష్యంలో మన గణపతి అనే అంశంపై బ్రహ్మశ్రీ కాకునూరి సత్యనారాయణ మూర్తి ఉపన్యాసం, 12న శ్వేతార్క గణపతి పుట్టినరోజు సందర్భంగా సమస్త నదినది సముద్ర జలాలతో విశేష అభిషేకం, లక్ష శ్వేతార్క పుష్పర్చన, సహస్ర లడ్డూలతో పూజ, 13న బస్మాభిషేకం, అరుణ హోమం, లక్ష దమన పూజ, చెప్పన్ బోగ్, బాలకవిసమ్మేళనం, 14న పంచామృత పంచవర్ణాభిషేకం, లక్ష గరికార్చన బగలాముఖిదేవి మహావిద్య హోమం, పూర్ణాహుతి, సిద్ధి బుద్ధి సమేత గణపతి మహాకల్యాణోత్సవం, గణపతికి పట్టాభిషేకం కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. మే 14న స్వామి వారి పుట్టనరోజు సందర్భంగా వాడవాడలా మహాన్నదానం గ్రామ, గ్రామాన అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ఉత్సవాల సందర్భంగా పూజా కార్యక్రమంలో స్వయంగా పాల్గొనేవారు ముందుగా 93470 80055 నంబర్‌కు సంప్రదించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ ఐనవోలు వెంకటేశ్వర శర్మ, ఐయ్యప్ప ఆలయ ఇన్‌చార్జి చొక్కారపు శ్రీనివాస్, యోగా ఆంజనేయ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 8: పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ అండ్ ట్రైనింగ్ కార్యదర్శి పుల్లయ్య గడువును పొడిగించినట్లు వరంగల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో ఈ నెల 14 వరకు గడువు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. రూ.300 అపరాధ రుసుముతో ఈనెల 20వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. కాగా పాలిసెట్‌ను ఈనెల 24న నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

వరంగల్ మెడికల్, మే 8: ఈ నెల 10వ తేదీన శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి 4 గంటల వరకు పద్మాక్షి పాలిక్లినిక్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు డాక్టర్ ఇ.లక్ష్మణ్‌కుమార్, డాక్టర్ పివి.అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వివిధరకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను సైతం ఉచితంగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9955996766. 9133893360 సెల్ నెంబర్లలో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని వారు సూచించారు.

వాహనదారులకు జరిమానా

హనుమకొండ టౌన్, మే8: నిబంధనలు ఉల్లఘించిన ఆరుగురు వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తనిఖీల్లో పట్టుబడ్డ ఆరుగురిని బుధవారం కోర్టులో హాజరుపరచగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి రూ.2,400, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ముగ్గురికి రూ.1600 న్యాయమూర్తి రమేశ్ జరిమానాగా విధించారన్నారు.

మిషన్ భగీరథ ఏఈని నిలదీసిన రైతులు

లీకేజీ, వ్యర్థపు నీటితో పంట నష్టం జరిగిందని ఆగ్రహం


ఏఈ వాహీద్‌ను నిలదీస్తున్న రైతులు

శాయంపేట, మే 8 : మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లో లీకైన నీరు, వ్యర్థపు నీరు బయటకు వదలడంతో తమ పంటలు నీటితో తడిసి నష్టపోయామని మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ వాహీద్‌ని రైతులు నిలదీశారు. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకండ జిల్లా శాయంపేట మండలం జోగంపల్లి గ్రామంలోని మిషన్ భగీరథ ఫిల్టర్‌బెడ్‌లో నాలుగు రోజుల కిందట ఎయిర్‌వాల్ నుంచి లీకేజీ నీరు, వ్యర్థపు నీరు ఫిల్టర్‌బెడ్ పక్కన కాలువలో వదిలారు.. ఈ క్రమంలో కాలువ చివరన ఉన్న రైతుల వరి పంటలోకి నీరు ప్రవేశించి పంటలు తడిసిపోయి నష్టపోయారు. ఈ విషయం గ్రిడ్ ఏఈ వాహీద్‌కు తెలుపగా పంటలను పరిశీలించి పరిహారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంపై బుధవారం రైతులు ఫిల్టర్‌బెడ్‌లో ఏఈని అడుగగా పంటలలోకి వచ్చిన నీరు ఫిల్టర్‌బెడ్ నుండి రాలేదని మాటమార్చారు. దీంతో రైతులు ఏఈపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిలదీశారు. మాటమార్చారని, గతంలో పక్కనే ఉన్న కుంటలోకి వ్యర్థపు నీరు విడిచిపెట్టేవారని, ఇప్పుడు బయటకు ఎందుకు విడుస్తున్నారని ప్రశ్నించడంతో సమాధానమివ్వలేక ఏఈ వాహిద్ నీళ్లు మింగారు.

న్యాయం జరగకపోతే పంపులు నిలిపివేసి, ఫిల్టర్ బెడ్ ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. గ్రిడ్ డీఈఈ శ్రీనివాస్ చరవాణిలో రైతులతో మాట్లాడి ఘటనపై సమగ్రంగా తెలుసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆదుకోవాలని రైతులు వేడుకున్నారు.

జిల్లా జడ్జిని కలిసిన బార్ ప్రతినిధులు


జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు

వరంగల్ లీగల్, మే 8: హనుమకొండ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి బి.రమేష్‌బాబును వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా జడ్జిగా బి.రమేష్‌బాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు టి.జీవన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ముదసర్ అహ్మద్, ఉపాధ్యక్షుడు సుదర్శన్, స్పోర్ట్స్ సెక్రటరీ వెంకటరమణ, కార్యవర్గ సభ్యులు సీహెచ్.సాంబశివరాజు, అనిల్ తదితరులు న్యాయమూర్తిని కలిసిన వారిలో ఉన్నారు.

రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శిగా రఘుపాల్ రెడ్డి

న్యూశాయంపేట, మే 8: రెడ్డి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా హనుమకొండ రెవెన్యూకాలనీకి చెందిన కట్టా రఘుపాల్‌రెడ్డిని నియవింంచినట్లు జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘుపాల్‌రెడ్డి రెడ్డి సంఘం అభివృద్ధికి కృషి చేస్తున్నందుకుగాను ఆయన సేవలు గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్ రెడ్డితోపాటు, సంఘం నాయకులకు రఘుపాల్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.





సభలో మాట్లాడుతున్న మోదీ, వేదికపై బీజేపీ జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు

కమలం శ్రేణుల్లో జోష్

- జనసభ విజయవంతంతో ఉత్సాహం
- మోదీ.. నినాదాలతో మార్మోగిన సభాప్రాంగణం



వరంగల్ సిటీ, మే 8: బీజేపీ వరంగల్, మానుకోట పార్లమెంట్ అభ్యర్థులు అరూరి రమేష్, ప్రొఫెసర్ సీతారాం నాయక్‌ల విజయాన్ని కాంక్షిస్తూ వరంగల్ మామునూరు ఎయిర్‌పోర్టు సమీపంలోని లక్ష్మీపూర్‌లో బుధవారం నిర్వహించిన బీజేపీ ఓరుగల్లు జనసభ విజయవంతమైంది. ఊహించిన దానికంటే నాయకులు, కార్యకర్తలు, భారీగా తరలిరావడంతో బీజేపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఎండల నేపథ్యంలో సభకు వచ్చిన వారు ఇబ్బందులు పడకుండా మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభకు హాజరైన ప్రధాని నరేంద్ర మోదీ.. తన ప్రసంగానికి ముందు చిన్న పాపను చూసి.. 'ఏ ఇత్నీ ప్యారా గుడియా హై..' అనడంతో కార్యకర్తల కేరింతలు మిన్నంటాయి. ఆ తర్వాత 'నా తెలంగాణ కుటుంబ సభ్యులందరికీ నమస్కారం' అంటూ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన మోదీ ఆ తర్వాత హిందీలో మాట్లాడగా.. హైదరాబాద్‌కు చెందిన బీజేపీ నాయకుడు రాక సుధాకర్ తెలుగు అనువాదం చేశారు. తన ప్రసంగంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలు గుప్పించిన మోదీ.. ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలని కోరారు. ఇక కార్యకర్తలు ప్రధాని మోదీ ఫొటోలతో కూడిన ప్లకార్డులను పట్టుకుని మోదీ.. మోదీ.. అంటూ నినాదాలు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అదే విధంగా బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు, గరికపాటి మోహన్‌రావు, ఎంపీ అభ్యర్థులు అరూరి రమేష్, సీతారాం నాయక్, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కూడా ప్రసంగించారు. వేదికపై పార్లమెంట్ ప్రభారి మురళీధర్‌రావు, పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, అల్లం నాగరాజు, కార్పొరేటర్ జలగం అనిత రంజిత్‌రావు తదితరులు కూర్చున్నారు.



మోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న అరూరి, చిత్రంలో సీతారాంనాయక్

వరంగల్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలి..

మోదీని కోరిన అరూరి రమేష్



వరంగల్ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ప్రధాని నరేంద్ర మోదీని వరంగల్ అభ్యర్థి అరూరి రమేష్ కోరారు. ప్రధాని మోదీ వేదికపైకి వచ్చిన అనంతరం మాట్లాడిన అరూరి.. వరంగల్ ప్రజలు మోదీని మూడోసారి ప్రధానిని చేయాలని, అందుకు వరంగల్ నుంచి తనను కానుకగా పంపాలని వేడుకున్నారు. వరంగల్‌లో ఎయిర్ పోర్టును పునరుద్ధరించాలన్నారు. వ్యాగన్ ఫ్యాక్టరీని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపిన ఆయన కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి ఇక్కడి యువతకు ఉపాధి కల్పించాలని, టెక్స్‌టైల్ పార్కును పునరుద్ధరించాలని, ఐఐఎంను ప్రారంభించాలని, వరంగల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, భూపాలపల్లి రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయాలని, వరంగల్ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తోడ్పాటును అందించాలని ఆయన మోదీని కోరారు.

తెచ్చుకున్న తెలంగాణ ద్రోహుల పాలైంది..

మహబూబాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి సీతారాం నాయక్



పోరాడి తెచ్చుకున్న తెలంగాణ ద్రోహుల పాలైందని, అందులో తెలంగాణ ద్రోహులంతా జమయ్యారని మహబూబాబాద్ అభ్యర్థి సీతారాంనాయర్ పేర్కొన్నారు. సభలో మాట్లాడిన ఆయన బీజేపీ నాయకురాలు సుష్మాస్వరాజ్ సమ్మతి లేకుండా నాడు తెలంగాణ వచ్చేదా.. అన్నది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు తెలుసుకోవాలన్నారు. గతంలో ఐదేళ్లు పార్లమెంట్ సభ్యుడిగా చేశానని, ఎక్కడా అవినీతి లేకుండా పని చేశానన్నారు. తాను, అరూరి రమేష్ ఇద్దరం కలిసి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తామని, ఈ ఎన్నికల్లో తమను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పటిష్ఠ పోలీసు బందోబస్తు

లక్ష్మీపూర్‌లో బుధవారం నిర్వహించిన బీజేపీ జనసభకు పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాని రాక సందర్భంగా మామునూరు ఎయిర్‌పోర్టు వద్ద కట్టుదిట్టమైన భద్రత చేపట్టిన పోలీసులు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు వద్ద నిలిపి ఉంచిన వాహనాలను కూడా లిఫ్టింగ్ వాహనంలో మరో చోటుకు తరలించారు. అలాగే సభ ముగిశాక మోదీ ఎయిర్‌పోర్టుకు చేరుకునే సమయంలో మధ్నాహ్నం 17 నిమిషాల పాటు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి : మార్తినేని



1984లో మొదటిసారి హనుమకొండ నుంచి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థిగా చందుపట్ల జంగారెడ్డి విజయం సాధించారని, నాడు దేశంలో బీజేపీ ఎంపీలుగా ఇద్దరు గెలిస్తే వారిలో ఒకరు జంగారెడ్డి కాగా, మరొకరు గుజరాత్ రాష్ట్రంలోని ఏకే పటేల్ అని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు గుర్తుచేశారు. 40 ఏళ్ల తరువాత మళ్లీ అవకాశం వచ్చిందని, బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వరంగల్ జిల్లాలో ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ గెలువకున్నా సుమారు రూ.9వేల కోట్ల అభివృద్ధి పనులు చేసిన ఘనత బీజేపీ, ఎన్‌డీఏ ప్రభుత్వానిదన్నారు. హైదరాబాద్ నుంచి వరంగల్, వరంగల్ నుంచి భూపాలపట్నం వరకు జాతీయ రహదారులు నిర్మించామని, రూ.108 కోట్లతో ఎంజీఎం హాస్పిటల్‌ను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా తీర్చిదిద్దామన్నారు. హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాముడి గుడిని అయోధ్యలో నిర్మిస్తే దానిపై కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు విమర్శిస్తూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయన్నారు.

వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రాబోతోంది

ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ఒక జాతికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుకోవడానికి 30 ఏళ్లుగా పోరాడుతున్నామని, ఈ క్రమంలో అన్ని పార్టీలు మాదిగలను ఉపయోగించుకున్నాయని, కానీ మూడు దశాబ్దాల ఎస్సీ వర్గీకరణ కలను నెరవేర్చే శక్తి ప్రధాని నరేంద్ర మోదీలో ఉందని నమ్ముతున్నామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ అన్నారు. గత జూలై 8న మోదీ వరంగల్ వచ్చినప్పుడు.. తాను కలిసి ఒక చిన్న వినతిపత్రం ఇస్తే అది చదివిన ఆయన తనను అక్కున చేర్చుకుని పోరాటానికి న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానని చెప్పారన్నారు. ఆ తరువాత గత నవంబరు 11న హైదరాబాద్‌లో మాదిగల విశ్వరూపసభకు ముఖ్యఅతిథిగా మోదీ హాజరయ్యారని, చరిత్రలో కులాల మీటింగ్‌కు ప్రధానమంత్రులు హాజరైన దాఖలాలు లేవన్నారు. ఎస్సీ వర్గీకరణ కోసం జాతీయ స్థాయిలో కమిటీ వేసి ఆ కమిటీ ద్వారా ముందుకుసాగిస్తూ సుప్రీంకోర్టుకు కేంద్రం తరుపున అటార్నీ జనరల్‌ను పంపించి వర్గీకరణకు కేంద్రం కట్టుబడి ఉందని మోదీ చెప్పారన్నారు. జడ్జిమెంట్ రిజర్వులో ఉందని, ఎప్పుడైనా వర్గీకరణకు అనుకూలంగా తీర్పు వచ్చే అవకాశం ఉందన్నారు. అదే జరిగితే మాదిగ జాతి ప్రధాని నరేంద్రమోదీకి రుణపడి ఉంటుందన్నారు. ఆ రుణం తీర్చుకునే అవకాశాన్ని చేజార్చుకోవద్దని మాదిగలను కోరారు. దేశంలో పెండింగ్‌లో ఉన్న అనేక దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఆయన చొరవ తీసుకున్నారని, క్రైస్తవ, ముస్లిం సమాజాలు ఆయన దృక్పథాన్ని అర్థం చేసుకోవాలని పిలుపునిచ్చారను. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం, ఉమ్మడి వరంగల్ అభివృద్ధి చెందలేదన్నారు. వరంగల్ నుంచి గెలిచిన ఎంపీలు పార్లమెంట్‌లో గట్టిగ మాట్లాడకపోవడం కూడా అందుకు ఓ కారణమన్నారు. బీజేపీ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ అభివృద్ధికి బీజేపీ అభ్యర్థులు అరూరి రమేష్, సీతారాం నాయక్‌లను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రధాని పర్యటన సాగిందిలా..

వరంగల్ సిటీ, మే 8: వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టు సమీపంలోని లక్ష్మీపూర్‌లో బుధవారం బీజేపీ ఓరుగల్లు జనసభ జరిగింది. ఈ సభకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరవగా.. ఆయన పర్యటన సుమారు గంటన్నర పాటు సాగింది. ఉదయం 11.55గంటలకు మొదటి చాపర్, 11.58 గంటలకు రెండో చాపర్, మధ్యాహ్నం 12.02గంటలకు మూడో చాపర్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నాయి. 12.05గంటలకు మూడో చాపర్ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగగా ఆయనకు రాష్ట్ర, జిల్లా బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఆ తర్వాత 12.10 గంటలకు విమానాశ్రయం నుంచి మామునూరు బెటాలియన్ దారి మీదుగా సభా ప్రాంగణానికి బయలుదేరిన మోదీ.. 12.17గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆ తరువాత నాలుగో చాపర్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. ఇక మోదీ 12.18 గంటలకు సభా వేదికపైకి వచ్చి రెండు నిమిషాల పాటు వేదికపై కలియతిరుగుతూ ప్రజలకు అభివాదం చేశారు. 12.20కు వేదికపై ఎంపీ అభ్యర్థులు, జిల్లా అధ్యక్షులు, నాయకులు ప్రధానికి పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు. 12.25గంటలకు ప్రసంగం ప్రారంభించిన ప్రధాని.. 01.13గంటలకు ముగించారు. ఆ తర్వాత వేదికపై ఉన్న నాయకులతో ఫొటోలు దిగి సభాప్రాంగణం నుంచి బయల్దేరారు. 01.26గంటలకు విమానాశ్రయానికి చేరుకుని 01.28గంటలకు చాపర్‌లోకి ఎక్కారు. 01.32గంటలకు ప్రధాని ఎక్కిన చాపర్ మామునూరు ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరింది.

రాజ్‌నాథ్‌సింగ్ సభను సక్సెస్ చేయాలి

- నేడు తొర్రూరులో బహిరంగ సభ
- బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మార్తినేని ధర్మారావు



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

తొర్రూరు (మహబూబాబాద్ జిల్లా), మే 8: వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేష్ గెలుపును ఆకాంక్షిస్తూ.. గురువారం తొర్రూరులో జరిగే కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. నేడు ఉదయం 10 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో నేరుగా తొర్రూరులోని హెలిప్యాడ్ స్థలానికి చేరుకుంటారన్నారు. పట్టణంలోని అన్నారం రోడ్డులో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ మైదానంలో భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌కు ఓటువేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తక్కెళ్లపల్లి రాజేశ్వర్ రావు, దశమంత్ రెడ్డి, లేగరాంమోహన్ రెడ్డి, పూసల శ్రీమాన్, పల్లెకుమార్, సురేష్, శంకర్, మహేందర్, రాములు, ఝాన్సీ, రవిబాబు, పులేందర్, తదితరులు పాల్గొన్నారు.

రాబోయే కాలం బీఆర్ఎస్‌దే..

- కాంగ్రెస్ బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయింది..
- రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ధర్మాపురంలో మాట్లాడుతున్న రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, మే 8: కాంగ్రెస్-బీజేపీలపై ప్రజలకు నమ్మకం పోయిందని, రాబోయే కాలం బీఆర్ఎస్ పార్టీదే అని రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా బుధవారం దేవరుప్పుల మండలం ధర్మాపురం, మాధాపురం, కోలుకొండ, సీతారాంపురం, సింగరాజుపల్లి, పెద్దమడూరు, చిన్నమడూరు, నీర్మాల గ్రామాల్లో రాష్ట్ర మాజీ శాసన సభాపతి సిరికొండ మధుసూదనాచారితో కలిసి పర్యటించారు. గ్రామ స్థాయి బీఆర్ఎస్ కార్యకర్తలతో సమీక్ష నిర్వహించి శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో బీఆర్ఎస్ గళం బలంగా ఉండాలంటే బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలించాలని కోరారు. కాంగ్రెస్-బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, అందుకు నలుగురు గుమి కూడిన చోట చర్చ పెట్టాలని సూచించారు. అభివృద్ధి అంటే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని, గత 60ఏళ్లుగా అధికారంలో ఉన్న పార్టీలు తెలంగాణకు ఏమీ చేయలేదని, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాల అబద్ధపు హామీలు ఇచ్చి నాలుగు నెలలు దాటినా ఒక్కటి కూడా నెరవేర్చ లేదన్నారు. పథకాలు అమలు చేయకుండా ఓట్లు అడిగే హక్కు ఆ పార్టీకి లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, కోతి ప్రవీణ్, కృష్ణమూర్తి, యాకయ్య, రామ్‌సింగ్, అశోక్‌రెడ్డి, యాఖూబ్, కూర్నాల రవి, కోతి పద్మ, ఇంద్రస్వామి, యాకస్వామి, కాశీం, మైసారావు, రామూర్తి, నర్సింహులు, రాజు, రవి, బస్వ వెంకన్న, యాఖూబ్‌పాషా, బబ్బూరి శ్రీకాంత్, వంగ అర్జున్, జోగేశ్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేకి మోదీని గద్దె దించాలి

- బీకేఎంయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకట్రాములు



మాట్లాడుతున్న వెంకట్రాములు

న్యూశాయంపేట, మే 8: కార్మిక వ్యతిరేకి మోదీని వచ్చే ఎన్నికల్లో గద్దె దించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్(బీకేఎంయూ) జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కోరారు. హనుమకొండలోని బీకేఎంయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వెంకట్రాములు మాట్లాడారు. ఉద్యమాల ద్వారా సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కోట్లాది మంది కూలీల పొట్ట కొట్టిన దుర్మార్గ పాలకులకు బుద్ధి చెప్పే సమయం వచ్చిందన్నారు. పదేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీనవర్గాలకు, మైనారిటీలకు బీజేపీ ప్రభుత్వంలో రక్షణ లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. దేశ సంపదను దోచుకున్న కార్పొరేట్లు, పారిశ్రామికవేత్తల ఆస్తులు ఆకాశాన్నంటాయని, శ్రమజీవుల బతుకులు పాతాళానికి దిగజారాయన్నారు. ఎన్నికల్లో బీజేపీకి ఎవరూ ఓట్లు వేయొద్దని, ఇండియా కూటమి అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈసమావేశంలో బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు మోతె లింగారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రె లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మునిగాల భిక్షపతి పాల్గొన్నారు.

వరంగల్‌కు ఏం చేశారని బీజేపీకి ఓట్లు వేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట, మే 8: ప్రధాని నరేంద్ర మోదీ 10 ఏళ్ల పాలనలో వరంగల్‌కు ఏం చేశారని బీజేపీకి ఓట్లు వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు ప్రశ్నించారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. వరంగల్‌లో జరిగిన బీజేపీ ఎన్నికల సభలో ప్రధాని నరేంద్ర మోదీ విభజన హామీల అమలుపై నోరు విప్పకుండా ప్రజలను మరోసారి మోసం చేశారన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ, తెలంగాణలోని వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్రాకేజీ గురించి ప్రధాని నోరు విప్పలేదన్నారు. బీజేపీ హయాంలో నిత్యావసర వస్తువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల వేళ ఓట్ల కోసం ప్రజలను మభ్యపెట్టడానికే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వరంగల్‌లో సభ పెట్టారన్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థి కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించాలని శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, నాయకులు ఆదరి శ్రీనివాస్, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, కర్రె లక్ష్మణ్, ఏశబోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బాషబోయిన సంతోష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

పీఎం, సీఎంల పర్యటనతో వరంగల్‌కు ఒరిగిందేమి లేదు

- బీజేపీ, కాంగ్రెస్ పార్టీల చరిత్ర అందరికీ తెలుసు
- వరంగల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురుతుంది
- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

రాంనగర్, మే 8: ప్రధాని మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలతో వరంగల్‌కు ఒరిగిందేమి లేదని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. బుధవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. పీఎం, సీఎం జిల్లాలో పర్యటించి వరంగల్ అభివృద్ధికి ఒక్క హామీ ఇవ్వలేదని అన్నారు. విభజన హామీలు అమలు చేయని మోదీకి తెలంగాణలో అడుగుపెట్టే అర్హత లేదన్నారు. మతాలు, కులాల మధ్య బీజేపీ చిచ్చు పెడుతూ రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. అబద్దాల పునాదులపై రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు. ఆ రెండు పార్టీల చరిత్ర ప్రజలకు తెలుసన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. వరంగల్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని బండా ప్రకాశ్ ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పార్టీకి ద్రోహం చేసిన ఇద్దరు నేతలకు, నిఖార్సైన ఉద్యమకారుడికి మధ్య పోటీ జరుగుతోందన్నారు. ఆలయాలపై ఒట్లు వేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. భద్రకాళికి కేటాయించిన రూ.30కోట్ల నిధులు రద్దు చేశాడని ఆయన ఆరోపించారు. రామప్పకు యునెస్కో గుర్తింపు రావడానికి కేంద్రంలో ఉన్న బీజేపీ ఎలాంటి ప్రయత్నం చేయలేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ శ్రమ ఫలితంగానే రామప్పకు యునెస్కో గుర్తింపు వచ్చిందన్నారు.

వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ.. తన విజయం ఖాయమైందన్నారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణ చూసి భయంతో ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడుసార్లు, ప్రధాని మోదీ ఒకసారి జిల్లా పర్యటనకు వచ్చారని అన్నారు. మూడు మాసాల్లో ప్రజలచే తిరస్కరించబడిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆయన ఆరోపించారు. తెలంగాణ ప్రాంతాన్ని ఆ రెండు పార్టీల నాశనం చేశాయన్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ.. అందరి దృష్టి వరంగల్ ఎన్నికపై ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు మరిచారని అన్నారు. నాలుగు మాసాల్లో లక్ష వివాహాలు జరుగగా ఎవరికి కూడా కల్యాణలక్ష్మీ రాలేదన్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, నేతలు మర్రి యాదవరెడ్డి, కె.వాసుదేవరెడ్డి, జనార్దన్‌గౌడ్, నయీమ్, పులి రజనీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

వరంగల్ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్‌వో ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మే 8: ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు ముందస్తు ప్రణాళికలు పూర్తి చేసి మే 13న ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సర్వసన్నద్ధం కావాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల సహాయ రిటర్నింగ్ అధికారులతో ఎన్నిలకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించి సమర్థవంతంగా నిర్వహించేందుకు కీలక ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్లు రాధిక గుప్తా, సంధ్యారాణి, సహాయ రిటర్నింగ్ అధికారులు రోహిత్‌సింగ్, వెంకన్న, నారాయణ, వెంకటేష్, సీడమ్ దత్తు, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.



స్టోర్ రూమ్‌లో సింబల్ లోడింగ్ యూనిట్లు

హనుమకొండ కలెక్టరేట్, మే 8: హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని సింబల్ లోడింగ్ యూనిట్ స్టోరేజ్ రూమ్‌లో బుధవారం సింబల్ లోడింగ్ యూనిట్లను సంబంధిత అధికారులు భద్రపరిచారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రెండో దశ ఈవీఎంల ర్యాండమైజేషన్, కమిషనింగ్ ప్రక్రియ పూర్తి చేసిన అనంతరం ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు సింబల్ లోడింగ్ యూనిట్లను వరంగల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రతినిధులు, ఈసీఐఎల్ ఇంజనీర్ల సమక్షంలో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌ఎల్‌యూ స్టోరేజ్ రూమ్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్, అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఈవీఎంల ప్రత్యేక అధికారి నవీన్, ఇతర అధికారుల సమక్షంలో వాటిని భద్రపరిచారు. కలెక్టరేట్ ఏవో సత్యనారాయణ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రసాద్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ జన్ను శ్యామ్‌కుమార్, తదితర అధికారులు ఉన్నారు.



- ఖరారైన వానాకాలం సాగు ప్రణాళిక
- గత సీజన్‌లో కన్నా 5 శాతం అధికం
- ఎరువులు, విత్తనాల నిల్వలకు ఏర్పాట్లు
- అందుబాటులో యూరియా ఇతర ఎరువులు
- ఇంకా నిర్ణయం కాని రాయితీలు

హనుమకొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాలో వానాకాలం సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది. ఈసారి వర్షాలు సంతృప్తికరంగా ఉండే అవకాశాలున్నట్టు వాతావరణశాఖ అధికారులు అంచనావేస్తున్న నేపథ్యంలో ఈమేరకు జిల్లా సాగు ప్రణాళికను రూపొందించారు. గత వానాకాలం సీజన్ కన్నా ఈ సారి పంటల సాగు 5శాతం అధికంగా ఉండేట్టు చూశారు. వర్షాలు సమృద్ధిగా ఉన్న పక్షంలో ప్రణాళికలో ప్రతిపాదించన దానికన్నా మరో 5శాతం అదనంగా పంటలు సాగయ్యే అవకాశాలు లేకపోలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

2.62 ఎకరాల్లో పంటల సాగు

2024-25 వానాకాలం సాగుకు ప్రణాళికలో అన్ని రకాల పంటలు, పండ్లతోటలు కలుపుకొని మొత్తం 2,62,220 ఎకరాల్లో సాగుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఇందులో వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం 2,40,220 ఎకరాలు కాగా, పండ్ల తోటల పెంపకం 21,000 ఎకరాలు. గత వానాకాలంలో రూపొందించిన సాగు ప్రణాళికకన్నా ఈ సారి 6,939 ఎకరాలు అదనంగా ప్రతిపాదించారు. జిల్లా పరిధిలోని 14 మండలాలు ఉన్నాయి. వ్యవసాయ పంటలు, పండ్లతోటలు కలుపుకొని భీమదేవరపల్లిలో 24,030 ఎకరాలు, ధర్మసాగర్‌లో 22,870 ఎకరాలు, ఎల్కతుర్తిలో 21,680 ఎకరాలు, హనుమకొండలో 950 ఎకరాలు, హసన్‌పర్తిలో 21,650 ఎకరాలు, ఐనవోలులో 27,7209 ఎకరాలు, కమలాపూర్‌లో 3,869 ఎకరాలు, కాజీపేటలో 1,160 ఎకరాలు, వేలేరులో 2,483 ఎకరాలు, ఆత్మకూరులో 17,440 ఎకరాలు, దామెరలో 17,350 ఎకరాలు, నడికూడలో 19,480 ఎకరాలు, పరకాలలో 13,000 ఎకరాలు, శాయంపేటలో 19,400 ఎకరాలు సాగుకు ప్రతిపాదించారు. ఈసారి 1,48,400 ఎకరాల్లో వరి సాగుకు నిర్ణయించారు. ఇందుకు 37,100 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. గతంలోకన్నా ఈసారి మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగవచ్చునని అంచనా వేస్తున్నారు. అందుకే గత సీజన్ లో కన్నా 1,600ఎకరాల్లో అదనంగా సాగుకు ప్రతిపాదించారు. ఇందు కు 466క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా. ఈ మేరకు నిల్వ ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, పత్తి సాగు కూడా ఈసారి పెరిగే అవకాశం ఉన్నట్టు చెబుతున్నారు. గత వానాకాలం సీజన్‌లో 82,277.07 ఎకరాల్లో పత్తిసాగుకు ప్రతిపాదించగా, ఈసారి 85,000 ఎకరాలను సూచించారు. ఇందుకు 765 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. 300 ఎకరా ల్లో నూనే గింజలు, 700 ఎకరాల్లో అపరాలు సాగుకు నిర్ణయం తీసుకున్నారు.

ఎరువులు

జిల్లాలో మొత్తం 2,61,220 ఎకరాల్లో సాగుకు అవసరమైన ఎరువుల నిల్వలకు కూడా ప్రణాళికలో ప్రతిపాదనలు చేశారు. ఈ పంటల సాగుకు యూరియా 35,265 మెట్రిక్ టన్నులు, డీఏపీ 13,061 మెట్రిక్ టన్నులు, ఎన్‌పీకే 32,653 మెట్రిక్ టన్నులు, ఎంవోపీ 10,449 మెట్రిక్ టన్నుల మేరకు సేకరించాలని నిర్ణయించారు. ఈ ఎరువుల నిల్వలకు అన్ని ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేస్తున్నారు. గతేడాది పత్తి సాగు తగ్గింది. కంది, మొక్కజొన్న వంటి పంటలు రైతుల చేతికి పెద్దగా అందలేదు. వరి మాత్రం సగటుకు మించి సాగైంది. ఈ ఏడాది కంది, పత్తి, జొన్న పంటల సాగు పెరగనున్నదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ నుంచి రైతులకు విత్తనాలు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మార్క్‌ఫెడ్, ప్రైవేటు ఏజెన్సీల ద్వారా ఎరువులు అందించేలా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్, తదితర సంస్థల్లో 14వేల మెట్రిక్ టన్నుల మేరకు యూరియా, సుమారు 8వేల మెట్రిక్ టన్నులు కాంప్లెక్సు ఎరువులు, 500 మెట్రిక్ టన్నుల వరకు డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయి. జూన్, జులై వరకు వీటి నిల్వలు పెరగవచ్చు. జిల్లాలో ప్రస్తుతం యూరియా కొరత లేదు.

నిర్ణయంకాని రాయితీ

ప్రతీ సంవత్సరంలాగే ఈ ఏడు పచ్చిరొట్ట ఎరువులు అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రభుత్వం ఇంకా రాయితీ ధరలు నిర్ణయించలేదు. గతేడాది జీలుగ, జనుము, పిల్లిపెసర వంటి విత్తనాలు 1,500 క్వింటాళ్ల వరకు పంపిణీ చేసింది. ఒకటి, రెండురోజుల్లో రాయితీపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది. పత్తి, కంది, మొక్కజొన్న విత్తనాలను తెలంగాణ విత్తన అభివృద్ధి సంస్థ అందించడం లేదు. రైతులందరూ ప్రైవేటు వ్యాపారుల వద్దే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఐదేళ్ల కిందట రద్దు చేసిన రాయితీ విత్తనాల పంపిణీ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరిస్తుందని చాలామంది రైతులు ఆశలు పెంచుకున్నారు. ప్రభుత్వం మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

జోరుగా ఇసుక దందా

- ప్రభుత్వ భూములే లక్ష్యంగా కొనసాగుతున్న వ్యాపారం
- రాయగూడెం, తాటికాయల, పెద్దపెండ్యాల నుంచి రవాణా
- వ్యాపారులకు రాజకీయ పార్టీల నాయకుల అండ..!



రాయగూడెంలో టిప్పర్లతో ఇసుకను రవాణా చేస్తున్న దృశ్యం

ధర్మసాగర్, మే 8: ప్రభుత్వ భూముల నుంచి అక్రమంగా ఇసు క రవాణా చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ధర్మసాగర్ మండలంలోని రాయగూడెం, తాటికాయల, పెద్దపెండ్యాల గ్రామాలను కొన్నేళ్ల నుంచి ఇసుక రవాణా జోరుగా కొనసాగుతోంది. ఇసుక తయారు కోసం ప్రభుత్వ భూముల్లో నుంచి 20 ఫీట్ల లోతువరకు మట్టిని తీసి ఎక్స్‌వేటర్ల సహాయంతో తీయడం వల్ల భూములు, వ్యవసాయానికి పూర్తిగా పనికిరాకుండా పోతున్నాయి. తీసిన మట్టిని కరెంట్ మోటార్ల ద్వారా వచ్చే నీటితో సుమారు నాలుగు రోజుల పాటు కడుగుతున్నారు. ఆ తర్వాత ఫీల్టర్ ఇసుకను ధర్మసాగర్ మండలంతో పాటు ఇతర మండలాలకు సరఫరా చేస్తున్నారు. మట్టి రవాణా కోసం మైనింగ్, రెవెన్యూ శాఖల నుంచి ఎలాంటి అనుమతులు లేకున్నా ఇసుక వ్యాపారులు అక్రమంగా రవాణా చేస్తున్నారు.

నాయకుల అండతో వ్యాపారులు విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అయినప్పటికీ మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించిన అధికారులు పట్టించుకోకపోవడంతో మండలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుకను కడిగేందుకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి అనుమతి లేకుండా కరెంట్ చౌర్యానికి ఇసుక వ్యాపారులు పాల్పడుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నపటికీ ఇప్పటికైనా అక్రమ ఇసుక రవాణాదారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



రాయగూడెంలో ఇసుక తీయడంతో గుంతలుగా మారిన ప్రభుత్వ భూమి

కావ్య గెలుపును సీఎంకు బహుమతిగా ఇవ్వాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి, మే 8: లోక్‌సభ ఎన్నికల్లో కడియం కావ్యను భారీ మెజారిటీతో గెలిపించుకుని సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. బుధవారం హసన్‌పర్తిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు కష్టపడి తనను ఏవిధంగా గెలిపించారో.. ఇంకా ఎక్కువ కష్టపడి కావ్య గెలు పు కోసం కృషి చేయాలన్నారు. దేశంలో పౌరులకు ఓటు హక్కు లేకుండా చేసేందుకు బీజేపీ కుట్రలు పన్నుతోందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభిస్తే, అది తామే ప్రారంభించినట్లు బీజేపీ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పదేళ్ల రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీలు ప్రజల సొమ్మును దేశ సంపదను దోచుకున్నాయన్నారు. ఆ రెండు పార్టీలకు ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పాలని ఆయన కోరారు.

అనంతరం వివిధ పార్టీల నుంచి వచ్చిన వారికి కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పెంబర్తి మాజీ సర్పంచ్ జోరుక పూల, 66వ డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగెళ్లపెల్లి తిరుపతి, నాయకులు ఆరెల్లి వెంకటస్వామి, వీసం సురేందర్‌రెడ్డి, బల్సుకూరి శ్రీనివాస్, గొర్రె కిరణ్, వింజమూరి రమణ, బొక్క కుమార్, పెద్దమ్మ నర్సింహారాములు జన్ను రవి, పుల్ల రవి తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఎమ్మెల్యే పరామర్శ

మడికొండ: మడికొండకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త నర్ర అశోక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు, అశోక్ ఇంటికి చేరుకొని పరామర్శించారు. చికిత్సకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. అక్కడి వైద్యులతో చెప్పి మంచి వైద్య చికిత్స అందించేందుకు సహకరిస్తానని బాధితుడు అశోక్‌కు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, కాంగ్రెస్ నాయకులు కుర్ల మోహన్, బైరి లింగమూర్తి, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, వస్కుల బాస్కర్, వస్కుల నాగరాజ్, దువ్వ విజయ్, నీలం రజినీ వేణు తదితరులున్నారు.

కడియం కావ్య గెలుపే లక్ష్యం..

వడ్డేపల్లి: వికలాంగుల సంక్షేమానికి చేయూతనందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా నిలిచేందుకు వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్య గెలుపే లక్ష్యంగా తమ సంఘం పనిచేస్తుందని తెలంగాణ వికలాంగుల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నారా నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 21 రకాల వికలాంగుల జనాభా సుమారు 20 లక్షలు, మా కుటుంబాలతో కలుపుకుంటే సు మారు 50 లక్షల ఓటు బ్యాంకు ఉంటుందని అన్నారు. ఒక్కొక్క లోక్‌సభ నియోజక వర్గంలో సుమారు 35 నుంచి 40 వేల వరకు వికలాంగుల ఓటు బ్యాంకు ఉందని చెప్పారు. తమ ఓట్లే అభ్యర్థుల గెలుపు ఓటములను నిర్ణయిస్తాయని తెలిపారు. వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు తాము కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో తెలంగాణ వికలాంగుల సంఘాల జేఏసీ రాష్ట్ర, జిల్లా నాయకులు జి. ప్రశాంతి, బొట్ల సురేష్, మహ్మద్ పాషా, సంతోష్, పోషమల్లు, బాను తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న నారా నాగేశ్వర్‌రావు



హసన్‌పర్తిలోని బజ్జిల బండివద్ద ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే నాగరాజు

గోపాల్‌పూర్‌లో విస్తృత ప్రచారం

కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ గోపాల్‌పూర్‌తో పాటు ఎఫ్‌సీఐ కాలనీ, ద్వారకా సాయి కాలనీలో కాంగ్రెస్ శ్రేణులు బుధవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో 56వ డివిజన్ కార్పొరేటర్ సిరంగి సునిల్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రావుల వెంకట రమేష్ గౌడ్, బీరం రవీందర్‌రెడ్డి, బొమ్మ చంద్రమౌళి గౌడ్, వియ్యాల సునిత, కందుకూరి పూర్ణచందర్ పాల్గొన్నారు.

మోదీ బహిరంగ సభకు తరలిన శ్రేణులు

వడ్డెపల్లి, మే 8: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ నగర శివారులోని తిమ్మాపూర్ క్రాస్‌రోడ్డు లక్ష్మీపురం మైదానంలో బుధవారం నిర్వహించే ప్రధాని నరేంద్రమోదీ పాల్గొనే భారీ బహిరంగ సభకు గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ బీజేపీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బహిరంగ సభకు వాహనాల ర్యాలీని బీజేపీ రాష్ట్ర నేత, 56వ డి విజన్ ఎన్నికల ఇన్‌చార్జి బండి హరీష్ ముదిరాజ్ జెండా ఊపి ప్రారంభించారు. సభకు తరలి వెళ్లిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు కోలా రామకృష్ణ (కిట్టు), చింతలఫణి, అమరేందర్‌రెడ్డి, అలుగునూరి కృష్ణం రాజు, గుంటి నవీన్‌కుమార్, బూజుగుండ్ల శ్రీనివాస్, పేరాల సురేందర్‌రావు, బూరం సురేష్, చెరుకు సరిత, బొట్ల మమత, బొట్ల ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

● మడికొండ: లక్ష్మీపురంలో జరిగిన ప్రధాని మోదీ జన సభకు బుధవారం గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండ నుంచి బీజేపీ శ్రేణులు వాహనాల్లో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా భారత్ మాతాకీ జై, నరేంద్ర మోదీకీ జై అంటూ నినాదాలతో హోరెత్తించారు. సభకు వెళ్ళిన వారిలో బీజేపీ జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, 46వ డివిజన్ అధ్యక్షులు ముత్తోజు సురేష్, నాయకులు కందుకూరి బాలరాజు, ధార ధనుంజయ్, బొల్లికొండ వినోద్, నిగ్గుల సతీష్, దుపెల్లి అరవింద్, కొలిపాక కుమార్‌బాబు, కొలిపాక భాస్కర్, బుర్ర రాజన్‌బాబు, భైరపాక వెంకటేష్, గడ్డం కుమార్, చట్ల అజయ్, పండుగ రాజ్‌కుమార్, రహీంపాషా, బరిగల పినోకర్, గుండాల కళ్యాణ్ తదితరులు ఉన్నారు.



మడికొండ నుంచి మోదీ సభకు తరలి వెళ్తున్న బీజేపీ నాయకులు

గుజ్జులకే బీజేపీ అభ్యర్థిత్వం

(5వ పేజీ తరువాయి)

యూనివర్సిటీలో ఎంఏ ఫిలాసఫీ, మహారాష్ట్రలోని నాందేడ్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌బీ పూర్తిచేశాడు. 1979లో ఏబీవీపీలో విద్యార్థి నాయకుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 44 యేళ్లుగా ఏబీవీపీ, బీజేవైఎం, బీజేపీలో రాష్ట్రస్థాయిలో పలు హోదాల్లో పనిచేశారు. ప్రస్తుతం మూడోసారి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. కాగా, 2004 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి శాయంపేట నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యాడు. 2021లో జరిగిన వరంగల్ - ఖమ్మం - నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా పోటీచేసి నాలుగో స్థానంలో నిలిచాడు.

కాగా, ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన పేరును ప్రకటించడంపై ప్రేమేందర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ లక్ష్మీపురం బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని నరేంద్రమోదీని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అయితే నామినేషన్‌ల స్వీకరణకు గురువారం చివరి రోజు అయినందున పార్టీ ముఖ్య నాయకులతో కలిసి నామినేషన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసుకున్నారు.

నేటినుంచి భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు

(5వ పేజీ తరువాయి)

సుబ్రహ్మణ్యేశ్వర సేవ జరుగుతాయి. 10న అక్షయ తృతీయ సందర్భంగా కల్యాణ బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం, వృషభ వాహన సేవ, జింక వాహన సేవ జరుగును. 11న స్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు, 12న శంకర జయంతి సందర్భంగా శ్రీభద్రకాళి భద్రేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా జరుగును. 13న సూర్యప్రభ వాహన సేవ, హంస వాహన సేవ, 14న విద్యారణ్య జయంతి సందర్భంగా పల్లకీ సేవ, శేష వాహన సేవ, 15న అమ్మవారికి గంధోత్సవం, సాలాబంజిక సేవ, 16న లక్ష కుంకుమార్చన, రథోత్సవం, 17న డోలోత్సవం, భద్రపీఠ సేవ, అశ్వ వాహన సేవ, 18న వసంతోత్సవం, చతురంత సేవ, విమానక సేవ, 19న శరబ వాహన సేవ, పుష్పరథ సేవ, పూర్ణాహుతి, 20న చక్రస్నానం ఉత్సవాల పూర్ణాహుతితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ప్రతీ రోజు అన్ని కులాలకు సంబంధించి రోజుకొక్క కులానికి చెందిన వారితో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్య నివేదన, భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, మంచినీటి వితరణ, అన్నదాన కార్యక్రమాలు దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినట్లు ఈవో శేష భారతి తెలిపారు. వేసవి కాలం కావడంతో చలువ పందిళ్లు, భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

సుధీర్‌కుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలి




శ్రీనగర్ కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

హనుమకొండ చౌరస్తా, మే 8: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని హనుమకొండ 4వ డివిజన్ కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్ కోరారు. బుధవారం హనుమకొండ 4వ డివిజన్ పరిధిలోని రెడ్డికాలనీ, యాదవనగర్, కుమ్మరివాడ, పెద్దమ్మగడ్డ, కృష్ణకాలనీ ప్రాంతాలలో పర్యటిస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మనోజ్, శ్యాంసుందర్‌రెడ్డి, జంగ రమేష్, రఘు, రాజేందర్, లక్ష్మణ్, రజిత, సుజాత, విజయ, రాధిక తదితరులు పాల్గొన్నారు.

● వడ్డెపల్లి: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్ భాస్కర్ ఆదేశాల మేరకు బుధవారం బీఆర్ఎస్ శ్రేణులు గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని శ్రీనగర్ కాలనీ నార్త్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ అభ్యర్థి పార్టీ మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటా పంపిణీ చేశారు. ప్రచార కార్యక్రమంలో 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిన్న, బీఆర్ఎస్ శ్రేణులు ఎండి ఖదీర్, బొమ్మ చంద్రమౌళి గౌడ్, జన్ను విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'చెత్త'గా కార్పొరేషన్ పరిసరాలు

- అపరిశుభ్రంగా బల్దియా మరుగుదొడ్లు
- సమస్యలతో వచ్చే వారికి తాగునీటి తండ్లాట
- కానరాని మహిళల విశ్రాంతి గదులు
- విధుల వద్దే సిబ్బంది భోజనాలు



బల్దియా ఆవరణలో అధ్వానంగా మరుగుదొడ్లు



చెత్తా చెదారంతో నిండిన గదులు



విధులు నిర్వర్తించే స్థానంలోనే భోజనాలు చేస్తున్న మహిళా సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, మే 8: వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయ పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. కార్యాలయంలో అసౌకర్యాలు రాజ్యమేలుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు సేద తీరేందుకు కుర్చీలు కాదుగదా.. కనీసం మంచినీరు కూడా అందుబాటులో లేదు. అటు ప్రజలకు, ఇటు సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు వైఫల్యం చెందారు. ప్రధాన కార్యాలయంలోని కొన్నిప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. అలాగే అక్కడక్కడా చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇంకా పౌర సేవా కేంద్రం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న గదులు, గోడలు, పైకప్పు శిథిలావస్థకు చేరి పెచ్చులు ఊడిపడుతుండడంతో సిబ్బంది ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పనిచేస్తున్నారు. కార్యాలయంలో పైఅంతస్తులో ఉన్న సుమారు ఐదు గదులలో చెత్తాచెదారం నిండిపోయి నిరుపయోగంగా ఉంది. ఫైళ్ల నిల్వ చేస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఒక్క ఫైల్ కూడా పనికి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఇంకా ప్రధా న కార్యాలయంలో పలు సెక్షన్లలలో పనిచేస్తున్న సిబ్బందికి కేటాయించిన రెండు బాత్రూమ్‌లు శిథిలావస్థకు చేరి ఉన్నాయి. మహిళా సిబ్బంది మరుగుదొడ్లకు వెళ్లలేకపోతున్నారు. మరుగుదొడ్లలో కూడా నీరు రాకపోవడం, బేషన్లు దెబ్బతిని ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు.

కనిపించని విశ్రాంతి గదులు

బల్దియా కార్యాలయంలో అటెండర్ నుంచి గెజిటెడ్ ఆఫీసర్ వరకు సుమారు వందమంది వరకు విధులు నిర్వర్తిస్తారు. కానీ వీరికి కనీస విశ్రాంతి గదులు అందుబాటులో లేవు. వారు విధులు నిర్వహించే కుర్చీలలోనే మధ్యాహ్న భోజనం చేయడం పరిపాటిగా మారింది. 66 డివిజన్‌ల ద్వారా కోట్ల పన్నులు వసూలు చేసే సిబ్బంది కనీస సౌకర్యాలు లేకుండాపోయాయి. బల్దియా ప్రధాన కార్యాలయంలో మహిళలకు విశ్రాంతి తీసుకునేందుకు ఒక్క గది కూడా కేటాయించకపోవడం ఉద్యోగులకు శాపంగా మారింది. ఇప్పటికైనా కమిషనర్, మేయర్ స్పందించి మహిళా సిబ్బంది శుభ్రతతో కూడిన మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు కేటాయించి ఇవ్వాలని కోరుతున్నారు.

మంచి నీరు కరువు

వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్న వందలాది మంది ప్రజలు సమస్యలు చెప్పుకునేందుకు నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వస్తుంటారు. ప్రజలకు ఇక్కడ కనీసం మంచినీరు కూడా అందుబాటులో ఉండడం లేదు. ఉన్న బల్దియా క్యాంటీన్ సైతం మూసివేయడంతో గత్యంతరం లేక ఎంజీఎం వరకు నడిచి వెళ్లి నీరు కొనుగోలు చేసి తాగే పరిస్థితి ఉంది. అంతే కాకుండా ప్రజల కోసం బల్దియా కార్యాలయం లో ఆవరణలో ఏర్పాటు చేసిన మరుగుదొడ్డి చాలా రోజులుగా పని చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. బల్దియా ప్రధాన కార్యాలయం ముందు ప్రజలకు అందుబాటులో మినరల్ వాటర్‌తో కూడిన పర్మినెంట్ రిఫ్రిజిరేటర్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా సిబ్బందికి ప్రత్యేక మరుగుదొడ్లు, నిరుపయోగంగా ఉన్న గదులను శుభ్రం చేసి విశ్రాంతి గదులుగా మార్చి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్‌ను కమహిళా సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు.



అబ్ కీ బార్?

ఐదో దశలో 695 మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఐదో దశ ఎన్నికలలో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల సంఘం బుధవారం తెలిపింది. 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 49 లోక్‌సభ స్థానాలకు ఐదో దశలో మే 20న ఎన్నికలు జరుగనున్నాయి. తొలుత 749 మంది అభ్యర్థుల నామినేషన్లను ఈసీ ఆమోదించింది. అయితే, పలువురు అభ్యర్థుల నామినేషన్ల విత్‌డ్రా తర్వాత తుదిపోరులో 695 మంది అభ్యర్థులున్నారని పేర్కొంది. ఐదో దశలో అత్యధికంగా యూపీలో 14, మహారాష్ట్రలో 13 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. పశ్చిమబెంగాల్(7), ఒడిశా, బిహార్(5), జార్ఖండ్(3), జమ్ముకశ్మీర్, లడఖ్‌లలో ఒక్కో స్థానానికి పోలింగ్ జరుగుతుంది.

అంబానీ, అదానీలపైకి సీబీఐ, ఈడీని పంపండి!

» వారు డబ్బులు టెంపోల్లో పంపుతారన్నది.. మీ స్వీయానుభవమా మోదీజీ?: రాహుల్



న్యూఢిల్లీ, మే 8: కాంగ్రెస్ పార్టీకి అంబానీ, అదానీల నుంచి డబ్బులు అందాయని, అందుకే వారి పేర్లు ఎత్తడం మానేసిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ అంతే స్థాయిలో బదులిచ్చారు. ఆ ఇద్దరు వ్యాపారవేత్తలపై సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని ప్రధానికి సూచించారు. ఈ మేరకు రాహుల్ బుధవారం ఓ వీడియో మెసేజ్‌ను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "మోదీజీ.. భయపడ్డారా? అంబానీ, అదానీల గురించి సాధారణంగా మీరు గడియ వేసుకొని మాట్లాడతారు. మొట్టమొదటిసారి వారి గురించి బహిరంగంగా మాట్లాడారు. వారు వాహనాల్లో (టెంపోల్లో) డబ్బు పంపిస్తారని కూడా మీకు తెలుసునన్నమాట! ఇది మీ స్వీయానుభవమా?" అని రాహుల్ వ్యాఖ్యానించారు. వారిద్దరికి భయపడకుండా సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని సూచించారు. ఆ వ్యాపారవేత్తలకు మోదీ ఇచ్చే డబ్బును.. కాంగ్రెస్ పార్టీ వివిధ పథకాల ద్వారా దేశంలోని పేదలకు ఇస్తుందన్నారు. బీజేపీ 22 మంది కోటీశ్వరులను చేస్తే.. తాము కోట్ల మందిని కోటీశ్వరులను చేస్తామన్నారు. మరోవైపు మోదీకి ఓటమి కళ్ల ముందు కనిపిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దీంతో మోదీ తన నీడను చూసుకుని కూడా భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ నీడతో కూడిన ఫొటోను 'ఎక్స్'లో జైరాం పోస్ట్ చేశారు.

మోదీ.. ప్రధాని పీఠం కదులుతోంది: ఖర్గే

న్యూఢిల్లీ, మే 8: మోదీ ప్రధాని పీఠం కదులుతోందని అందుకే ఆయన తన సొంత స్నేహితులపై కూడా మాటల దాడి చేయడం మొదలుపెట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యానించారు. దేశంలో మూడు దశల పోలింగ్ ముగిసిన తర్వాత మోదీలో భయం మొదలైందని అన్నారు. కాలం మారుతోందని ఇక స్నేహితులెప్పుడూ స్నేహితులు కాదని, ఇది రాబోయే ఫలితాలకు నిదర్శనం అని ఖర్గే బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. బుధవారం మోదీ అదానీ, అంబానీ, రాహుల్ గాంధీలపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈవీఎంలను తీసుకెళ్తున్న బస్సులో మంటలు

బేతుల్(మధ్యప్రదేశ్), మే 8: మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సిబ్బందిని, ఈవీఎంలను తీసుకువెళతోన్న బస్సు అగ్నిప్రమాదానికి గురవడంతో నాలుగు ఈవీఎంలు పాడయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఎన్నికల సిబ్బంది, బస్సు డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదని బేతుల్ కలెక్టర్ నరేంద్ర సూర్యవంశి చెప్పారు. గోల గ్రామంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ ఘటన జరిగింది. కాలిపోయిన నాలుగు ఈవీఎంలలో నమోదైన ఓట్ల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు కలెక్టర్ సమాధానమిస్తూ... ఎన్నికల సంఘానికి తాను నివేదిక పంపుతానని, రీపోలింగ్ నిర్వహించాలా... లేదా ఏం చేయాలన్న దానిపై ఎన్నికల సంఘమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ఆస్ట్రాజెనికా కొవిడ్ వ్యాక్సిన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ, మే 8: ప్రముఖ ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనికా ప్రపంచ మార్కెట్ నుంచి తన కొవిడ్ వ్యాక్సిన్ వ్యాక్స్‌జెవ్రియా (కోవీషీల్డ్)ను ఉపసంహరించుకుంది. మార్కెట్‌లోకి అనేక కొత్త ఉత్పత్తులు రావడంతో తమ వ్యాక్సిన్‌కు డిమాండ్ తగ్గడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ కంపెనీ బుధవారం ప్రకటించింది. యూరోపియన్ యూనియన్‌లో ఈ వ్యాక్సిన్ కోసం మార్కెటింగ్ అనుమతిని ఈ కంపెనీ స్వచ్ఛందంగా ఉపసంహరించుకుంది. ఇతర దేశాలలోనూ ఈ సంస్థ ఇలాగే చేయొచ్చని భావిస్తున్నారు. భారత్‌తోపాటు ఇతర అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఈ వ్యాక్సీన్‌ను కోవీషీల్డ్‌గా పిలుస్తున్నారు. తమ టీకా వల్ల అరుదైన సందర్భాల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందని ఇటీవలే ఆస్ట్రాజెనికా అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే వ్యాక్సిన్‌ను ఉపసంహరించుకోవడం చర్చనీయాంశమైంది.

ట్రంప్‌తో శృంగారం నిజమే: పోర్న్‌స్టార్ స్టార్మీ

న్యూయార్క్, మే 8: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తాను శృంగారంలో పాల్గొన్నది నిజమేనని పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియల్ వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు న్యూయార్క్ కోర్టులో వాంగ్మూలమిచ్చారు. ట్రంప్ హష్‌మనీ కేసులో కోర్టు వాదనలను నమోదు చేసుకుంటున్న విషయం తెలిసిందే. మంగళవారం 13వరోజు విచారణలో భాగంగా స్టార్మీ డేనియల్ కోర్టుకు హాజరయ్యారు. అసలేం జరిగింది? అనే విషయాన్ని ఆమె పూసగుచ్చినట్టు కోర్టుకు వివరించారు. "2006లో జరిగిన ఓ గోల్ఫ్ టోర్నమెంట్‌లో తొలిసారి ట్రంప్‌ను కలిశా. ఆ తర్వాత ఆయన నన్ను డిన్నర్‌కు ఆహ్వానించారు. ఆయన హోటల్‌సూట్(పెంట్‌హౌస్)కు తీసుకెళ్లారు. అక్కడ డిన్నర్ చేస్తుండగా.. సుఖవ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటానో అడిగి తెలుసుకున్నారు. నన్ను డిన్నర్‌కు పిలవగానే ట్రంప్ ఉద్దేశం అర్థమైంది. ట్రంప్‌తో శృంగారంలో పాల్గొన్నప్పుడు ఆయన కండోమ్ వాడలేదు" అని ఆమె వివరించారు. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఈ అంశాన్ని బయటపెట్టొద్దంటూ ట్రంప్ తనకు 1.3 లక్షల డాలర్లు ఇచ్చినట్టు స్టార్మీ వెల్లడించారు.

దక్షిణాదివారు ఆఫ్రికన్లలా కనిపిస్తారు

ఉత్తరాదివారు శ్వేతజాతీయుల్లా.. ఈశాన్యంలో చైనీయుల్లా.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా ఉంటారు

» కాంగ్రెస్ నేత శామ్‌పిట్రోడా వ్యాఖ్యలు
» శరీర వర్ణం ఆధారంగా అవమానిస్తే సహించేది లేదు: ప్రధాని మోదీ
» పార్టీ పదవికి పిట్రోడా రాజీనామా

న్యూఢిల్లీ, మే 8: ఎన్నికల వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత శామ్‌పిట్రోడా ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారారు! వారసత్వ పన్ను వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు ఇప్పటికే ఒకసారి తిప్పలు తెచ్చిపెట్టిన ఆయన.. తాజాగా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశాన్ని ఎన్నో వైవిధ్యాలున్న దేశంగా అభివర్ణించే క్రమంలో.. దక్షిణభారతీయులు ఆఫ్రికన్లలా కనిపిస్తారని.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా, ఈశాన్య రాష్ట్రాల వారు చైనీయుల్లా, ఉత్తరాది వారు తెల్లవారిలా ఉంటారని వ్యాఖ్యానించారు. 'ద స్టేట్స్‌మన్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన.. "మన స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్‌వారితో పోట్లాడింది హిందూ దేశం కోసం కాదు.. లౌకిక దేశం కోసం. మతం ఆధారంగా ఏర్పడిన పాకిస్థాన్ పరిస్థితి ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం. మన మేమో ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్యానికి ఉదాహరణగా నిలిచాం. చిన్నచిన్న విభేదాలున్నా మనం ఈ 75 ఏళ్లూ చాలా సంతోషకరమైన వాతావరణంలో మనగలిగాం. ఎన్ని తేడాలున్నా మనందరం సహోదరులం. విభిన్న భాషలు, మతాలు, ఆచారాలు, ఆహారాన్ని పరస్పరం గౌరవించుకుంటాం" అని పేర్కొంటూ.. దేశ వైవిధ్యం గురించి చెప్పే క్రమంలో ఆఫ్రికన్లు, చైనీయులతో భారతీయులను పోల్చారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. భారతదేశ భిన్నత్వం గురించి చెప్పడానికి శామ్‌పిట్రోడా పోల్చిన తీరు పూర్తిగా తప్పు అని, ఆ పోలికలు ఆమోదయోగ్యం కానివని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు. ఆయన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. శరీర వర్ణం ఆధారంగా అవమానించడాన్ని ఈ దేశం సహించదని.. తాను అస్సలు సహించబోనని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రౌపది ముర్ము శరీర వర్ణం కారణంగానే.. కాంగ్రెస్ పార్టీ అప్పట్లో రాష్ట్రపతి పదవికి ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిందనే విషయం తనకు ఇప్పుడు అర్థమవుతోందని... ముర్ము చర్మం రంగు నల్లగా ఉంది కాబట్టి కాంగ్రెస్ నేతలు ఆమెను ఆఫ్రికన్‌గా భావించారని వ్యాఖ్యానించారు.



ఆలోచన విధానాన్ని బయటపెట్టుకొన్నారు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ఎక్స్'లో శామ్ పిట్రోడా వ్యాఖ్యల వీడియోను పోస్ట్ చేసి.. "నేను దక్షిణాదికి చెందిన దాన్నే. నేను ఇండియన్‌లాగానే కనపడతాను. మా బృందంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారున్నారు. వాళ్లూ భారతీయుల్లాగానే ఉంటారు. పశ్చిమభారతదేశానికి చెందిన నా కొలీగ్స్ కూడా భారతీయుల్లాగానే ఉంటారు. కానీ.. రాహుల్‌గాంధీ సలహాదారు, జాత్యహంకారి అయిన వ్యక్తికి మాత్రం మేమందరం ఆఫ్రికన్లలా, చైనీయుల్లా, అరబ్బుల్లా, తెల్లవారిలా కనపడతాం. మీ ఆలోచనాధోరణిని, వ్యక్తిత్వాన్ని బయటపెట్టుకున్నందుకు కృతజ్ఞతలు. ఇండీ కూటమీ.. సిగ్గుచేటు" అని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. అస్సోం సీఎం హిమంత ట్విటర్‌లో శామ్‌పిట్రోడాను ఉద్దేశించి.. "శామ్ భాయ్, నేను ఈశాన్య రాష్ట్రానికి చెందినవాడినే. నేను భారతీయుడిలాగానే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. కొందరు నెటిజన్లేమో.. 'దక్షిణాది ప్రజలు నల్లగా ఉంటారు' అంటూ గతంలో బీజేపీ నేత తరుణ్ విజయ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నారు. అయితే.. తన వ్యాఖ్యలు ఎన్నికల వేళ పార్టీకి ఇబ్బందికరంగా మారడంతో 'ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్' చైర్మన్ పదవికి పిట్రోడా రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆమోదించినట్టు జైరామ్ రమేశ్ తెలిపారు.

బీజేపీ పోస్టుపై వివాదం

బెంగళూరు, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఇటీవల బీజేపీ పెట్టిన ఓ పోస్టు వివాదాస్పదమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లను ముస్లింలకు అనుకూలంగా కాంగ్రెస్ మార్చనుందని అందులో పేర్కొన్నారు. ఆ పోస్ట్‌ను తక్షణమే తొలగించాలని కర్ణాటక బీజేపీని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ మీనా ఆదేశించారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు, పార్టీ ఐటీసెల్ హెడ్ అమిత్ మాలవీయకు పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో పెట్టిన వివాదాస్పద పోస్టుపై హైగ్రౌండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ పోస్టును తొలగించాలని ఎన్నికల కమిషన్ సూచించినా కర్ణాటక బీజేపీ స్పందించలేదు. దీంతో 'ఎక్స్' సంస్థకు ఎన్నికల కమిషన్ మంగళవారం నోటీస్ ఇచ్చింది. ఐటీ యాక్ట్ 79(3)(బీ) ప్రకారం వివాదాస్పద పోస్ట్‌ను తొలగించాలని ఈ నెల 5న ఈసీ సూచించింది.

మోదీపై ఆరేళ్లపాటు అనర్హత వేటు వేయాలి

» సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ/చెన్నై, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రజలను రెచ్చగొట్టేలా, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉద్విగ్న, ఉద్రేగపూరిత ప్రసంగాలు చేస్తున్న మోదీపై ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టులో బుధవారం రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిని ఫాతిమా అనే మహిళ దఖలు చేశారు. మతం, దేవుళ్లు, ప్రార్థనా స్థలాల పేర్లు చెప్పి మోదీ ఓట్లు అడుగుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి గత నెల 9న యూపీలోని పిలిభిత్‌లో, 21న రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో మోదీ చేసిన ప్రసంగాలను ఆమె ఉదాహరణగా చూపారు. దీనిపై విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. మోదీపై ఎన్నికల కమిషన్ కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎన్నికల ప్రచారంలో మోదీ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఉపన్యాసాలిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

రెండేళ్లలో పలు పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం: పవార్

న్యూఢిల్లీ, మే 8: రాబోయే రెండేళ్లలో పలు ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌లో విలీనమవుతాయని లేదా ఆ పార్టీకి మరింత దగ్గరవుతాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ కూడా అదే బాటలో ఉందా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ తమ పార్టీకి, కాంగ్రెస్‌కు ఎలాంటి తేడా లేదని వ్యాఖ్యానించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు ఒకటేనని, రెండూ గాంధీ-నెహ్రూ సూత్రాలను ఆచరించేవేనని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కూడా భావ సారూప్య పార్టీలతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉన్నారని చెప్పారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవార్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీనిపై విత్రపక్షమైన శివసేన (యూబీటీ) ఆచితూచి స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొంది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన ఆప్, సీపీఐ స్పందిస్తూ అది ఆయన సొంత అంచనా మాత్రమేనని వ్యాఖ్యానించాయి.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై రేపు తీర్పు..

» జైలు నుంచి పాలన సాగించేందుకు సౌకర్యాలు కల్పించాలన్న పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ, మే 8: మద్యం కుంభకోణానికి సంబంధించి మనీ ల్యాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారానికి రిజర్వ్ చేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ధర్మాసనం.. ఇరు పక్షాల వాదనలు నమోదు చేసింది. 'ఈ నెల 10వ తేదీన మధ్యంతర ఉత్తర్వులను వెలువరిస్తాం. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా అదే రోజు విచారిస్తాం' అని ధర్మాసనం బుధవారం వెల్లడించింది. ఒకవేళ ఈ కేసులో మధ్యంతర బెయిల్ ఇస్తే ప్రభుత్వ అధికారిక విధులు నిర్వర్తించేందుకు అనుమతించబోమని.. ఫైళ్లపై సంతకాలు చేయకూడదని మంగళవారం విచారణ సందర్భంగా కోర్టు తెలిపింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓ పార్టీ అధినేతగా ప్రచారం చేసుకోవచ్చని సూచించింది. ఇదిలా ఉండగా, తిహాడ్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపేందుకు సీఎం కేజ్రీవాల్‌కు సౌకర్యాలు కల్పించాలంటూ వేసిన పిల్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. అంతేకాకుండా పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా కూడా విధించింది. న్యాయవాది శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం.. 'మేం ఎమర్జెన్సీ విధించాలా? సెన్సార్‌షిప్ లేదా మార్షల్ చట్టాన్ని అమలు చేయాలా? మీడియాకు, రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా మేమేలా ఆదేశాలిస్తాం?' అంటూ పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది.

మోదీ ఒక్క పథకమైనా తీసుకొచ్చారా?

» పదేళ్లలో ఒక్క సంస్థనైనా ప్రారంభించారా?
» బీజేపీ అంచనాలు తలకిందులవుతున్నాయి
» పీటీఐ ఇంటర్వ్యూలో ప్రియాంకాగాంధీ

రాయ్‌బరేలీ, మే 8: ప్రధాని మోదీ తన పదేళ్ల హయాంలో ఒక్క పథకాన్నైనా ప్రారంభించారా, ఒక్క సంస్థనైనా నెలకొల్పారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించిన వాటిని పేరు మార్చి అమలు పరిచినవి కాకుండా, మోదీ స్వయంగా మొదలుపెట్టిన ఒక్క పథకమైనా ఉంటే అదేమిటో చెప్పాలని ప్రధానికి సవాల్ విసిరారు. మూడు దశల ఎన్నికల తర్వాత దేశంలో మార్పు పవనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. బుధవారం ఆమె పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తొలగించి వాటిని ముస్లింలకు ఇస్తుందని, అయోధ్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తిరగరాస్తుందని మోదీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. వాస్తవాలను పట్టించుకోకుండా, ఊహాలోకంలో విహరిస్తూ ఆయన మాట్లాడుతున్నట్లు ఉందన్నారు. 'గత పది రోజులుగా గమనిస్తున్నా.. ఆయన ప్రసంగాలు ఊహాజనిత అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. దేశ ప్రజలంటే అతడికి గౌరవం లేదు. అందుకనే వాస్తవాలతో సంబంధం లేకుండా మాట్లాడుతున్నారు. మేం ప్రజల్నించి బర్రెలను గుంజుకుంటామని, వారి ఇళ్లలో ఆభరణాలు, సంపదను గుర్తించటానికి ఎక్స్‌రే మిషన్లను పెడతామని ఏదేదో చెబుతున్నారు. ప్రధాన మంత్రి అంతటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి కాకుండా మరెవరైనా ఇటువంటి మాటలు మాట్లాడితే నవ్వుకుంటాం. కానీ, స్వయంగా ప్రధానే ఈ అబద్ధాలను నిజాలుగా ప్రజల్ని నమ్మించాలని చూస్తున్నారు' అని పేర్కొన్నారు.



రాయ్‌బరేలీలో ప్రియాంక ఎన్నికల ప్రచారం

రాజ్యాంగాన్ని మారుస్తామని వారే చెప్పారు

బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని మీరట్ బీజేపీ అభ్యర్థి, కొందరు కేంద్రమంత్రులు బహిరంగంగా చెప్పారని ప్రియాంక గుర్తు చేశారు. 'రాజ్యాంగం వల్లనే దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. రిజర్వేషన్లు ఉన్నాయి. ఓటు హక్కు ఉంది. అటువంటి రాజ్యాంగాన్ని మార్చి ప్రజల హక్కులను బీజేపీ బలహీనపరచాలని చూస్తే ఊరుకోబోము. బీజేపీని ఆ పని చేయనివ్వం' అని ప్రియాంక స్పష్టం చేశారు. దేశంలో మార్పు పవనాలు కనిపిస్తున్నాయని.. అందుకనే 400 సీట్లకుపైగా అనే బీజేపీ అంచనాలు క్రమేణా తగ్గుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజానుకూల గ్యారెంటీలతో సాధారణ ప్రజలు ఎలా లబ్ధి పొందుతున్నారో చెప్పటానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలే ఉదాహరణ అని ప్రియాంక పేర్కొన్నారు.

బ్రిటిష్ రాజ్‌ను తలపిస్తున్న మోదీ పాలన

కేంద్రంలో బీజేపీ పాలన 'బ్రిటిష్ రాజ్'ను తలపిస్తోందని ప్రియాంక గాంధీ అన్నారు. మోదీ పాలనతో ప్రభుత్వ విధానాలను కేవలం కోటీశ్వరులను దృష్టిలో పెట్టుకొని రూపొందిస్తున్నారని, పేదలను, రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం ప్రియాంక రాయ్‌బరేలీలో తన సోదరుడు రాహుల్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. "ఐదేళ్లుగా అదానీ, అంబానీల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ.. ఎన్నికల ప్రచారంలో మాత్రం వారి పేర్లు తీయడం లేదు" అన్న మోదీ వ్యాఖ్యలపైనా ప్రియాంక స్పందించారు. "బడా పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కై. వారి రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందే బీజేపీ" అంటూ ఎదురుదాడి చేశారు. బీజేపీ పరివారమంతా రాహుల్‌పై అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉందన్నారు.

మూకుమ్మడి సెలవులతో 90 విమానాలు రద్దు

» ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో 300 మంది సిక్‌లీవ్.. వివరణ కోరిన డీజీసీఏ

న్యూఢిల్లీ, మే8: టాటాగ్రూప్ టేకోవర్ చేసిన విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది మూకుమ్మడి సెలవులు పెట్టడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా 90కిపైగా విమానాలు రద్దయ్యాయి. వీటిలో అంతర్జాతీయ విమానాలూ ఉన్నాయి. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాలన్నీ రద్దవడంతో మళయాలీలు ఆయా విమానాశ్రయాల్లో ఆందోళన చేశారు. అక్కడి ప్రయాణికులతో తమ సిబ్బంది సమ్మెలో ఉండడంవల్ల ఈ పరిస్థితి నెలకొందని అధికారికంగా చెప్పిన ఎయిరిండియా.. ఆ తర్వాత ఓ పత్రికా ప్రకటనలో సిబ్బంది మూకుమ్మడి సెలవులే కారణమని పేర్కొంది. "విమానాల్లో ప్రయాణికులకు సేవలందించే 300మంది వరకు సిబ్బంది మూకుమ్మడిగా సిక్‌లీవ్‌లు పెట్టారు. దీంతో పలు సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. ప్రయాణికుల టికెట్ ధరను పూర్తిగా రిఫండ్ చేస్తాం. లేదా వారు కోరుకున్న తేదీకి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తాం" అని ఎయిరిండియా అధికార ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రద్దు ప్రభావం కేరళీయులపై ఎక్కువగా పడింది. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే విమానాలన్నీ రద్దవడంతో ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. "సెక్యూరిటీ, బ్యాగేజ్ చెక్‌ఇన్, ఇమిగ్రేషన్ పూర్తయ్యాక.. విమానం రద్దు సందేశం వచ్చింది. నేను గురువారమే నా ఉద్యోగంలో చేరాలి. లేకుంటే నా కొలువు ఊడిపోతుంది" అని కన్నూరుకు చెందిన ఓ మహిళ వాపోయారు. కొందరు ప్రయాణికులకు ఈ నెల 14 నుంచి 17 తేదీల్లో విమాన ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. సిబ్బంది సమ్మెకు వెళ్తున్న విషయం తమకు 2 గంటల ముందే తెలిసిందని పేర్కొంది. కాగా ఆ తేదీల్లోగా తమ వర్క్‌వీసా గడువు ముగిసిపోతుందని, అదే జరిగితే తమకు ఆత్మహత్య తప్ప మరో మార్గం ఉండదని పలువురు ప్రయాణికులు వాపోయారు. కొందరు దుబాయ్, బహ్రెయిన్, సౌదీల్లో ఉద్యోగాల కోసం షెడ్యూల్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంది. ప్రయాణికుల అవస్థలు చూసిన కేరళ సర్కారు. విపక్ష పార్టీలు కేంద్ర విమానయాన మంత్రికి లేఖలు రాశాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాయి.



వివాదంగా ఎందుకు మారింది?

అప్పుల్లో ఉన్న ఎయిరిండియాను టాటాగ్రూప్ కొనుగోలు చేసింది. అప్పటికే టాటాగ్రూప్ విస్తారా విమానయాన సంస్థను నిర్వహిస్తోంది. తాజాగా ఎయిరిండియాలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ (ఏఐఎక్స్ కనెక్ట్– గతంలో ఎయిర్‌ఏషియా ఇండియా), విస్తారాను విలీనం చేయాలని నిర్ణయించింది. అప్పటి నుంచి టాటాగ్రూప్ ఆయా విమానయాన సంస్థల్లోని సిబ్బంది, ఉద్యోగుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. గత నెల్లో విస్తారాలో పైలట్లు మూకుమ్మడిగా సెలవులు పెట్టడంతో పలు విమానాలు రద్దుచేయాల్సి వచ్చింది.! తాజాగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకనేక కారణాలున్నాయని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సంఘం వివరించింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల పట్ల టాటాగ్రూప్ అసమానతలను చూపుతోందని ఆరోపించింది. కాగా.. బుధవారం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రద్దుతో తానూ బాధితుడిగా మారానని జమ్మూకశ్మీర్‌కు చెందిన డీపీఏపీ చీఫ్ గులామ్ నబీ ఆజాద్ అన్నారు.

హిందూ జనాభా తగ్గుముఖం

» 1950-2015 మధ్య 8% తగ్గుదల
» మైనారిటీల జనాభాలో పెరుగుదల
» ప్రధాని సలహామండలి అధ్యయనం

న్యూఢిల్లీ, మే8: దేశంలో మెజారిటీ జనాభాగా ఉన్న హిందువుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించింది. 1950-2015 మధ్యకాలంలో 7.8% హిందువులు తగ్గిపోయినట్టు తెలిపింది. కానీ, మైనారిటీ జనాభా పెరిగినట్టు పేర్కొంది. పెరిగిన వారిలో ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కుల జనాభా ఉన్నట్టు తెలిపింది. జైనులు, పార్సీల జనాభా తగ్గుముఖం పట్టినట్టు పేర్కొంది. ఇదే సమయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో అక్కడి మెజారిటీ జనాభా పెరిగినట్టు తమ అధ్యయనంలో తెలిపింది. 1950-2015 మధ్య ముస్లిం జనాభా వాటా 43.15% పెరగ్గా, క్రిస్టియన్ జనాభా5.38%, సిక్కులు6.58% పెరిగినట్టు పేర్కొంది. బౌద్ధుల జనాభాలోనూ కొంత పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. హిందూ జనాభా విషయానికివస్తే 1950లో 84శాతం ఉన్న వీరు 2015నాటికి 78శాతానికి చేరినట్టు పీఎం సలహా మండలి పేర్కొంది. గత 65ఏళ్లలో 9.84% నుంచి 14.09శాతానికి ముస్లిం జనాభా పెరిగినట్టు తెలిపింది. మెజారిటీ జనాభా తగ్గుదలలో మయన్మార్ తొలి స్థానంలో ఉందని, ఇక్కడ 10% మెజారిటీ జనాభా తగ్గిందని, తర్వాత స్థానంలో భారత్ ఉందని తెలిపింది. మూడో స్థానంలో ఉన్న నేపాల్‌లో మెజారిటీ హిందూ జనాభా 3.6% తగ్గినట్టు పేర్కొంది. 167 దేశాల్లోని మెజారిటీ జనాభాపై చేసిన అధ్యయన వివరాలను పీఎం సలహా మండలి ఈ నెలలో విడుదల చేసింది. "భారత్‌లో మైనారిటీలకు రక్షణే కాకుండా వారి అభివృద్ధికీ ప్రభుత్వాలు దోహదపడుతున్నాయి"అని నివేదిక పేర్కొంది. భారత్‌లో హిందూ జనాభా తగ్గడం, మైనారిటీ జనాభా పెరగడానికి కారణాలు తెలియదని, కేవలం సంఖ్యాపరంగానే అధ్యయనం చేసినట్టు తెలిపింది.

మాల్.. ధమాల్

» దేశంలోని నగరాల్లో పెరుగుతున్న ఘోస్ట్ మాల్స్
» ఆన్‌లైన్ షాపింగ్‌కు పెరుగుతున్న ఆదరణ వల్లే

న్యూఢిల్లీ, మే 8: దేశంలోని మెట్రో నగరాల్లో ఘోస్ట్ మాల్స్ అధికమవుతున్నాయి. ఓ షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్న మొత్తం స్థలంలో 40% చోటు నిరుపయోగంగా మిగిలిపోతే దానిని ఘోస్ట్ మాల్ అంటారు. ఇలాంటి మాల్స్ సంఖ్య రోజురోజుకి పెరిగిపోతోంది. 2022లో దేశవ్యాప్తంగా 57 ఘోస్ట్ మాల్స్ ఉండగా 2023 నాటికి అది 64కు పెరిగింది. నైట్ ఫ్రాంక్ ఇండియా అనే స్థిరాస్తి సంస్థ చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనం ప్రకారం.. ఘోస్ట్ మాల్స్‌గా మారిన 64 షాపింగ్ మాల్స్ విస్తీర్ణం సుమారు 1.33 కోట్ల చదరపు అడుగులు ఉంటుంది. ఆయా మాల్స్ వల్ల రూ.6,700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆ నివేదిక పేర్కొంది. ఇక, 64 ఘోస్ట్ మాల్స్‌లో 21 దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలోనే ఉన్నాయి. తర్వాతి స్థానంలో బెంగళూరు(12 మాల్స్) ఉంది. హైదరాబాద్‌లో 4 ఘోస్ట్ మాల్స్ ఉన్నాయి. ఆన్‌లైన్ షాపింగ్‌కు ఆదరణతోనే ఈ మాల్స్ పెరుగుతున్నట్లు నివేదిక తెలిపింది.

సౌర విద్యుత్‌లో జపాన్‌ను దాటేసిన భారత్

న్యూఢిల్లీ, మే 8: సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో భారత్ గణనీయ వృద్ధి సాధించింది. ప్రముఖ గ్లోబల్ ఎనర్జీ సంస్థ ఎంబర్ నివేదిక ప్రకారం 2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో జపాన్‌ను అధిగమించి మూడో స్థానానికి చేరుకుంది. 2015లో భారత్ తొమ్మిదో స్థానంలో ఉంది. ఎంబర్ బుధవారం విడుదల చేసిన గ్లోబల్ ఎలక్ట్రిసిటీ రివ్యూ-2024లో ఈ వివరాలు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 225 దేశాల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. 2023లో చైనా 156 టెరావాట్ హవర్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, అమెరికా 33, భారత్ 18 టెరావాట్ హవర్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తి అనూహ్యంగా పెరుగుతోందని ఎంబర్ ఆసియా ప్రోగ్రామ్ డైరెక్టర్ ఆదిత్య లొల్లా చెప్పారు. 2015తో పోలిస్తే ప్రపంచ సౌర విద్యుత్ ఉత్పత్తి 2023లో 6 రెట్లు పెరిగింది. ఇదే సమయంలో భారత్‌లో ఇది 17 రెట్లు పెరిగింది. 2015లో భారత విద్యుత్ ఉత్పత్తిలో సౌరశక్తి వాటా 0.5 శాతం ఉండగా.. 2023లో అది 5.8 శాతానికి ఎగబాకింది.

లోకం తీరు

వైసీపీ ప్రభుత్వానికి ఏపీ హైకోర్టులో నిరాశ!



ఒక్కవానతో.. విద్యుత్తు వ్యవస్థకు షాక్!

- దెబ్బతిన్న ట్రాన్స్‌ఫార్మర్లు.. 1500 ఫీడర్ల ట్రిప్
- హైదరాబాద్‌లో చీకట్లు.. తెల్లారి మధ్యాహ్నం దాకా బంద్
- కొన్నిచోట్ల ఏకంగా 26 గంటలు నో పవర్

హైదరాబాద్ సిటీ/కేపీహెచ్‌బీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఒక్కవాన.. ఒకే ఒక్క జోరు వాన, హైదరాబాద్ వ్యాప్తంగా విద్యుత్తు వ్యవస్థను అస్తవ్యవస్తం చేసింది. ఫీడర్లు ట్రిప్పవడంతో నగర వ్యాప్తంగా చాలాచోట్ల 8 గంటల నుంచి 26 గంటల దాకా విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం రాత్రంతా జనం జాగారం చేశారు. చార్జింగ్ లేక మొబైల్‌ఫోన్లు పనిచేయకపోవడం, బుధవారం ఉదయం 10 గంటల వరకు కరెంట్ రాకపోవడంతో ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు ఇళ్లలో నీళ్లు లేక, మోటర్లు పనిచేయక అవస్థలు పడ్డారు. మంగళవారం సాయంత్రం 5 గంటల దాకా.. రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా ఉంటోందని.. రికార్డు స్థాయిలో 90 మిలియన్ యూనిట్లు విద్యుత్తు వినియోగం ఉందనే ఆ శాఖ ఘనతను ఒక్కగాలివాన వణికించింది. మంగళవారం సాయంత్రం రెండుగంటలు కురిసిన భారీ వర్షానికి గ్రేటర్‌లో 1500కు పైగా ఫీడర్లు ట్రిప్పయ్యాయి. రాత్రి 12 గంటల వరకు 1371 ఫీడర్లలో విద్యుత్తు సరఫరా పునరుద్ధరించినా మిలిగిన ప్రాంతాల్లో ఉదయం 10 గంటల వరకు పునరుద్ధరించలేకపోయారు. రెండు మూడుచోట్ల అయితే 8 గంటల నుంచి 22 గంటల పాటు కరెంట్ సరఫరా కాలేదు. వర్షానికి చెట్లు, కొమ్మలు విద్యుత్తు తీగలపై పడటంతో తీగలు తెగిపడి, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. చెట్లుకూలిన ప్రాంతాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్తు మరమ్మతు పనులు చేపట్టారు. కేపీహెచ్‌బీ పరిసరాల్లో 26 గంటలు కరెంట్ లేకపోవడంతో సుమారు వెయ్యి కుటుంబాలు నరకయాతన అనుభవించారు. వర్షానికి కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు నిలిచిన విద్యుత్తు సరఫరా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వచ్చింది. విద్యుత్తు స్తంభాలు, తీగలు తెగిపోతే ప్రత్యామ్నాయ ఫీడర్ల నుంచి విద్యుత్తు సరఫరా పునరుద్ధరించాల్సిన అధికారులు అలాంటి చర్యలేవి తీసుకోలేదు,


తారానగర్‌లో చెట్లు, కొమ్మలు తొలగిస్తున్న విద్యుత్తు సిబ్బంది

ప్రభుత్వ విభాగాల నిర్లక్ష్యంతోనే

మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షం.. రోడ్లపై వరద, ట్రాఫిక్ జామ్, కూలిపోయిన చెట్లు, నిలిచిన విద్యుత్తు సరఫరా వంటి సమస్యల పరంగా జనాన్ని తీవ్ర ఇబ్బందులు కలిగించింది. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్, టీఎస్ఎస్‌పీడీసీఎల్, వాటర్ బోర్డు ఉన్నతాధికారుల నిర్లక్ష్యమే ఈ సమస్యలకు కారణమన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారని తెలిసి.. కమిషనర్ రోనాల్డ్ రోస్ మార్గమధ్యలో వారితోపాటు పలు ప్రాంతాలను పరిశీలించారు.

కూలిన బతుకులు!

బాచుపల్లిలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ రిటైనింగ్ వాల్ .. నాలుగేళ్ల బాలుడు సహా ఏడుగురి దుర్మరణం

నిజాంపేట/అడ్డగుట్ట, మే 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బాచుపల్లిలో ఘోరం జరిగింది. మంగళవారం రాత్రి నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ రిటైనింగ్ వాల్ కూలిపోయింది! శిథిలాలన్నీ నేరుగా ఆ పక్కనే గుడిసెల్లో ఉంటున్న కూలీలపై పడ్డాయి. ఈ ఘటనలో నాలుగేళ్ల బాలుడు, అతడి తల్లిదండ్రులు, మరో జంట సహా ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. మృతులు, క్షతగాత్రులంతా పొట్ట చేతపట్టుకొని బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలే. మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీలే! ఈ దారుణ ఘటనకు రైజ్ డెవలపర్స్ అనే నిర్మాణ సంస్థ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. పాత సిమెంట్ ఇటుక గోడపై రిటైనింగ్ వాల్ నిర్మించడం, అక్కడ వర్షపు నీళ్లు నిలిచి.. ఒత్తిడికి గోడ కూలిందని చెబుతున్నారు. పనులు ముగించుకొని గుడిసెల్లోకి వెళ్లిన కొద్దిసేపటికే తమవాళ్లు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలోని సర్వే నంబర్ 345 పార్ట్, 406 పార్ట్‌లో 2000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సెల్లార్, స్టిల్ట్ ప్లస్ ఐదంతస్తుల భవన నిర్మాణాల కోసం రైజ్ డెవలపర్స్ కంపెనీ, హెచ్‌ఎండీఏ నుంచి అనుమతులు పొందింది. రెండు, మూడు బ్లాక్‌లుగా ఇక్కడ భవనాల నిర్మాణం జరుగుతోంది. వాస్తవానికి నిర్మాణం పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగో అంతస్తు శ్లాబ్ పనులు కొనసాగుతున్నాయి.


రిటైనింగ్ గోడ కూలిన ప్రాంతం ఇదే...

ఎత్తు వంపులుగా స్థలం ఉండటంతో ముంపు ముప్పు లేకుండా ఉండేందుకు ఎక్కువ ఎత్తులో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో భవనానికి ఓ వైపు రిటైనింగ్ వాల్ నిర్మించి సుమారు 30 అడుగుల మేర మట్టి పోశారు. రిటైనింగ్ వాల్‌కు ఆవలివైపు కార్మికులు నివసించేందుకు గుడిసెలు నిర్మించారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కార్మికులు పనులు ముగించుకొని గుడిసెల్లోకి చేరుకున్నారు. వర్షానికి నీళ్లు పల్లంవైపు ఉన్న మట్టి వైపు వచ్చాయి. భారీగా వరద నీరు వచ్చి చేరడంతో మట్టి కుంగింది. దీంతో సాయంత్రం 6.40 గంటలకు రిటైనింగ్ వాల్ ఒక్కసారిగా కూలింది. లోపలున్న వారిలో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను ఛత్తీస్‌గఢ్‌కు చెందిన రామ్‌యాదవ్ (44), ఆయన భార్య గీతబల్ (40), వారి కుమారుడు హిమాన్షు (4), సంకదేబ్‌గౌడ్ (18), మహారాష్ట్రకు చెందిన బింద్రేశ్ భవానీ చౌహాన్ (30), ఆయన భార్య ఖుషి (20), ఒడిసాకు చెందిన శ్రీపతి మాగి (23)గా గుర్తించారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వర్షం పడుతుండటం, విద్యుత్తు సరఫరా లేకపోవడంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యాయి. సాయంత్రం 6.40కి ప్రమాదం జరిగితే రాత్రి 8 గంటలకు ప్లొక్లెయినర్‌తో శిథిలాలను తొలగించడం ప్రారంభించారు. మొదటి మృతదేహాన్ని సుమారు రాత్రి 11 గంటల సమయంలో బయటికి వెలికి తీసినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి నిర్మాణ సంస్థ యజమాని అరవిండ్ రెడ్డి, కాంట్రాక్టర్లు రాజేశ్‌రెడ్డి, రాంరెడ్డిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు చెప్పారు. కాగా నిర్మాణ స్థలిని హెచ్‌ఎండీఏ అధికారులు పరిశీలించారు. ప్రాజెక్టు అనుమతులను నిలిపివేశారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి

- కరీంనగర్, రంగారెడ్డిలో భారీ వర్షం
- నేడు, రేపు పలు చోట్ల వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కూడా కొన్నిచోట్ల వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. రంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం పడింది. ఈదురుగాలుల బీభత్సానికి జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాల్లో మామిడి, బొప్పాయి, అరటి తోటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతిచెందారు. మెదక్ జిల్లా చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామంలో ఓ కంపెనీ వద్ద తాటిచెట్టు కూలి మీద పడటంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన అమల్ రేబ్‌నాథ్ (33) అనే కార్మికుడు మృతిచెందాడు. హైదరాబాద్ బేగంపేటలో మంగళవారం రాత్రి ఒడిసాకు చెందిన చంద్ర పాండా (38), మనోజ్ దాస్ (45) అనే ఇద్దరు స్నేహితులు మద్యం మత్తులో నడుచుకుంటూ ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతిచెందారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలోని సీతారాంపట్నానికి చెందిన వ్యాపారి బోళ్ల శ్రీనివాసరావు (48), వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం దర్దెపల్లి గ్రామానికి చెందిన గిద్దెల రాజు (35) అనే వ్యక్తి, సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన అబ్బగాని ప్రమీల (53) అనే మహిళ మృతిచెందారు. కాగా గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రెండ్రోజుల్లో 40 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. నిజామాబాద్ జిల్లా జకోరా, నిజామాబాద్ పట్టణంలో గరిష్ఠంగా 42.9, అదే జిల్లా కొరాటపల్లిలో42.8, నిర్మల్ జిల్లా నర్సాపూర్‌లో 42.6, నిజామాబాద్ జిల్లా మోస్రా, సాలూర, నిర్మల్ జిల్లా తానూర్‌లో 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.


బేగంపేట నాలాలో కొట్టుకు వచ్చిన రెండు మృతదేహాలు



ఓటర్ల కోసం 2,500 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ఓటర్ల కోసం టీఎస్ఆర్టీసీ 2,500 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. మే 13న పోలింగ్ ఉండగా.. 11న రెండో శనివారం, 12న ఆదివారం సెలవు ఉండటంతో ముందుగానే సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా శుక్రవారం (10వ తేదీ) నుంచే ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. మే10న 500, 11న 750, 12న 750, 13న 500 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

కాంగ్రెస్ ప్రచారంలో ఢిల్లీ పోలీసుల జోక్యం

- వారెంట్ లేకుండా కార్యకర్తల ఇళ్లల్లోకి వెళ్లి సోదాలు
- హైకోర్టులో మహేశ్‌కుమార్ గౌడ్ పిటిషన్

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శుల వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడంతో పాటు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు వారిని వేధిస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ హైకోర్టును ఆశ్రయించారు. 29 మంది టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఢిల్లీ పోలీసులను ఆదేశించాలని పిటిషన్ దాఖలు చేశారు. అమిత్ షా మార్ఫింగ్ వీడియోను కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిలు సోషల్ మీడియాలో పెట్టారన్న ఆరోపణలతో దాదాపు 150మంది ఢిల్లీ పోలీసులు తమ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో జోక్యం చేసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తులో ఉండగా ఢిల్లీ పోలీసులు తమ సోషల్ మీడియా కార్యదర్శులకు 91/160సీఆర్పీసీ నోటీసులు ఇవ్వడంతో పాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి వారంట్ లేకుండా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి సోదాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ పిటిషన్ గురువారం జస్టిస్ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.

నేడు రాహుల్..ఎల్లుండి ప్రియాంక ప్రచారం

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ.. మరోమారు తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. గురువారం మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నర్సాపూర్‌లో, మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే జనజాతర సభల్లో ఆయన పాల్గొంటారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్లో సాయంత్రం 4 గంటల వరకు నర్సాపూర్‌కు చేరుకుంటారు. అక్కడి సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు సరూర్‌నగర్‌కు వెళ్తారు. సరూర్‌నగర్ సభ ముగియగానే ఢిల్లీకి తిరుగుప్రయాణమవుతారు. కాగా, శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. భువనగిరి నియోజకవర్గంలోని నకిరేకల్‌లో జరిగే జనజాతర సభలో పాల్గొంటారు. 11న(శనివారం) ప్రియాంక కామారెడ్డిలో జరిగే రోడ్‌షోలోను, తాండూరు సభలోనూ పాల్గొంటారు.

ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పుపై.. సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పుపై ఆదిలాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బుధవారం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని ఈ మేరకు ఆయన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. హైకోర్టు ఆదేశాలను దండె విఠల్ ఒకవేళ సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే తమ వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆదిలాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీగా దండె విఠల్ ఎన్నిక చెల్లదని గత శుక్రవారం తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. 2022లో ఆదిలాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ తరఫున విఠల్ గెలిచారు. ఆ సమయంలో విఠల్‌కు ప్రత్యర్థిగా పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. తాను విత్ డ్రా చేసుకోకపోయినా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఎన్నికల బరి నుంచి తప్పించారని రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సంతకం ఫోర్జరీ జరిగిందని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విఠల్ ఎన్నిక చెల్లదని హైకోర్టు తీర్పును వెలువరించింది. అయితే హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానని దండె విఠల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో పిటిషనర్ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ముందుగానే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు.

రాజన్న సాక్షిగా మోదీ అబద్ధాలు చెప్పారు

- కరీంనగర్‌కు చేసిందేంటో చెప్పలేదు: పొన్నం

కరీంనగర్ అర్బన్, మే 8: వేములవాడ రాజన్న సాక్షిగా ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధికి చేసిందేంటో చెప్పాలని తాము అడిగిన దానికి జవాబు మాత్రం చెప్పలేదని దుయ్యబట్టారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన మోదీ.. అక్కడి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని ప్రశ్నించారు. రక్షణ రంగంలో ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాల కోసం రక్షణ బలగాలను వాడుకున్న ద్రోహి మోదీ అని విమర్శించారు. వ్యవసాయ, ఆర్థిక, వస్త్ర రంగాల్లో కాంగ్రెస్ న్యాయం చేయలేకపోయిందని మోదీ చేసిన వ్యాఖ్యలు శుద్ధ అబద్ధమన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు బడ్జెట్ 190 కోట్లు మాత్రమేనని, 2014 నాటికి దాన్ని 30 లక్షల కోట్లకు పెంచడం కాంగ్రెస్ ఘనత కాదా? అని నిలదీశారు.

రూ. 2.66 కోట్ల విలువైన నగలు, రూ. 64.72 లక్షల నగదు సీజ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.2.66 కోట్ల విలువైన నగలు, రూ.64.72 లక్షల నగదు సీజ్ చేశారు. హైదరాబాద్, కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి వద్ద ఓ లాజిస్టిక్స్ వాహనాన్ని తనిఖీ చేసిన బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2,66,63,845 విలువైన బంగారు, వెండి నగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ.2.64 కోట్ల విలువైన నాలుగు కిలోల బంగారం, రూ.2.80 లక్షల విలువైన 4 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి. అలాగే, కూకట్‌పల్లిలో మరో వాహనంలో రూ.2,63,845 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇక, సరైన పత్రాలు లేకుండా సిస్కో వాహనంలో తరలిస్తున్న రూ.24,91,700 నగదును మెదక్ పోలీసులు సీజ్ చేశారు. ఇక, బాచుపల్లి వద్ద ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.22 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో చేపట్టిన వాహన తనిఖీల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి మొత్తం రూ.15.17 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు.


సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సాంబశివరాజు

కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు

సీఎం సమక్షంలో చేరిన బీఆర్ఎస్ నేత ముక్కా సాంబశివరాజు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ముక్కా సాంబశివరాజు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో టీడీపీలోనూ పని చేసిన ఆయన.. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. కేసీఆర్ తీరు నచ్చక, సీఎం రేవంత్‌రెడ్డి పథకాలకు ఆకర్షితుడినయ్యి తాను హస్తం పార్టీలో చేరుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అలాగే తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోశిక యాదగిరి, కార్యదర్శి నారా నరసింహ, పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్, ఆప్కో మాజీ ఛైర్మన్ గోశిక పాండు తదితరులూ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కేసీఆర్.. రైతు ఖాతాలు చూడు

(మొదటి పేజీ తరువాయి)

చేశారని మండిపడ్డారు. దీంతో 2019 ఎన్నికల్లో వంద మంది రైతులు నామినేషన్లు వేసి.. మోసం చేసిన కవితను ఓడించారని, ఆ ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అర్వింద్‌ను గెలిపించారని గుర్తుచేశారు. ఎంపీగా గెలిచిన ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తీసుకువస్తానన్న అర్వింద్ కూడా ఐదేళ్లు గడిచినా.. ఆ హామీ నెరవేర్చలేదన్నారు. ఆర్మూర్ రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని రేవంత్ ఆవేదన వెలిబుచ్చారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు రావాలన్నా.. చక్కెర కర్మాగారాలు తెరుచుకోవాలన్నా.. వ్యవసాయం తెలిసిన ఆదర్శ రైతు జీవన్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే తాము చక్కెర కర్మాగారాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని.. ఫ్యాక్టరీలను తెరిపించడానికి ప్రయత్నాలను చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 43 కోట్ల రూపాయలను బకాయిల చెల్లింపుల కోసం విడుదల చేశామన్నారు.

మోదీపై మండిపాటు..

కేంద్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న ప్రధాని మోదీ నిజామాబాద్ రైతులను మోసం చేశారని.. నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ తేలేదని, చెరకు ఫ్యాక్టరీలను తెరిపించలేదని.. చెరకు రైతులకు మద్దతు ధర


నిజామాబాద్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

ఇవ్వలేదని రేవంత్ మండిపడ్డారు. "మళ్లీ గెలిపిస్తే ఇక్కడి ఎంపీ రాజ్యాంగాన్ని మారుస్తానంటున్నారు. బాబా సాహెబ్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామన్న వారిని గద్దె దించాలి" అని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తీసేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. పదేళ్లకొకసారి చేపట్టే జనాభా లెక్కలను 2021లో ఎందుకు చేపట్టలేదని.. దేశవ్యాప్తంగా బీసీ కులగణనకు ఎందుకు అడ్డుపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో తెలంగాణకు గాడిద గుడ్డు తప్ప ఇచ్చింది ఏమీ లేదన్నారు. విభజన చట్టంలో పొందుపర్చిన ఏ హామీలనూ నెరవేర్చనందుకు బీజేపీని గెలిపించాలా అని సీఎం ప్రశ్నించారు. గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి కర్రు కాల్చి వాత పెట్టాలని.. రాష్ట్రంలో ఆ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీసీ గణన చేపట్టి రిజర్వేషన్ పెంచే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని ప్రకటించారు.

పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం

రాష్ట్రంలో తమ ప్రభుత్వం పదేళ్ల పాటు ఉంటుందని రేవంత్ పేర్కొన్నారు. "కానీ.. తెలంగాణ కేడీ కేసీఆర్ మాత్రం మేం దిగిపోవాలంటున్నారు" అని దుయ్యబట్టారు. 'బిడ్డ బెయిల్ కోసం నిజామాబాద్ కార్యకర్తల గౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెడతావా!?' అని కేసీఆర్‌ను నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీ గెలిచినా.. బీఆర్ఎస్ గెలిచినా.. ఒక్కటేనని, కేడీ, మోదీ ఒక్కటేనని ఆరోపించారు. ప్రజల రక్షణకు అండగా ఉండే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాద్ అభివృద్ధికి తాను అండగా ఉంటానని.. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే నిజామాబాద్‌కు రింగ్‌రోడ్ వేయించే బాధ్యత తనదేనని.. నగరాన్ని స్మార్ట్ సిటీగా చేయడంతో పాటు ఇతర అభివృద్ధి పనులను కూడా చేపడుతామని రేవంత్ హామీ ఇచ్చారు.


నిర్మల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన దీపాదాస్ మున్షీ

బీజేపీకి ఓటేస్తే హక్కులు కోల్పోయినట్టే

- ప్రధాని మోదీకి ఓటమి భయం పట్టుకుంది
- అందుకే మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయి: భట్టి

నిర్మల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి ఓటమి భయం పట్టుకుందని, దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీకి ఓటు వేస్తే మన హక్కులు పోతాయని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశ సంపదను బహుళ జాతి సంస్థలకు దారాదత్తం చేయాలన్న దురాలోచనతో మోదీ ఉన్నారని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ బలమున్నచోట బీజేపీ బలహీనమైన అభ్యర్థిని పోటీలో పెట్టగా.. బీజేపీ బలమున్న చోట బీఆర్ఎస్ బలహీనమైన అభ్యర్థిని పోటీలో నిలిపిందని వివరించారు. ఈ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు భరోసా పంపిణీని అడ్డుకొన్న బీఆర్ఎస్, బీజేపీ.. రైతుల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా కుల గణన చేపడతామని వెల్లడించారు. అకాల వర్షం, గాలి దుమారం వల్ల నష్టపోయిన రైతులను కచ్చితంగా ఆదుకుంటామని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ వ్యాప్తంగా పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఆత్రం సుగుణ నిరుపేద మహిళ అని, ఆదిలాబాద్ ఎంపీగా ఆమెను గెలిపిస్తే పేదల పక్షాన పోరాడుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు.

మోదీ మళ్లీ గెలిస్తే ఎన్నికలుండవు

- జూన్4 తర్వాత తెలంగాణ భవన్‌కు తాళమే: మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్ సిటీ, నల్లగొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): "పొరపాటునో, గ్రహపాటునో మోదీ మూడోసారి గెలిస్తే దేశంలో 2029లో ఎన్నికలుండవు. రష్యా, చైనా, మాదిరిగా 30 ఏళ్ల పాటు ప్రధానిగా ప్రకటించుకుంటారు. పదేళ్ల ప్రధానిగా ఉన్న మోదీ రాముడి పేరు చెప్పి ఓట్లు అడిగే పరిస్థితి దాపురించింది. కులాలు, మతాల మధ్య ఘర్షణ తీసుకురావడమే ఎన్డీయే లక్ష్యం" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని, కేంద్రంలో ఇండియా కూటమి ఖచ్చితంగా అధికారంలోకి వచ్చి రాహుల్ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన వేర్వేరు విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. "ఆర్ఆర్ కలెక్షన్" అంటూ మోదీ చౌకబారు విమర్శలు చేస్తున్నారని.. కానీ మోదీ ఈ పదేళ్లలో ఏఏ (ఆదానీ, అంబానీ)లకు దేశ సంపదను దోచిపెట్టారని విమర్శించారు. మోదీని 'ఏఏ' అనాలని సూచించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా ఆయన నెరవేర్చలేదని.. గబ్బర్‌సింగ్ ట్యాక్స్ మాదిరిగా కూరగాయలు మొదలుకుని అన్నింటి పైనా జీఎస్టీ వేస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే.. రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని.. రెండు, మూడు స్థానాల్లో డిపాజిట్లు వస్తే గొప్ప అని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ గురించి మాట్లాడి సమయం వృథా తప్ప ఏమీ లేదన్నారు. జూన్ 4 తర్వాత ఆ పార్టీ ఉండదని, తెలంగాణభవన్‌కు శాశ్వతంగా తాళం వేస్తారని, ఆ పార్టీని కేసీఆర్ రద్దు చేస్తారని కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్.. రెండు పార్టీల పైనా ప్రజలకు నమ్మకం పోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని.. పదేళ్లు సీఎంగా రేవంత్‌రెడ్డే ఉంటారని స్పష్టం చేశారు. తమ వద్ద ఏక్‌నాథ్ షిండేలు లేరని.. రేవంత్ అందర్నీ కలుపుకొని పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూన్5 తర్వాత కాంగ్రెస్‌లో చేరేందుకు 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారన్న కోమటిరెడ్డి.. 'వాళ్ల పేర్లు కూడా చెప్పాలా?'అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై కసితో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని.. లక్ష కోట్లు ఇచ్చినా కూడా కేసీఆర్ దగ్గరకు వెళ్లరని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో సీట్ల సంఖ్య 154కు పెరుగుతుందని.. హైదరాబాద్‌లో 12సీట్లు పెరుగుతాయని తెలిపారు. కాగా.. సచివాలయం నిర్మాణంలో భాగంగా రూ.50 కోట్లతో అయ్యే ఇంటర్నెట్, ఎలక్ట్రిక్ పనులను కేసీఆర్ బంధువుకు అప్పగించి రూ.270కోట్లతో చేశారని, ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' కూడా ప్రచురించిందన్నారు.

మోదీ గ్లామర్ లీడర్... రాహుల్ పీపుల్ లీడర్

- బంగారం ధర తగ్గాలంటే రాహుల్ ప్రధాని కావాలి
- రాముడి పాలన పేదల కోసం.. మోదీ పాలన పెద్దల కోసం
- రాహుల్ కుటుంబ త్యాగం ముందు మోదీ, షాల రాజకీయం ఎంత
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గ్లామర్ లీడర్ మాత్రమేనని... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజల మనిషని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. బంగారం ధర తగ్గాలంటే.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలంటూ పిలుపునిచ్చారు. సోనియా గాంధీ, మన్మోహన్ హయాంలో తులం బంగారం ధర రూ. 28 వేలు ఉంటే.. మోదీ ప్రధాని అయ్యాక అది రూ. 76 వేలకు చేరుకుందన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రూ. 28 వేలకే తులం బంగారం కొన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల కుటుంబాలు.. మోదీ అధికారంలోకి వచ్చాక రూ. 76 వేలకు కొంటున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రసంగాలు చేయడం తప్ప.. ధరలు తగ్గించాం.. అది చూసి ఓటేయాలంటూ ఒక్క సభలోనైనా మోదీ చెప్పారా.. అని నిలదీశారు. తెలంగాణ ప్రజలు దీని గురించి ఆలోచించాలని కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్, మోదీల మధ్య జాతీయ స్థాయిలో రాజకీయ పోరాటం సాగుతోందన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడంపైనే ఇండియా కూటమి దృష్టి పెట్టిందన్నారు. మోదీ నియంత, నిరంకుశ పాలన దేశానికి ప్రమాదకరమని ప్రజలు గుర్తించారని, దేశంలో ఆయనకు మద్దతు తగ్గిపోయిందన్నారు. పదేళ్ల మోదీ పాలన తర్వాత ఇందిరమ్మ చెప్పిన రోటీ, కపడా ఔర్ మకాన్ నినాదం మళ్లీ తెరపైకి వచ్చిందన్నారు. దీంతో ఆయనకు భయం పట్టుకుందన్నారు. మోదీ గ్లామర్ లీడర్ అయితే.. రాహుల్ గాంధీ ప్రజల మనిషన్నారు. పేదలు గ్లామర్ లీడర్‌ను నమ్మబోరని, వారు సోనియా, రాహుల్ గాంధీల నాయకత్వాన్నే నమ్ముతారన్నారు. శ్రీరాముడు కూడా పేదల మనిషని, తన రాజ్యంలోని పేద ప్రజల బాగు కోసమే ఆయన పాలన సాగించారన్నారు. మోదీ.. పెద్దల కోసమే పాలన చేస్తున్నారన్నారు. పేదలను ఆదుకునే పాలన ఈ పదేళ్లలో కనిపించిందా అని ప్రశ్నించారు. శ్రీరాముడికి వాడే పూజా సామగ్రిపైనా మోదీ ప్రభుత్వం జీఎస్టీ వేసిందని గుర్తు చేశారు. మోదీ తన ప్రసంగాల్లో హిందూ, ముస్లింల మధ్య ఘర్షణ పెడుతున్నాడంటేనే ఆయన రాజకీయంగా బలహీనపడినట్లు లెక్కన్నారు. రాహుల్ గాంధీ చరిత్ర ముందు, ఆయన కుటుంబం త్యాగం ముందు మోదీ, అమిత్‌షా రాజకీయం జీరో అన్నారు. ఇవాళ దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఇంటికి మోదీ వెళ్లాడంటే.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గుర్తింపు వల్లనే అన్నారు.

సూర్యాపేట కాంగ్రెస్ నేత.. వడ్డె ఎల్లయ్య మృతదేహం లభ్యం

- జగ్గయ్యపేటలోనే.. సగం కాల్చి, ఖననం చేసిన నిందితులు
- కేసు నుంచి బయటపడేందుకే తప్పుడు సమాచారం


వడ్డె ఎల్లయ్య(ఫైల్)


సూర్యాపేట రూరల్, మే 8: రియల్‌ఎస్టేట్ వివాదాలతో కిడ్నాపై.. ఆపై దారుణ హత్యకు గురైన సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె ఎల్లయ్య మృతదేహం లభ్యమైంది. ఇరవై రోజుల క్రితం ఎల్లయ్య ప్రత్యర్థి, నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన శ్రీకాంతాచారి పథకం ప్రకారం అతణ్ని ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేటకు రప్పించి, అపహరించి, హతమార్చిన విషయం తెలిసిందే. భార్యాభర్తల పంచాయితీ తీర్చాలంటూ అపర్ణ అనే మహిళతో ఎల్లయ్యను జగ్గయ్యపేటకు రప్పించిన శ్రీకాంతాచారి.. అక్కడి రైల్వేస్టేషన్ రోడ్ సమీపంలో హతమార్చాడు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. శ్రీకాంతాచారిని అదుపులోకి తీసుకుని, ప్రశ్నిస్తే.. హత్యకేసు వెలుగులోకి వచ్చింది. అయితే.. మృతదేహం లభించకపోతే.. తాము కేసు నుంచి బయట పడవచ్చనే ఉద్దేశంతో శ్రీకాంతాచారి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. చేపల లారీలో మృతదేహాన్ని విశాఖకు తీసుకెళ్లి.. అక్కడ సముద్రంలో పారేసినట్లు వాంగ్మూలమిచ్చాడు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అక్కడ గాలింపు చేపట్టారు.

పశువుల కాపరుల సమాచారంతో..

బుధవారం ఉదయం జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామ శివారులో ఏదో మృతదేహం దుర్వాసన వస్తోందంటూ పశువుల కాపరులు గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న వీఆర్వో బాబూరావు.. పోలీసులకు తెలిపారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాం తన సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. దుర్వాసన వస్తున్న ప్రాంతంలో తాజాగా పూడ్చిన ఓ గోతి కనిపించడంతో.. అక్కడ తవ్వించారు. సగం కాలిన శవాన్ని వెలికి తీశారు. జగ్గయ్యపేట తహసీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ మృతదేహం ఎల్లయ్యదేనని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో.. వారు మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడు శ్రీకాంతాచారి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకే విశాఖ సముద్రంలో పారేశామని చెప్పారని సీఐ వివరించారు. శ్రీకాంతాచారి తొలుత ఎల్లయ్య మృతదేహాన్ని కాల్చేందుకు ప్రయత్నించారని చెప్పారు. మృతదేహం సగం కాలడంతో.. పాతిపెట్టినట్లు పేర్కొన్నారు. కాగా.. బుధవారం సాయంత్రం సూర్యాపేట జిల్లాలోని ఎల్లయ్య స్వగ్రామం యార్కారంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎల్లయ్య మాజీ నక్సలైట్ కావడంతో.. అంత్యక్రియలకు పలువురు మాజీ మావోయిస్టులు హాజరయ్యారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తెలంగాణ పర్యాటక శాఖ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై.. ఎల్లయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు. కాగా.. ఎల్లయ్య అంత్యక్రియలను ఆయన పెద్దకుమార్తె జరిపించారు.

రేవంత్ సిసలైన లీడర్

- అంచనాలను మించి అనూహ్యంగా ఎదిగారు
- 2022 ఏప్రిల్‌కు రాష్ట్రంలో కాంగ్రెస్‌ది 3వ స్థానం
- బీఆర్ఎస్‌తో పొత్తు అంశం.. పీకే చెప్తే వద్దన్నాం
- బీజేపీకి ఈ సారి 100 సీట్లు తగ్గుతాయ్
- మోదీ పతనం ఖాయం... 2004 పునరావృతం
- 'ఆంధ్రజ్యోతి'తో కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్




న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి అంచనాలనూ అధిగమించి అసలు సిసలైన నాయకుడుగా నిరూపించుకున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ కొనియాడారు. ఈ ఎన్నికల్లో ఆయన సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధితో బుధవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. 2022 ఏప్రిల్ 8న.. రాజకీయ విశ్లేషకుడు ప్రశాంత్ కిషోర్ తమకు ఇచ్చిన ప్రజంటేషన్ ప్రకారం అప్పటికి తెలంగాణలో కాంగ్రెస్ మూడో స్థానంలో ఉన్నదని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్ ఉనికి నిలబడుతుందని ఆయన సిఫారసు చేసినా తాము తిరస్కరించామని తెలిపారు. తమ అంచనాలకు అనుగుణంగానే రేవంత్ రెడ్డి సత్తా చాటారని, కాంగ్రెస్‌లో నూతనోత్తేజం కలిగించి.. అందర్నీ ఒక కుదుపు కుదిపారని జైరాం చెప్పారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత.. ఉత్తమ్, భట్టి, శ్రీధర్ బాబు వంటి అనుభవజ్ఞులైన నేతలతో టీమ్ ఏర్పరచుకున్నారని, సమర్థులైన అధికారులను ఎంపిక చేసుకున్నారని ప్రశంసించారు. ఎవరికి వారి భాషలోనే జవాబు చెప్పగల సామర్థ్యం రేవంత్‌కు ఉన్నదన్నారు. రేవంత్ బంధువైన జైపాల్ రెడ్డి ఇప్పుడు జీవించి ఉంటే ఎంతో సంతోషించి ఉండేవారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తెలంగాణలో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతుందని, కర్ణాటకలో ఇప్పటికే అత్యధిక హామీలను నెరవేర్చారమని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ అంతరించిపోవడం ఖాయమని చెప్పారు. ఏపీలో వైఎస్ షర్మిల ముందే కాంగ్రెస్‌లో చేరి ఉంటే ఇంకా ప్రభావం చూపేవారని జైరామ్ అభిప్రాయపడ్డారు. ఇక.. ప్రధాని మోదీ గత పదేళ్లుగా అబద్ధాలపైనే కాలక్షేపం చేస్తున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మోదీకి గుజరాత్ తప్ప మరేదీ పట్టదని, ప్రతిదీ గుజరాత్‌కు మళ్లిస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి దక్షిణాదిన సీట్లు గతంలో వచ్చినదానికంటే సగానికిపైగా తగ్గిపోతాయని.. ఉత్తరాదిన కూడా ఆ పార్టీకి ఎదురుగాలి వీస్తోందని అంచనా వేశారు. తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్, తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలం పెరుగుతోందని.. 20 ఏళ్ల తర్వాత చరిత్ర పునరావృతం కాబోతోందని.. 2004 తరహాలోనే కాంగ్రెస్ 2024లో గెలవబోతోందని పేర్కొన్నారు. బీజేపీ సంఖ్యాబలం ఎవరూ ఊహించనంతగా పడిపోతోందని.. ఆ పార్టీకి కనీసం వంద సీట్లు తగ్గిపోతాయని.. ఇండియా కూటమికి స్పష్టమైన మెజారిటీ లభిస్తుందని జోస్యం చెప్పారు. ఎన్డీయేలో ఉన్న పార్టీలు కూడా ఇండియా కూటమికి మద్దతు ఇస్తాయని, దేశంలో ఏ పార్టీ మోదీ నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా ఇష్టపడదని జైరామ్ పేర్కొన్నారు. మతపరంగా దేశాన్ని విభజించడమే మోదీ ఎజెండా అని దుయ్యబట్టారు. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ తర్వాత.. దేశంలో మోదీ ప్రభంజనం ఎక్కడా వీయడం లేదని ఆయనకు అర్థమైందని, భయం ఆయన వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోందని, అందుకే మాటిమాటికీ అనేక అంశాల్ని మారుస్తున్నారని.. హిందూ-ముస్లిం అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ అహంకారమే ఆయన పతనానికి కారణమవుతుందన్నారు. అహంకారంలో ఆయనను జగద్గురువుగా.. మార్కెటింగ్ చాంపియన్‌గా అభివర్ణించారు. హిట్లర్ కాలంలో గోబెల్స్ మాదిరిగా.. అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారని ఆయన భావిస్తారని తెలిపారు. మోదీ నియంత అని.. నిజమైన తానాషాహీ అని దుయ్యబట్టారు.



అబ్ కీ బార్?

నేడు భువనగిరిలో అమిత్ షా ప్రచారం



హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం భువనగిరి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు భువనగిరిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొంటారు. 11న వికారాబాద్, వనపర్తిల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో షా పాల్గొంటారు. మధ్య ప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, గురువారం ఉదయం 10 గంటలకు మెదక్ పార్లమెంటు పరిధిలోని నర్సాపూర్‌లో పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు తరఫున ప్రచారం నిర్వహించనున్నారు.

మన గెలుపును ఎవరూ ఆపలేరు!

- ఏపీలో ప్రభుత్వాన్ని మార్చాలని జనంలో కోరిక: ప్రధాని
- అత్యద్భుత విజయం సాధిస్తున్నాం
- ఇక పోలింగ్‌పై దృష్టి సారించండి
- 2 పార్టీల అధినేతలకు ప్రధాని సూచనలు



అమరావతి,రాయచోటి, మే 8 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో మన కూటమి అత్యద్భుత విజయాన్ని నమోదు చేయబోతోంది. కూటమి గెలుపును ఎవరూ ఆపలేరు' అని ప్రధాని మోదీ ప్రకటించారు. బుధవారం విజయవాడ నగరంలో రోడ్ షో ముగిసిన తర్వాత ఆయన పది నిమిషాల పాటు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌లతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఘన విజయాన్ని సాధించబోతున్నారంటూ వారిద్దరినీ అభినందించారు. 'రాష్ట్రంలోని ప్రజల్లో అవధుల్లేని ఉత్సాహాన్ని చూస్తున్నాను. ప్రభుత్వాన్ని మార్చాలన్న బలమైన కోరిక ఉన్నప్పుడే ప్రజల్లో ఇంత దూకుడు కనిపిస్తుంది. కూటమి పట్ల వారి మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. మామూలు విజయం కాదు... చాలా పెద్ద విజయాన్ని మీరు సాధించబోతున్నారు. ఈ రోజు రోడ్‌షో బ్రహ్మాండంగా జరిగింది' అని ఆయన వారితో అన్నారు. ప్రజల్లో ఉన్న ఈ సానుకూలతను సంపూర్ణంగా అందుకోవడానికి పోలింగ్ రోజు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ శాతం బాగా పెరగాలన్నారు. 'ఉదయం ఏడు నుంచి పది గంటల్లోపు వీలైనంత ఎక్కువ ఓటింగ్ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కార్యకర్తలు, అభ్యర్థులను ఈ విషయంలో అప్రమత్తం చేయండి' అని వారికి సూచించారు.

వైసీపీకి కౌంట్ డౌన్ మొదలు!

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజారాజ్యం నడవడం లేదు.. మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని ప్రకటించారు. ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని.. 39 మంది చనిపోయారని.. 26 గ్రామాలు దెబ్బతిన్నాయని.. ఇది విని ఆందోళన చెందానని తెలిపారు. రాష్ట్రంలో మంత్రులు రౌడీ, గూండాయిజం చేస్తున్నారని.. మాఫియాకు ప్రభుత్వ మద్దతు ఉందని.. మాఫియాకు ఎన్డీయే సర్కార్ గట్టిగా బుద్ధి చెబుతుందని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా అన్నమయ్య జిల్లా కలికిరిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు.

ఆస్తుల్లేని మోదీ మహనీయుడు

- దొంగల ముఠా నేత రాహుల్: బండి సంజయ్



సిరిసిల్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): 'మోదీని కించపరుస్తున్న కాంగ్రెస్ నేతల్లారా ఖబడ్దార్.. మోదీ మొండి మొలోడు కాదు. ఈ దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌ను మెడలు పట్టి బయటకు గెంటేసిన జగమొండి. మోదీకి ఆస్తిపాస్తులు, బ్యాంకు బ్యాలెన్స్‌లు లేవు. ప్రధాని పదవి వద్దనుకుంటే జబ్బకు సంచి వేసుకొని పోయే మహనీయుడు మోదీ' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో బీజేపీ జనసభలో ఆయన మాట్లాడారు. "370 ఆర్టికల్ రద్దు. ట్రిపుల్ తలాక్ రద్దు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ. దేశవ్యాప్తంగా ప్రజలందరికీ కరోనా వ్యాక్సిన్ పంపిణీ. మూతపడిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.12 వేల కోట్లు విడుదల" ఇవన్నీ మోదీ హయాంలోనే జరిగాయని, ఆయనెప్పుడూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కాశీ విశ్వేశ్వరుడి ప్రతిరూపమే మోదీ అని, దేశచరిత్రలో తొలిసారి దక్షిణ కాశీకి విచ్చేసిన నాయకుడు మోదీ మాత్రమేనని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల గురించి అడిగితే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డు చూపిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పెద్ద గాడిద గుడ్డు అని విమర్శించారు. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న ఆరడుగుల బుల్లెట్ నరేంద్ర మోదీ కావాలో?, దొంగల ముఠా నేత రాహుల్ గాంధీ కావాలా? ప్రజలే తేల్చుకోవాలన్నారు.

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి



హైదరాబాద్, హనుమకొండ టౌన్, మే 8 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నిక ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా హనుమకొండ జిల్లా దామెరకు చెందిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేరు ఖరారైంది. ఈమేరకు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి ప్రయత్నం చేయగా, వారిని కాదని గుజ్జుల పేరును ప్రకటించింది. 2021లో జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ ప్రేమేందర్‌రెడ్డిని పోటీకి దింపగా ఓటమి పాలయ్యారు. మళ్లీ ఆయన్నే అభ్యర్థిగా బరిలోకి దింపారు. కాగా, గుజ్జుల గురువారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మోదీ అనుచిత వ్యాఖ్యలపై చర్యలు చేపట్టండి

- సీఈసీకి కాంగ్రెస్ నేత ఫిర్యాదు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కరీంగనగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోదీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఏఐసీసీ సభ్యుడు జి.నిరంజన్ ఆరోపించారు. మోదీ చేసిన ప్రసంగాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిరంజన్ ఫిర్యాదుచేశారు. ప్రధాని తన ప్రసంగంలో కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేయడంతోపాటు కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారని అందులో పేర్కొన్నారు. అంతేగాక దివంగత ప్రధాని పీవీ.నరసింహారావుపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారన్నారు. వీటిపై ఎన్నికల సంఘం స్పందించాలని, మోదీపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తమిళిసైపై ఈసీకి ఫిర్యాదు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మాజీ గవర్నర్, బీజేపీ నేత తమిళిసై ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నంచేశారని, ఆమెకు వ్యతిరేకంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు, సీఈవో వికాస్‌రాజ్‌కు బీఆర్‌ఎస్‌పార్టీ నేతలు ఫిర్యాదుచేశారు. బుధవారం ఈ మేరకు సీఈఓ కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆన్‌లైన్ ద్వారా సీఈసీకి, సీఈవోకు ఫిర్యాదు పంపారు. ఇటీవల సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రచారం చేసిన ఆమె.. అయోధ్య రామమందిరాన్ని పోలిన ప్రతిమలను ఓటర్లకు బహూకరించారని అందులో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, ఈసీ తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

అదానీ, అంబానీ నుంచి ఎంత ముట్టింది?

(మొదటిపేజీ తరువాయి)

వస్తోందన్నారు. 'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సాగురంగాన్ని ఆధునీకరిస్తున్నాం. నానో యూరియా, డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం. కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా అమలు చేస్తున్నాం. ప్రతీ ఇంటికీ అభివృద్ధి ఫలాలు అందేలా కృషిచేస్తున్నాం. టెక్స్‌టైల్ పార్కులు అభివృద్ధి చేస్తున్నాం. మీ ఒక్క ఓటుతో.. ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగింది. 370 ఆర్టికల్ రద్దు చేశాం. రక్షణ రంగంలో ఉత్పత్తులను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం. ఇవన్నీ చేసింది నేను కాదు.. మీరిచ్చిన ఓటు బలం' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

విజయపథంలో బీజేపీ

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయపథంలో దూసుకుపోతోందని, మూడో దశలో ఇది స్పష్టమైందని మోదీ తెలిపారు. కాంగ్రెస్, ఇండీ (ఇండియా) కూటమి వ్యూహం ఊడిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ మూడు దఫాల్లో ఎక్కడ గెలిచే అవకాశం ఉందో తెలుసుకోవడానికి కాంగ్రెస్ నాయకులు భూతద్దం పెట్టి వెతుకుతున్నారని, ఇక నాలుగో దశలో ఆ పార్టీకి భూతద్దం కూడా సరిపోదు.. మైక్రోస్కోప్ అవసరం అని పేర్కొన్నారు. ఇండీ కూటమి ఐదేళ్లు, ఐదుగురు పీఎంలు ఫార్ములాతో వస్తోందని.. కూటమిలోని ప్రతీ పార్టీ నుంచి ఏటా ఒకరు ప్రధానిగా ఉండాలని వారు నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఏడాదికో ప్రధాని ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని హెచ్చరించారు. మీ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్నా, వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ లక్ష్యం నెరవేరాలన్నా ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ కావాలని మోదీ పిలుపునిచ్చారు.

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం వ్యతిరేకం

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం వ్యతిరేకమని మోదీ పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌లు లాక్కుని ముస్లింలకు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణలో మాదిగలకు రిజర్వేషన్‌లు ఇవ్వడానికి కూడా కాంగ్రెస్ వ్యతిరేకంగా ఉందని, రిజర్వేషన్‌లను రద్దుచేస్తే చూస్తూ ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని, ఈ మేరకు మంద కృష్ణ మాదిగకు, మాదిగ సమాజానికి ఇచ్చిన మాట మర్చిపోనని మోదీ తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుటుంబ పార్టీలని, ఆ రెండు పార్టీలను కలిపేది అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, జీరో గవర్నెన్స్ (పాలనా శూన్యత) అని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలు.. నాణేనికి బొమ్మా బొరుసు.. వీరి నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. బీజేపీకి మాత్రం దేశం తర్వాతే కుటుంబమని తెలిపారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధమని.. బహిరంగంగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటారు కానీ తెరవెనుక మాత్రం వారిది అవినీతి సిండికేట్ అని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఓటుకు నోటు కేసుపై ఎందుకు దర్యాప్తు కొనసాగించలేదు? కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపణలు చేసిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత హడావుడి తప్ప ఏం చేసింది? అని మోదీ నిలదీశారు. కాళేశ్వరం వ్యవహారంలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ రక్షిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా సూపర్‌హిట్ అయిన ట్రిపుల్ ఆర్ సినిమాకు రూ.వెయ్యి కోట్ల కలెక్షన్ వచ్చిందని, కానీ, తెలంగాణలో జరుగుతున్న డబుల్ ఆర్ ట్యాక్స్ వసూళ్లు నాలుగైదు నెలల్లోనే దీనిని మించిపోయాయని మోదీ ఎద్దేవా చేశారు. డబుల్ ఆర్‌లో ఒక ఆర్ తెలంగాణను దోచుకుంటూ ఢిల్లీలోని మరో ఆర్‌కు కప్పం కడుతోందన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న టెక్స్‌టైల్ పార్కు నుంచి కూడా డబుల్ ఆర్ ట్యాక్స్ కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మోదీ ఆరోపించారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ మాస్టర్ అని మోదీ విమర్శించారు. ఆ పార్టీ అగ్రనేత జన్మదినం సందర్భంగా రైతుల రుణమాఫీ చేస్తామని మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రచారం చేసి, ఇప్పుడు పంద్రాగస్టు అని చెబుతున్నారని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని విమర్శించే వాళ్లు, రుణమాఫీని పంద్రాగస్టు నాటికి అమలు చేస్తామని వేములవాడ రాజన్నపై ఒట్టుపెట్టుకుంటున్నారని మోదీ విమర్శించారు. హైదరాబాద్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎంకు లీజుకిచ్చాయని విమర్శించారు.





వేములవాడ దేవస్థానంలో నందిని దర్శించుకుంటున్న ప్రధాని మోదీ; వేములవాడ బీజేపీ జనసభకు హాజరైన జనం

వేములవాడలో మోదీ ప్రత్యేక పూజలు

బుధవారం ఉదయం 9.20 గంటలకు వేములవాడకు చేరుకున్న ప్రధాని మోదీ తొలుత రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. కోడె మొక్కును చెల్లించుకున్నారు. అరగంటపాటు ఆలయంలో గడిపారు. ప్రధానికి అర్చకులు రాజన్న ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు. ప్రధాని హోదాలో వేములవాడ ఆలయాన్ని దర్శించుకున్న తొలి నేతగా మోదీ నిలిచారు. మాజీ ప్రధాని పీవీ వేములవాడ దేవస్థానం ధర్మకర్తల మండలి ధర్మకర్తగా ఉన్నప్పటికీ ప్రధాని హోదాలో స్వామివారిని దర్శించుకోలేదు.

తెలంగాణ తలుపులతో రామమందిరానికి శోభ

సంస్కృతీ సంప్రదాయాలకు, భక్తిశ్రద్ధలకు తెలంగాణ నిలయమని ప్రధాని మోదీ కొనియాడారు. అయోధ్య రామమందిరానికి తెలంగాణ నుంచి వచ్చిన తలుపులు ప్రత్యేక శోభనిస్తున్నాయన్నారు. రామమందిరం పూర్తికావడం మనందరికీ సంతోషం కలిగిస్తుంటే, కాంగ్రెస్‌కు మాత్రం ఈర్ష్య కలిగిస్తోందని విమర్శించారు. 'సుప్రీం కోర్టు తీర్పు ద్వారా రామమందిరం నిర్మించాం. అధికారంలోకి వస్తే అదే కోర్టు తీర్పును పునస్సమీక్షించాలని కాంగ్రెస్ భావిస్తోంది. రామమందిరానికి తాళం వేయాలని యోచిస్తోంది' అని ఆరోపించారు. రామమందిరాన్ని కాపాడుకుందాం.. కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం అని పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు చెందిన మూడు తరాల కుటుంబసభ్యులను కలుసుకోవడం తనకు సంతోషం కలిగించిందని మోదీ చెప్పారు. పీవీని కాంగ్రెస్ అవమానించిందని, కానీ, తమ ప్రభుత్వం పీవీని భారతరత్నతో గౌరవించిందన్నారు. చివరగా.. మీరు నా వ్యక్తిగత పని ఒకటి చేసి పెడతారా? అంటూ బీజేపీ కార్యకర్తలను ప్రశ్నించిన మోదీ, తాను నమస్కారం చేసినట్లు ఇంటింటికీ వెళ్లి చెప్పాలని కోరారు.

మందకృష్ణకు ఆలింగనం

వరంగల్ సభలో మోదీ వేదికపైకి వెళ్లిన తర్వాత అక్కడ నిల్చొని ఉన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ వద్దకు వెళ్లి ఆయనను ఆలింగనం చేసుకున్నారు. దీంతో సభ ఒక్కసారిగా మోదీ నినాదాలతో మార్మోగింది. మోదీ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. తన కర్మభూమి అహ్మదాబాద్‌తోపాటు ఇక్కడ వరంగల్‌లో కూడా భద్రకాళి ఉన్నారని పేర్కొంటూ.. భద్రకాళికి ప్రణామాలని చెప్పారు.

జనసందోహాన్ని చూసి మోదీ ఫిదా

వేములవాడలో ఉదయం పదిన్నరకు మోదీ వేదిక వద్దకు చేరుకోగా అప్పటికే ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అయినా కూడా బయటి నుంచి జనం తరలి వస్తూనే ఉన్నారు. ఈ జనసందోహాన్ని చూసి మోదీ ఫిదా అయ్యారు. 'గుజరాత్‌లో ఏళ్లపాటు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా. మూడుసార్లు సీఎంగా చేశా. కానీ, ఎప్పుడు కూడా ఉదయం పది గంటలకే జనం ఇంతగా తరలిరావటం చూడలేదు. ఈ విధంగా సభ నిర్వహణ నాకు గుజరాత్‌లో కూడా సాధ్యం కాలేదు. మీరు నా పట్ల చూపిన అభిమానానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా' అని పేర్కొన్నారు. సభను విజయవంతంగా నిర్వహించినందుకు కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

'రిజర్వేషన్'పై కాంగ్రెస్ ప్రచారం ఫెయిల్

- అబద్ధాల ప్రచారంలో ఆ రెండు పార్టీలు దిట్ట : కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్‌ల వ్యవహారంపై కాంగ్రెస్ చేసిన తప్పుడు ప్రచారం ఫెయిల్ అయ్యిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ.. రిజర్వేషన్‌లు తొలగించరనే విశ్వాసం ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను బీజేపీ గెలువబోతోందని, దీనిపై ఎటువంటి అనుమానాలూ లేవని చెప్పారు. "గతంలో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. అంతకుముందు పదేళ్లు కాంగ్రెస్‌కు పీఠాన్నిచ్చారు. ఈసారి మెజారిటీ ఓట్లు, సీట్లు బీజేపీకే వేయాలని నిశ్చయించుకున్నారు. ఇది చూసి కాంగ్రెస్‌లో కలవరం పెరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో అభద్రతాభావం, అసహనం కనబడుతోంది" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇద్దరు, ముగ్గురు జర్నలిస్టులను జైల్లో వేస్తే బుద్ధి వస్తుందన్న రేవంత్ రెడ్డి ప్రకటనలు.. ఆయన అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. ప్రధానమంత్రి స్వయంగా.. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు రిజర్వేషన్లపై ఎలాంటి ఆందోళన అక్కర్లేదని చెప్పినా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాల ప్రచారంలో కల్వకుంట్ల కుటుంబానికి, రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చన్నారు. కాంగ్రెస్ ఎన్ని డబ్బులు పంచినా.. ఈ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ రెండంకెల మార్కు దాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ 10వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారని తెలిపారు.

చిన్నవానకే 10 గంటలు కరెంట్ పోతదా?

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బుధవారం హైరాబాద్ శివారు దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు చౌరస్తా వద్ద, మెదక్ అభ్యర్థి వెంకట్రామ్ రెడ్డి గెలుపు కాంక్షిస్తూ మెదక్ జిల్లా నర్సాపూర్, పటాన్‌చెరులలో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. నాలుగైదు నెలల్లోనే రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా మారిపోయాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రహ్మాండంగా తాగునీటి సరఫరా చేశామని, ఇప్పుడు నీటి సరఫరా ఎందుకు తగ్గిందని, నీటి ట్యాంకర్లు ఎందుకు తిరుగుతున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలు పడిపోయాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగిపోయిందని, ఐటీ రంగం కుదేలైందని ఆరోపించారు. ఇదంతా సీఎం రేవంత్‌రెడ్డి చలవే అని అన్నారు. చదరపు గజానికి రూ.75 రూపాయలు సీఎంకు కప్పం కడితేనే హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేస్తామని బెదిరిస్తున్నారని, అందుకే ఐదునెలలుగా అనుమతులు నిలిపివేశారని ఆరోపించారు. నిర్మాణ రంగ సంస్థల నుంచి చదరపు అడుగుకు ఇంత అని ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి కప్పం కడుతున్నారని స్వయంగా ప్రధాని మోదీ చెప్పారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తనను తిట్టుడు తప్ప మరో పని సీఎంకు చేతకావడం లేదని విమర్శించారు. తన చెడ్డీ సైతం గుంజుకుంటా అని అన్నారని, అది ఏం చేసుకుంటారో తనకు అర్థం కావడం లేదన్నారు. వరినాట్లు పడకముందే రైతు బంధు ఇవ్వాల్సి ఉండగా, కోతలయ్యాక కూడా ఇంకా పూర్తి స్థాయిలో ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప. ఏ ఒక్కటీ అమలు చేయడంలేదని విమర్శించారు. తెలంగాణ కోసం పేగులు తెగే దాక కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ అని, 12 మంది తమ అభ్యర్థులను గెలిపిస్తే పార్లమెంట్‌లో రాష్ట్ర హక్కుల గురించి కొట్లాడుతారని, నిధులు తీసుకొస్తారని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు రాష్ట్ర ప్రజల కోసం కొట్లాడుతానని, జైళ్లు, కేసులు తనకు కొత్త కాదని, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణను ఆగం చేస్తే సహించబోనని కేసీఆర్ అన్నారు.



మెదక్ జిల్లా నర్సాపూర్ రోడ్ షోలో మాట్లాడుతున్న కేసీఆర్

విశ్వగురువు చేసిందేంటి?

విశ్వగురువు అని చెప్పుకునే ప్రధాని మోదీ అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠ దిగజార్చుతున్నారని కేసీఆర్ ఆరోపించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 84కు పడిపోయిందని, దేశంలో విదేశీ మారక నిల్వలు తగ్గాయని, దిగుమతులు పెరిగాయని, ఎగుమతులు తగ్గాయన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేస్తే అమెరికా నిరసన వ్యక్తం చేసిందని, ఇది దేశ ప్రతిష్ఠకు మంచిది కాదన్నారు. బీజేపీ వాళ్లు ఊదితే కొట్టుకుపోయే పాకిస్తాన్ పేరు చెప్పి రాజకీయ పబ్బ గడుపుకుంటున్నారని ఆరోపించారు. పదేళ్లలో 150 వాగ్దానాలు చేసి ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. మోదీ చెప్పిన అచ్ఛేదిన్ ఏమో కాని మనం సచ్చేదినాలు వచ్చాయన్నారు. ఐటీఐఆర్‌ను మోదీ రద్దు చేశారని, 400 మెగావాట్ల సీలేరు విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను ఆంధ్రకు అప్పగించారని, తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలను తమిళనాడుకు తరలించేందుకు కుట్ర పన్నుతున్నారని, ఇంత అన్యాయం చేస్తున్న బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలో ఆలోచించాలని కేసీఆర్ కోరారు.

సీఎంగా రేవంత్ పనికిరారు

- 12 ఎంపీ సీట్లు ఇస్తే శాసించేది కేసీఆరే
- రాజకీయ కక్షతోనే కవిత అరెస్టు: కేటీఆర్

నాగర్‌కర్నూల్/గద్వాల/సైదాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): "ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసగించిన రేవంత్‌రెడ్డి సీఎంగా పనికి రారు. ప్రజాస్వామ్యయుతమైన పదవిలో ఉండి పేగులు మెడలో వేసుకుంటా.. పొడుస్తా అని మాట్లాడటం ఎంతవరకు సమంజసం. జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి జేబు దొంగలకు తేడా ఏముంది?లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 12 ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి. ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించేది కేసీఆరే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, అచ్చంపేట, జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాలల్లో జరిగిన రోడ్‌షోల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాన్ని నడపడమంటే పాన్ డబ్బా కాదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలన్నారు. పచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు కొల్లగొట్టాలనుకుంటున్న బీజేపీకి తెలంగాణ ప్రజానీకం గట్టిగా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అత్యంత బ్రహ్మాండంగా నిర్మించారని, అయినా తాము దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడగడం లేదన్నారు. పాలనా సౌలభ్యం కోసం చేసిన జిల్లాలను రేవంత్‌రెడ్డి తీసేసి పార్లమెంటుకో జిల్లా పెడుతా అంటున్నారని, అదే జరిగితే జిల్లాలో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, జిల్లా ఆస్పత్రులు పోతాయని పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని డిసెంబరు 9న మాఫీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ప్రమాణాలతో నెట్టుకొస్తున్నారని విమర్శించారు. బీజేపీతో తమ పార్టీకి లోపాయికారి ఒప్పందం ఉన్నదంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు కేటీఆర్ తిప్పికొట్టారు. 'రాజకీయ కక్షసాధింపుతోనే అబద్ధపు మద్యం కుంభకోణం కేసులో తన సోదరి(కవిత)ని అరెస్టు జైల్లో పెట్టారు. ఇలాంటప్పుడు బీజేపీతో మా పార్టీకి ఒప్పందం ఎలా ఉంటుంది? బీజేపీతో మా పార్టీ ఎప్పుడూ పొత్తు పెట్టుకోదు. ఎలాంటి ఒప్పందాలూ చేసుకోదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికం

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిషాంక్ అరెస్టు ప్రజాస్వామికమని, సీఎం రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగంతో తప్పుడు కేసు పెట్టించారని కేటీఆర్ ఆరోపించారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న క్రిశాంక్‌ను బుధవారం కేటీఆర్ పరామర్శించారు. ఓయూలో మెస్ అంశానికి సంబంధించి క్రిశాంక్ పెట్టిన సర్క్యులర్ తప్పైతే తాను చంచల్‌గూడ జైలుకు వెళ్లడానికి సిద్ధమేనని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పెట్టిన సర్క్యులర్ ఫేక్ అని తాము రుజువు చేస్తే ఆయన జైలులో కూర్చుంటారా? అంటూ సవాల్ విసిరారు. తన భర్త చేయని తప్పునకు రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని క్రిశాంక్ భార్య సుహాసిని ఆరోపించారు. జైలులో కేటీఆర్‌తో పాటు ఆమె కూడా క్రిశాంక్‌ను కలిసి మాట్లాడారు.



నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ గాడిదగుడ్డునిచ్చాయి

రాష్ట్రానికి ఆ పార్టీలు చేసిందేమీ లేదు: హరీశ్

సిద్దిపేట టౌన్, మే 8: బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు గాడిద గుడ్డునిచ్చాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆ రెండు పార్టీలు చేసిందేమీ లేదని విమర్శించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని శివానుభవ మండపంలో హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆర్ఎంపీ, పీఎంపీలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలన రివర్స్ గేర్‌లో నడుస్తోందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలయిందని, విద్యుత్ కోతలు మొదలయ్యాయని, ఇంకా పూర్తిస్థాయిలో రైతుబంధు ఇవ్వలేదని.. మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ తెలంగాణకు వచ్చి ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.



వంద శాతం అధికారం పక్కా

గతంలో జగన్‌ను అంచనా వేయలేకపోవడం వైఫల్యమే.. ఏపీని సర్వనాశనం చేశారు.. భయానక వాతావరణం తెచ్చారు



వేధింపులు తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారు.. అతను సైకో అంటే నమ్మలేదు.. ఇప్పుడు అంతా అంటున్నారు

చివరి రక్తపు బొట్టు వరకూ.. ఊపిరి ఉన్నంత వరకూ తెలుగు ప్రజలను ప్రపంచంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే నా అభిలాష

'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' బిగ్ డిబేట్ విత్ ఆర్కేలో చంద్రబాబు

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వంద శాతం అధికారంలోకి వస్తున్నామని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధీమా వ్యక్తం చేశారు. జగన్ గురించి వైఎస్ రాజశేఖర రెడ్డికి తెలుసునని, అందుకే అధికారంలో ఉన్నప్పుడు బెంగళూరు పంపించేశారని, అతనిని అంచనా వేయలేకపోవడం తమ వైఫల్యమేనని అంగీకరించారు. ఏపీని జగన్ సర్వ నాశనం చేశాడని, దానిని పునర్నిర్మించాల్సి ఉందని చెప్పారు. ఏపీ అభివృద్ధికి సహకరిస్తామని మోదీ, అమిత్ షా చెబుతున్నారని తెలిపారు. దేశంలో మోదీకి ప్రత్యామ్నాయం లేదని వ్యాఖ్యానించారు. మోదీ అంటే తనకు గౌరవం, తానంటే ఆయనకు అభిమానం ఉన్నాయని, ప్రత్యేక హోదా విషయంలోనే ఇద్దరం దూరమయ్యామని చెప్పారు. 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ బుధవారం నిర్వహించిన బిగ్ డిబేట్‌లో ఆయన పాల్గొన్నారు. ఆ వివరాలు..

నమస్కారం చంద్రబాబు.. ఎలా ఉన్నారు? ఎండల్లో అలుపెరగని పోరాటం చేస్తున్నారు? యుద్ధ ఫలితం ఎలా ఉండబోతోంది!?

యుద్ధంలో ఉన్నాం. వుయ్ ఆర్ విన్నింగ్, కమ్ బ్యాక్.

ముఖ్యమంత్రి అయ్యాకే అసెంబ్లీలోకి అడుగు పెడతానన్న ప్రతిజ్ఞను నెరవేర్చుకుంటున్నారా?

నూటికి నూరు శాతం. అందులో డౌటే లేదు.

అంత నమ్మకం రావడానికి కారణమేంటి?

45 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నాను. చాలా మంది ముఖ్యమంత్రులను, చాలా రాజకీయ పార్టీలను చూశాను. రాష్ట్రాన్ని ఇంత సర్వనాశనం చేసిన వ్యక్తిని ఎప్పుడూ జీవితంలో చూడలేదు. అసలు ఊహించలేదు. గత చరిత్రలో హిట్లర్, బిన్ లాడెన్, తాలిబన్స్, నార్త్ కొరియా వాళ్ల చేసినట్టు చేశారు.

జగన్‌ను వాళ్ల సరసన చేర్చారా?

ఆ ఐడియాలజీని చూస్తే.. ఏం మిగిలిందిప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో. 25 ఏళ్ల కిందట నేను సీఎం అయినప్పుడు ఒక సిస్టమాటిక్‌గా నాలెడ్జ్ ఎకానమిక్‌ను డ్రైవ్ చేయాలని పూనుకున్నాం. అందుకే ఇవాళ హైదరాబాద్ ఐటీ, ఐటీ ప్రొఫెషనల్స్ ఆల్ ఓవర్ ది వరల్డ్‌లో తెలుగువాళ్లు ఉన్నారు. అలాంటి తెలుగు జాతి అక్కడ మోసపోయి ఇబ్బంది పడుతోంది. ఎవరైనా అడ్డం పడితే వేధిస్తున్నారు.

యుద్ధ రంగంలో శత్రువుపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవడం కూడా అవసరం కదా. 2019కి ముందు జగన్ విషయంలో అవగాహన ఏర్పరచుకోలేకపోయారు. ఆ కారణంగానే కదా మీకు ఈ దుస్థితి.

జగన్ గురించి ఆయన తండ్రి వైఎస్ఆర్‌కు తెలుసు. అందుకే బెంగళూరు పంపించేశారు. కానీ, మేం తక్కువ అంచనా వేశాం. సరిగా అంచనా వేయలేకపోవడం వైఫల్యమే. కానీ ఊహించలేదు.



మొన్న మోదీ ఏపీకి వచ్చినప్పుడు మోదీ గ్యారంటీ, బాబు నాయకత్వం, పవన్ కళ్యాణ్ ఉత్సాహం అనే మూడింటి కలయికతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధికి ఆయన హామీ ఏమైనా ఉందా?

ఏపీలో కరప్షన్, దాదాగిరి విపరీతంగా పెరిగిపోయిందని మోదీ, అమిత్ షా అన్నారు. రాష్ట్రం నష్టపోయిందని, పోలవరం, అమరావతి, పరిశ్రమలను సర్వనాశనం చేశారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కారులో రాష్ట్ర అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని స్పష్టంగా చెప్పారు. కేంద్రం, రాష్ట్రం కలిసి పనిచేసి ఏపీని రివైవ్ చేస్తామని హామీనిచ్చారు.

దేశవ్యాప్తంగా మూడు దశల ఎన్నికలు పూర్తయ్యాయి. ఈ మూడు దశల్లో బీజేపీకి సొంతంగా మెజారిటీ రాదనే అంచనాలు బయట ఉన్నాయి..

ఎవరు, ఏదైనా మాట్లాడొచ్చు. కానీ, దేశంలో మాత్రం ప్రత్యామ్నాయం లేదు. మోదీ మీద నమ్మకముంది. ఆయన పని విధానం దేశం ముందుకెళ్లే విధంగా ఉంది. పదేళ్ల పాలనలో ప్రపంచం మొత్తంలో దేశానికి గుర్తింపు వచ్చింది. స్టేబుల్ సస్టెన్‌బుల్ డెవలప్‌మెంట్ జరుగుతోంది. ప్రపంచం మొత్తం లీడర్‌షిప్ వాక్యూమ్ ఉన్నప్పుడు మోదీ ఒక లీడర్‌గా వచ్చి.. దేశాన్ని ప్రమోట్ చేశాడు.

కేంద్రంలో భాగస్వామ్య పక్షాలతో కూడిన ప్రభుత్వం అనివార్యమైతే.. మీరు కీలకపాత్ర పోషించే అవకాశముందా?

అప్పట్లో ఉమ్మడి ఏపీ ఉండేది. 42 లోక్‌సభ సీట్లున్నాయి. కానీ, ఎప్పుడూ అధికారం కోరుకోలేదు. రాష్ట్రాభివృద్ధి, తెలుగు ప్రజల అభివృద్ధి ముఖ్యమని వ్యవహరించాం. అదే జగన్ అయితే, తనపై ఉన్న కేసులను మాఫీ చేసుకోవడానికి వాడుకుంటాడు.

మీకు ఎక్కడైనా డౌట్ ఉందా.. ఆయన మళ్లీ వస్తాడని.?

ఆయన అధికారంలోకి వస్తాడని నాకు 0000.1 శాతం మేర కూడా అంచనా లేదు. ప్రజలంతా ఫ్రస్టేషన్లో ఉన్నారు. ఉదాహరణకు ఉద్యోగులు. ఒక భయానక వాతావరణం ఉంది. నోరు విప్పరు.. విప్పితే బతకలేరు. కొంతమందిని వేధించి.. వేధించి చివరకు చంపేసిన సందర్భాలున్నాయి. కొంత మంది ఏం చేయాలో తెలియక.. భయంకరమైన రీతిలో ఆత్మహత్యలు చేసుకున్నారు. ఎన్జీవోలు ఈ ఐదేళ్లలో నోరే విప్పలేకపోయారు. జీతాలు తగ్గిస్తూ రివర్స్ పీఆర్సీ వేస్తారేమోనని భయపడుతున్నారు. సూర్యనారాయణ అనే నాయకుడిని జైల్లో ఉంచారు. ఆయన ఢిల్లీకి పారిపోయాడు. మళ్లీ వచ్చి బెయిల్ తీసుకున్నాడు.

తెలంగాణలో వెల్ఫేర్, అభివృద్ధి బాగానే చేశారు. కానీ, జిల్లాల్లో కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటేస్తే... హైదరాబాద్‌లో ప్రభుత్వం బాగుందని ఓటేశారు?

హైదరాబాద్ అభివృద్ధి విషయంలో నా తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులందరికీ ధన్యవాదాలు చెప్పాలి. ఎవరూ నాశనం చేయలేదు. ఏపీలో జగన్ ప్రజావేదికను కూల్చినట్టు ఇక్కడ వైఎస్ అధికారంలోకి రాగానే హైటెక్ సిటీని కూల్చలేదు. ఆ రోజు ఇన్నోవేటివ్‌గా చేశాను. దాన్ని అందరూ కంటిన్యూ చేశారు. ఆరోజు నేను చేసిన పనిని నేను జైల్లో ఉన్నా జ్ఞాపకం పెట్టుకున్నారు. ఇంతకంటే ఇంకేం కావాలి!? మనం చేసేవి గుర్తు పెట్టుకోవాలి. అవే శాశ్వతం. అప్పట్లో హైదరాబాద్‌ను అభివృద్ధి చేయాలనేది నా కోరిక. ఇప్పుడు ఆ ఫలితాలు వచ్చాయి. రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి పథంలో ముందుకెళ్లాలని కోరుకున్నా. దాన్ని వాళ్లు అర్థం చేసుకోలేకపోయారా? నేను చెప్పలేకపోయానా? అనేవి రెండూ జరిగాయి. నా జీవితంలో చివరి రక్తపు బొట్టు ఉన్నంత వరకు, ఊపిరి ఉన్నంతవరకు తెలుగు కమ్యూనిటీని ప్రపంచంలోనే నంబర్‌వన్‌గా తీర్చిదిద్దాలనేది నా అభిలాష. పేదరికంలేని తెలుగు సమాజాన్ని నిర్మించాలి.

జైల్లో అడుగుపెట్టిన క్షణం మీకు ఏమి అనిపించింది?

నా 45 ఏళ్ల కెరీర్‌లో అన్ని విషయాల్లోనూ చాలా జాగ్రత్తలు తీసుకున్నా. ప్రతి ఫైల్‌ను చదివిన తర్వాతే ముందుకెళ్లా. అది నా నేచర్. జగన్‌లాంటి వ్యక్తులు వచ్చినప్పుడు ఊహించని పరిణామాలు జరుగుతుంటాయి. నేను నంద్యాలలో ఉన్నాను. రాత్రి అవుతోంది. పోలీసులు వచ్చి అరెస్టు అని చెప్పారు. ఎందుకోసం అంటే కనీసం చెప్పలేదు. చేయని నేరానికి జైలుకు వెళ్లా. జైల్లో నాకు మంచం లేకుండా, కమోడ్ లేకుండా చేయాలని, సీసీ కెమెరాలు పెట్టి చూసి ఆనందపడాలని, నేను బాధ పడుతుంటే చూసి ఆనందపడాలి అనేలా వ్యవహరించారు. అతని విషపు ఆలోచనలన్నీ అధికారులు మానిటర్ చేశారు. నీచమైన మనస్తత్వంతో రాక్షసానందం పొందడమే కాకుండా వాళ్ల విషపు ఆలోచనల్లో భాగంగా నన్ను ఎలిమినేట్ కూడా చేయాలనుకున్నారు. నేను కూడా ఏది జరిగితే అది జరుగుతుందనుకుని అధైర్యపడకుండా ఉన్నా. వేడి నీళ్లు అడిగితే చల్లనీళ్లు ఇచ్చారు. కుర్చీ కూడా ఇవ్వలేదు. మందులు కూడా ఇవ్వకూడదని జైలు అధికారులపై ఒత్తిడి చేశారు. నా హెల్త్ రిపోర్టును కూడా తారుమారు చేశారు. పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. విష ప్రయోగం చేస్తారనే ప్రచారం జరిగింది. భయం వేసేది. అయినా మనో ధైర్యం కోల్పోకుండా ఉన్నా.

ఉదాహరణకు.. తెలంగాణలో మెజారిటీ మీడియాను కేసీఆర్ లొంగదీసుకున్నారు. ఆయన ఓటమిని ఆపగలిగారా. ఫీల్‌గుడ్ పాలన చేస్తే అధికారం ఉంటుంది.

కేసీఆర్ పదేళ్లు ఉన్నాడు. ఇలాంటివి ఆయన చేయలేదు. ఇంత కక్షపూరితంగా వ్యవహరించలేదు. అందుకే పదేళ్లు ఉన్నాడు. జగన్ అలా కాదు. భార్యను ప్రేమించడు. తల్లిని ప్రేమించడు. పిల్లలను ప్రేమించడు. చివరికి తోబుట్టువులను కూడా ప్రేమించడు. ఆయన తన ఇగోనే ప్రేమిస్తాడు.

నీ అమ్మ మొగుడు అనే కొడాలి నాని వాడే భాషను మీరెందుకు వాడుతున్నారు? మీకెలా సూట్ అవుతుంది?

ఒక దుర్మార్గుడిపై పోరాటం చేయాల్సి వస్తోంది. వాళ్ల బిహేవియర్‌ను చూసి, ఆవేదనతో మాట్లాడాల్సి వస్తోంది. వాళ్లు చేసే పని చూసినప్పుడు ఫ్రస్టేషన్ ఉంటుంది. నాకు జరిగినన్ని అవమానాలు ఈ దేశంలో ఎవరికైనా జరిగాయా?

రాజకీయ వాతావరణం అనుకూలంగా మారినప్పుడు గ్యారెంటీలను, సూపర్ సిక్స్‌లను చూసి ప్రజలు ఓటెయ్యరు కదా?

ఏ రాజకీయ పార్టీకైనా పాజిటివ్, యాంటీ అనే రెండు కోణాలుంటాయి. ఆశ, భయం కూడా ఉంటాయి. ఇప్పుడు జగన్ మీద ప్రజలకు ఆశలు సన్నగిల్లాయి. పాత మేనిఫెస్టోనే మళ్లీ ముందు పెట్టాడు. అంటే.. జగన్ ఏమీ చేయలేక పోతున్నాడన్న అవగాహన ప్రజల్లో ఏర్పడింది. మాకు ఇప్పుడు ఒక హోప్ వచ్చింది. చేస్తామన్న నమ్మకం ఉంది.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందా?

ఒకరి పట్టాదార్ పాస్‌బుక్‌పై జగన్ ఫోటో ఎందుకు? ల్యాండ్ టైట్లింగ్ ఆఫీసర్‌గా ప్రైవేటు వ్యక్తిని నామినేట్ చేస్తున్నారు. ఆయన ద్వారా భూమిని రెగ్యులరైజ్ చేస్తారట. రేపు ఏదైనా భూ సమస్య వస్తే కోర్టుల చుట్టూ తిరగాలి.

ముఖ్యమంత్రిగా మాత్రమే అసెంబ్లీలో అడుగుపెట్టాలనే మీ ప్రతిజ్ఞ నెరవేరాలని కోరుకుంటూ... థాంక్యూ వెరీమచ్!

జైలుకు వెళ్లడం వల్ల మీలో వచ్చిన మార్పు ఏంటి?

ఏ నాయకుడి కోసం పోరాడని విధంగా ప్రజలు నా కోసం పోరాడారు. ఇంతటి అభిమానం, ఆదరణ ఏ నాయకుడికీ దొరకదు. అయితే నాకు జరిగిన సంఘటన రాజకీయాల్లో ఇంకొకరికి జరక్కూడదు. దీని మీద నా కమిట్‌మెంట్ ఏంటంటే.. ఉన్మాద, దౌర్జన్య, నేరపూరిత రాజకీయాలను ప్రక్షాళన చేయాలి. నన్ను నమ్ముకున్న ప్రజానికాన్ని నేను ఆదుకోవాలి. అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ రౌడీయిజం, రాజకీయాల ముసుగులో నేరాలు చేసే వారి తాట తీస్తా.

ప్రభుత్వ అధికారులు కొంతమంది ఉన్మాదులుగా మారారు. రేపు మీరు అధికారంలోకి వస్తే వీరితోనే కదా పని చేయాల్సింది

ఒక ఉదాహరణ చెప్పనా.. జైలుకు వెళ్లిన సమయంలో ఓ అధికారి మారు వేషంలో నా వద్దకు వచ్చారు. వణికి పోతున్నాడు. ఏంటయ్యా అంటే.. సార్ నన్ను చంపేస్తారేమో.. సంతకం చేయకపోతే చంపేస్తారు సార్.. అన్యాయం చేస్తున్నారు సర్.. అన్నాడు. ఏమి చెబితే అది చేయాలి సార్ అన్నాడు. ఇంకో సంఘటనలో.. ఒక అధికారి పెళ్లి పెట్టుకున్నాడు. అప్పుడే ఆయన్ను అరెస్టు చేశారు. కుమార్తె జీవితం నాశనం అవుతుంది. రాజీ పడతావా.. జైలుకు వెళతావా అని ఒత్తిడి చేశారు. 2019 ఎన్నికల్లో జగన్‌ను సైకో అని నేను అంటే చాలా మంది నమ్మలేదు. ఇప్పుడు ప్రతి ఒక్కరూ సైకో అంటున్నారు. మీడియా కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితికి వచ్చింది.

మీ కుటుంబంలో భువనేశ్వరిని అసెంబ్లీ సాక్షిగా అవమానించారు. మీరు మరిచిపోయినా వాళ్ల అమ్మకు జరిగిన అవమానాన్ని లోకేశ్ ఎలా మరిచిపోతారు..?

ఎప్పుడూ బయటికి రాని ఆమె రోడ్డు మీదకు వచ్చింది. 40 ఏళ్లుగా ఆవిడ పని ఆవిడ చేసుకునేది. పట్టుదల వచ్చింది. ఏదో ఒకటి చేయాలనే కసి పెరిగింది.



ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి. పక్కన సునీతా మహేందర్‌రెడ్డి, శ్రీగణేశ్

నువ్వు మాజీవి.. నీ పప్పులు ఉడకవ్!

- గాలివానకు కొట్టుకుపోయిన రాబందులా కేసీఆర్ పరిస్థితి
- పదేళ్లు నియంతలా పాలించి సంపద సర్వం దోచుకున్నారు
- కంటోన్మెంట్ ప్రచారంలో మంత్రి పొంగులేటి

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): 'వెయ్యి గొడ్లను తిన్న రాబందు.. నన్ను ఎవరూ ఏమీ చేయలేరని విర్రవీగి చివరకు ఒక్క గాలి వానకు కొట్టుకుపోయిందన్న చందంగా కేసీఆర్ పరిస్థితి మారింది. తెలంగాణ సమాజం గాలి వానలో ఆయనకు కొట్టుకుపోయి ఐదు నెలలైపోయింది. మళ్లీ ఉద్యమ సెంటిమెంట్ రగిలించి లబ్ధి పొందాలనుకుంటున్నారు. ఇప్పుడు నువ్వు (కేసీఆర్) మాజీవి.. ఆ పప్పులేవీ ఉడకవు' అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. బుధవారం సాయంత్రం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి శ్రీగణేశ్, మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డితో కలసి పాల్గొన్న మంత్రి.. మాజీ సీఎం కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. అధికారం పోగానే కేసీఆర్‌కు ప్రతిపక్షం గుర్తుకొచ్చిందని ఎద్దేవా చేశారు. తెలంగాణ సెంటిమెంటుతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే ఉద్యమ ఆకాంక్షలకు తిలోదకాలిచ్చి పదేళ్లు నియంత పాలన సాగించారని మండిపడ్డారు. 'నేనే రాజు.. నేనే మంత్రి'ని అనే విధంగా పాలన సాగించి తెలంగాణ సంపదను సర్వం దోచుకున్నారని ఆరోపించారు. ఆనాడు ప్రతిపక్షాలను గౌరవించకుండా, గుర్తించకుండా.. వాటి ఉనికే లేకుండా చేశారని ఫైర్ అయ్యారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించి, ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీదేనని చెప్పారు.

సగానికి సగం..

యువ తరంగం!

పార్లమెంటు ఓటర్లలో 50.4 శాతం వీరే

- 18-39 మధ్య వయసు ఓటర్లు 1.67 కోట్లు
- పెద్దపల్లి, పాలమూరుల్లో అత్యధికం
- సికింద్రాబాద్, వరంగల్‌లో అత్యల్పం
- ఓటర్లలో 30-39 మధ్య వయస్కులు ఎక్కువ

నియోజకవర్గాల్లో యువత ఓట్ల తీరు ఇలా..

నియోజకవర్గం	మొత్తం ఓటర్లు	18-39 మధ్య వయసు ఓటర్లు	శాతం
ఆదిలాబాద్	16,50,175	8,76,977	53.14
నిజామాబాద్	17,04,867	8,38,264	49.16
జహీరాబాద్	16,41,410	8,94,758	54.51
పెద్దపల్లి	14,20,606	7,96,808	56.08
కరీంనగర్	17,97,150	8,58,121	47.74
మెదక్	18,28,210	9,59,485	52.48
చేవెళ్ల	29,38,340	15,17,035	51.62
మహబూబ్‌నగర్	16,82,474	9,36,875	55.68
నాగర్‌కర్నూల్	17,38,265	9,38,435	53.98
నల్లగొండ	17,25,490	8,92,192	51.70
భువనగిరి	18,08,595	9,29,340	51.38
మహబూబాబాద్	15,32,382	7,71,375	50.33
ఖమ్మం	16,31,003	8,13,608	49.88
సికింద్రాబాద్	21,20,401	9,84,135	46.41
హైదరాబాద్	22,17,094	11,06,440	49.90
మల్కాజ్‌గిరి	37,79,600	17,90,520	47.37
వరంగల్	18,24,479	8,51,529	46.67

ఎన్నికలు.. ఓటర్లు.. అనగానే పురుషులు ఎంత మంది!? మహిళలు ఎంతమంది అని చూస్తారు కానీ.. మొత్తం ఓటర్లలో యువత సగానికి సగం ఉన్నారని తెలుసా!? యువత తలచుకుంటే ప్రభుత్వాలను తారుమారు చేయగలరని తెలుసా!? లోక్‌సభ ఎన్నికల్లో యువత ఓటింగ్ అత్యంత కీలకం కానుందని తెలుసా!? ఔను.. ఇది నిజం! తెలంగాణలో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 3,32,32,318 మంది ఓటర్లు ఉంటే.. వారిలో 18-39 ఏళ్ల మధ్య వయస్కులైన యువ ఓటర్లు 1,67,51,806 మంది! అంటే, మొత్తం ఓటర్లలో వీరు 50.4 శాతమన్నమాట! అందుకే, అన్ని పార్టీలూ యువతను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డాయి. పార్టీ యూత్ కమిటీ నాయకులను రంగంలోకి దింపి వారు కోరుకునే అంశాలపై దృష్టిసారించి వాటిని వారికి అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలో పెద్దపల్లి, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల్లో అత్యధికంగా యువ ఓటర్లు ఉండగా.. సికింద్రాబాద్, వరంగల్ నియోజక వర్గాల్లో అత్యల్పంగా ఉన్నారు. విశేషం ఏమిటంటే.. రాష్ట్రంలో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో అతి పిన్న వయస్కుడైన గడ్డం వంశీకృష్ణ బరిలో ఉన్న పెద్దపల్లిలోనే యువ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉండడం!! అలాగే, రాష్ట్రంలోనే అత్యధికంగా ఓటర్లు ఉన్న మల్కాజిగిరి నియోజకవర్గంలో యువత సంఖ్య కూడా ఎక్కువే. అయితే, అటు దేశంలోనూ ఇటు రాష్ట్రంలోనూ నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో యువత ఎవరిని ఆదరిస్తుంది!? ఎవరికి ఓటు వేస్తుందన్నది ఆసక్తికరమే!!

- ఆంధ్రజ్యోతి, హైదరాబాద్



యూత్ @14

- పార్లమెంటు ఎన్నికల్లో యువతకు పార్టీల ప్రాధాన్యం
- కాంగ్రెస్ అత్యధికంగా ఎనిమిదిమందికి టికెట్లు
- అతి పెద్ద వయస్కుడు మల్లు రవి అతి పిన్న వయస్కుడు వంశీకృష్ణ

పార్లమెంటు ఎన్నికల్లో ఈసారి పార్టీలు యువతకు ప్రాధాన్యం ఇచ్చాయి. 50 ఏళ్లలోపు వయసున్న 14 మందికి మూడు పార్టీలూ టికెట్లు ఇచ్చాయి. వీటిలో కాంగ్రెస్ అత్యధికంగా ఎనిమిది మందికి; బీజేపీ నలుగురికి; బీఆర్ఎస్ ఇద్దరికి అవకాశం ఇవ్వడం విశేషం. వీరిలోనూ సగానికిపైగా రాజకీయాలకు, ఎన్నికలకు పూర్తిగా కొత్త కూడా! విశేషం ఏమిటంటే.. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అతి పిన్న వయస్కుడు, అతి పెద్ద వయస్కుడు ఇద్దరూ కాంగ్రెస్ పార్టీకి చెందినవారే! అభ్యర్థుల్లో అతి పెద్ద వయస్కుడు 73 ఏళ్ల మల్లు రవి కాగా.. అతి పిన్న వయస్కుడు గడ్డం వంశీకృష్ణ!

అతి పిన్న వయస్కులైన అభ్యర్థులు వీరే

గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్)	35
పోతుగంటి భరత్ ప్రసాద్ (బీజేపీ)	36
నీలం మధు (కాంగ్రెస్)	40
కడియం కావ్య (కాంగ్రెస్)	41
చల్లా వంశీచంద్ (కాంగ్రెస్)	43
రఘువీర్ రెడ్డి (కాంగ్రెస్)	44
మాలోతు కవిత (బీఆర్ఎస్)	45
అర్వింద్ (బీజేపీ)	47
ఆత్రం సుగుణ (కాంగ్రెస్)	48
గాలి అనిల్ కుమార్ (బీఆర్ఎస్)	49
సైదిరెడ్డి (బీజేపీ)	49
కిరణ్ కుమార్ (కాంగ్రెస్)	49
మాధవీలత (బీజేపీ)	49
సునీతా రెడ్డి (కాంగ్రెస్)	49

అతి పెద్ద వయస్కులు

మల్లు రవి (కాంగ్రెస్)	73
పద్మారావు గౌడ్ (బీఆర్ఎస్)	70
జీవన్ రెడ్డి (కాంగ్రెస్)	70
బాజిరెడ్డి గోవర్ధన్ (బీఆర్ఎస్)	70
కాసాని జ్ఞానేశ్వర్ (బీఆర్ఎస్)	69

మొత్తం యువ ఓటర్లు 1,67,51,806

18-19 వారు	9.23 లక్షలు	30-39 వారు	91.22 లక్షలు	50-59 వారు	47.45 లక్షలు	70-79 వారు	14.36 లక్షలు
20-29 వారు	67.10 లక్షలు	40-49 వారు	69.85 లక్షలు	60-69 వారు	28.58 లక్షలు	80 ఏళ్ల పైవాళ్లు	4.47 లక్షలు

నవ్య | చిత్రజ్యోతి

దర్శకుడు సంగీత్ శివన్ ఇక లేరు




మలయాళంలో, హిందీలో పలు హిట్ చిత్రాలు తెరకెక్కించిన సంగీత్ శివన్ (65) ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను ముంబైలోని కోకిలా బెన్ ధీరూబాయ్ ఆస్పత్రిలో చేర్పగా.. బుధవారం గుండెపోటుతో తుది శ్వాస విడిచారని ఆయన సోదరుడు, సినిమాటోగ్రాఫర్ సంతోశ్ శివన్ తెలిపారు. సంగీత్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, దర్శకుడు శివన్(శివశంకరన్ నాయర్) సంతానంలో పెద్ద కుమారుడు సంగీత్ శివన్. 1990లో దర్శకుడిగా మలయాళంలో 'వ్యూహం' చిత్రంతో అరంగేట్రం చేశారు సంగీత్ శివన్. ఆ తర్వాత 1998లో సన్నీ డియోల్, సుస్మితా సేన్ నటించిన 'జోర్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. మలయాళ చిత్రం 'యోధా', బాలీవుడ్ చిత్రం 'అప్నా సప్నా మనీ మనీ' ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ప్రేమకథా చిత్రమిది. గురువారం సాయిపల్లవి పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. నవ్వుతూ ఫోన్ మాట్లాడుతున్న సాయిపల్లవి ఆ పోస్టర్‌లో కనిపించారు. గురువారం ఆమె బర్త్‌డే స్పెషల్ వీడియో విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. నాగచైతన్య ఇందులో జాలరిగా నటిస్తున్నారు. ఆ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు.

సెట్‌లో సెలబ్రేషన్స్



ఒకప్పుడు తన సినిమాను రిలీజ్ చేసేందుకు సపోర్ట్ కోసం వెతుకుతూ ఇబ్బందులు పడిన విజయ్ దేవరకొండ ఇప్పుడు తన సినిమాలను గ్రాండ్‌గా పాన్ ఇండియా రిలీజ్ చేసే స్థాయికి ఎదిగారు. విజయ్ సాగిస్తున్న ఈ జర్నీ యంగ్ టాలెంట్‌ను ఇన్‌స్పైర్ చేస్తోంది. తన సక్సెస్‌తో చాలా మందికి రోల్ మోడల్ అయ్యారు విజయ్. తన పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయనకు అలవాటు. ఈసారి తన పుట్టిన రోజును గురువారం విశాఖలో జరుగుతున్న తాజా చిత్రం షూటింగ్‌లో బర్త్‌డేను సెలబ్రేట్ చేసుకుంటున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇవి కాక మరో రెండు చిత్రాల్లో నటించడానికి విజయ్ దేవరకొండ అంగీకరించారు.

తాతామనవళ్లుగా తండ్రీ కొడుకులు



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ కలసి ఓ సినిమా చేయనున్నారు. ఇందులో వీళ్లిద్దరూ తాతామనవళ్లుగా నటిస్తుండడం విశేషం. కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించే ఈ చిత్రం పేరు 'బ్రహ్మ ఆనందం'. రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాకు నిర్మాత. గౌతమ్ తదుపరి చిత్రం గురించి బ్రహ్మానందం, వెన్నెల కిశోర్ మధ్య జరిగిన ఫన్నీ సంభాషణతో ఓ వీడియో విడుదల చేశారు. కొత్త సినిమాలో నటించడానికి గౌతమ్ అంగీకరించాడనీ వెన్నెల కిశోర్ చెప్పగానే, అందులో తాత పాత్ర పోషించమని కిశోర్, గౌతమ్ బ్రహ్మానందంను అభ్యర్థించడం ఈ వీడియోలో ఉంది. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలకల్ హీరోయిన్లుగా నటించే ఈ వినోద భరిత చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందనీ, డిసెంబర్ 6న విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

ముగ్గురు స్నేహితుల కథ



నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ' ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సత్యదేవ్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ముగ్గురు స్నేహితుల కథ. మంచి జీవితం కోరుకునే ఆ ముగ్గురి కల చెదిరితే వారు ఏం చేశారనేది సినిమా కథాంశం. ఈ సినిమాలో వించిపేట భద్ర అనే క్యారెక్టర్‌లో నటించాను. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఈ రోల్‌ను డిజైన్ చేశారు. ఇందులో లుక్ వేరియేషన్స్ ఉంటాయి, ఆ మేకోవర్ కోసం చాలా కష్టపడ్డాను. సినిమా చూసేటప్పుడు ప్రేక్షకులకు ఈ పాత్రతో ఒక ఎమోషనల్ ట్రావెల్ ఏర్పడుతుంది" అని చెప్పారు.

నాలుగేళ్ల కల



జీవన్ రెడ్డి, అలేఖ్య జంటగా అశ్విన్ కామరాజ్ కొప్పాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వృషభ'. మురళీకృష్ణా రెడ్డి, గడ్డం నవీన్,రాజమౌళి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఉమా శంకర్ నిర్మాత. ఈ సినిమా లిరికల్ సాంగ్, ట్రైలర్ లాంచ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఉమా శంకర్ రెడ్డి మాట్లాడుతూ "నాలుగేళ్ల కల ఈ సినిమా. ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించాను. టీమ్ అంతా ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు" అని చెప్పారు. చిత్ర దర్శకుడు అశ్విన్ కామరాజ్ మాట్లాడుతూ "ఉమా శంకర్ అద్భుతమైన కథ రాసుకొచ్చి నన్ను అప్రోచ్ అయ్యారు. ఈ కాన్సెప్ట్ మీద చాలా హార్డ్‌వర్క్ చేశాం" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: మహేంద్ర నాథ్, డీఓపీ: యుఎస్ విజయ్, సంగీతం: ఎమ్.ఎల్.రాజా, కో ప్రొడ్యూసర్: మల్లికా రెడ్డి.

శింబు థగ్ లైఫ్



సూపర్‌హిట్ చిత్రం 'విక్రమ్' తర్వాత కమల్‌హాసన్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'థగ్ లైఫ్'. మణిరత్నం దర్శకుడు. 'నాయకుడు' తర్వాత ఆయన కమల్‌హాసన్‌తో చేస్తున్న చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో తమిళ హీరో శింబు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ, చిత్రబృందం బుధవారం టీజర్‌ను విడుదల చేసింది. శింబు కారుతో దూసుకొచ్చి తుపాకీ గురిపెట్టిన తీరు ఆకట్టుకుంది. ఆర్ మహేంద్రన్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కే చంద్రన్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

నిట్ సిల్చార్‌లో పీహెచ్‌డీ

సిల్చార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. గ్రూపుల వారీగా(గ్రూప్-ఏ, గ్రూప్-బి) ప్రవేశాల భర్తీని చేపడతారు. గ్రూప్-ఏ అభ్యర్థులు రెగ్యులర్ పరిధిలోకి వస్తారు. వీరికి అన్ని రకాల ఫెలోషిప్‌లు వర్తిస్తాయి. గ్రూప్-బి కేటగిరీ అభ్యర్థులకు ఎలాంటి స్కాలర్‌షిప్‌లు గానీ, ఫెలోషిప్‌లు గానీ వర్తించవు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. గ్రూప్- ఏ అభ్యర్థులకు గేట్/నెట్ స్కోర్‌పై వెయిటేజీ ఇస్తారు.

విభాగాలు

సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, మేనేజ్‌మెంట్ స్టడీస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

అర్హత వివరాలు

విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఇంజనీరింగ్ విభాగాలకు 75 శాతం మార్కులతో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 27న
- **రాత పరీక్ష, ఇంటర్వ్యూలు:** జూలై 22న
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 24న
- **వెబ్‌సైట్:** www.nits.ac.in/

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● గురువారం 9 మే 2024

diksuchi@andhrajyothy.com

ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.... ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ అండ్ టీచింగ్ హాస్పిటల్స్‌లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు 158

పోస్టు: ట్యూటర్

డిపార్ట్‌మెంట్స్: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణత

జీతం: నెలకు రూ.70,000

దరఖాస్తు ఫీజు: ఓసీ అభ్యర్థులకు రూ.1000. బీసీ, ఎస్సీ ఈడబ్ల్యూఎస్, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15

వెబ్‌సైట్: https://apmsrb.ap.gov.in/msrb/

హెచ్‌ఏఎల్‌లో మెడికల్ ఆఫీసర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బెంగళూరు...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈఎన్‌టీ): 1 పోస్టు
2. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఎమర్జెన్సీ మెడిసిన్): 1 పోస్టు
3. సీనియర్ మెడికల్ ఆఫీసర్(మెడిసిన్): 1 పోస్టు
4. మెడికల్ ఆఫీసర్(జనరల్ డ్యూటీ): 1 పోస్టు

వయోపరిమితి: గ్రేడ్-2 పోస్టులకు 35 ఏళ్లు; గ్రేడ్ -3 పోస్టులకు 45 ఏళ్లు మించరాదు.

వేతనం: నెలకు గ్రేడ్-2 పోస్టులకు రూ.40,000-రూ.1,40,000; గ్రేడ్-3 పోస్టులకు రూ.50,000- రూ.1,60,000

దరఖాస్తులకు చివరి తేదీ: మే 13

వెబ్‌సైట్: https://www.halindia. co.in/career



జాబ్ కార్నర్

కర్నూలు 'సిల్వర్ సెట్'



కర్నూలులోని సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్(అటానమస్, కో ఎడ్యుకేషన్)- 'సిల్వర్ సెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీఏ ఆనర్స్, బీకాం ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సులో భాగంగా ఫీల్డ్ ట్రిప్స్, డిజిటల్ అసైన్‌మెంట్స్, ఈ లెర్నింగ్, గ్రూప్ డిస్కషన్స్, గెస్ట్ లెక్చర్స్, కెరీర్ గైడెన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితరాలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది.

ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- బీఏ ఆనర్స్: హిస్టరీ, పొలిటికల్ సైన్స్
- బీకాం ఆనర్స్: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్
- బీఎస్సీ ఆనర్స్: కంప్యూటర్ సైన్స్-మేథ్స్, కంప్యూటర్ సైన్స్-ఫిజిక్స్, మేథ్స్-కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ

సీట్లు: బీఏ, బీకాం ప్రోగ్రామ్‌లో స్పెషలైజేషన్‌కు 20 సీట్లు; బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో మేథ్స్-కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-కంప్యూటర్ సైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లకు ఒక్కోదానిలో 25 సీట్లు మిగిలిన స్పెషలైజేషన్‌లకు ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొనే డిగ్రీ కోర్సును అనుసరించి ఎంపీసీ/బైపీసీ/ఏదేని గ్రూప్‌తో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు; మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో ఇన్‌స్టంట్/సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.600
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4
- అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్: జూన్ 11 నుంచి
- సిల్వర్ సెట్ 2024 తేదీ: జూన్ 16న
- వెబ్‌సైట్: sjgckurnool.edu.in

సిల్వర్ సెట్ 2024 వివరాలు

● దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. డిగ్రీ కోర్సులకు నిర్దేశించిన ప్రకారం మూడు పేపర్లు ఉంటాయి. అదనంగా ఇంగ్లీష్ పేపర్ అందరికీ కామన్‌గా ఉంటుంది. ఏపీ ఇంటర్ సిలబస్ ఆధారంగా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. పేపర్‌కు 25 మార్కులు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 100 నిమిషాలు.

● బీకాం ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్-1(ఎలిమెంట్స్ ఆఫ్ కామర్స్), కామర్స్-2(బుక్ కీపింగ్ అండ్ అకౌంటెన్సీ) సబ్జెక్టుల్లో; బీఏ ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల్లో; బీఎస్సీ ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది.

ఇండియన్ నేవీలో అగ్నివీర్ పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియామకానికి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024 బ్యాచ్‌తో శిక్షణ ఉంటుంది.

పోస్టు: అగ్నివీర్(సీనియర్ సెకండరీ రిక్రూట్- ఎస్ఎస్ఆర్)

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్(10+2)/రెండేళ్ల ఒకేషనల్ కోర్సు లేదా ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమొబైల్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన ఉండాలి.

వయసు: 2003 నవంబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 30 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

కనిష్ఠ ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళలు కనీసం 157 సెం.మీ. ఎత్తు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, స్టేజ్-1(ఇండియన్ నేవీ ఎంట్రెన్స్ టెస్ట్), స్టేజ్-2(రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష-పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ: అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో నవంబరులో శిక్షణ ప్రారంభం అవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరవాత సదరు విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీత భత్యాలు: ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేల వేతనం లభిస్తుంది.

దరఖాస్తు ఫీజు: రూ.550

దరఖాస్తు విధానం: అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభం: మే 13.

చివరి తేదీ: మే 27

శిక్షణ ప్రారంభం: 2024 నవంబరు

వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

నీలిట్‌లో ఎంటెక్

కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, కాలికట్‌లో నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎలక్ట్రానిక్స్ డిజైన్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 18 సీట్లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో అయిదు సీట్లను స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో నాన్ గేట్ అభ్యర్థులకు అకడమిక్ ప్రతిభను అనుసరించి అవకాశాలు కల్పిస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు

ఎలక్ట్రానిక్స్ డిజైన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌కు ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బయోమెడికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్/బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఎలక్ట్రానిక్స్‌లో ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ప్రోగ్రామ్ ఉత్తీర్ణతతో పాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. వీరికి గేట్ స్కోర్ తప్పనిసరి కాదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 12
- **కౌన్సెలింగ్, అడ్మిషన్స్:** జూన్ 24
- **వెబ్‌సైట్:** https://nielit.gov. in/calicut



పరిశోధనలకు జర్మనీ ఫండింగ్

పరిశోధనలకు పట్టం కట్టే సంస్థల స్థానంలో వాటికి ఊతం ఇచ్చే వ్యవస్థలూ ఉన్నాయి. అలాంటి వాటిలో 'ద మాక్స్ ప్లాంక్ సొసైటీ' ఒకటి. జర్మనీకి చెందిన ఈ సంస్థకు వంద సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. ఇండియాతో ఇరవై సంవత్సరాల అనుబంధం ఉంది. మంచి వర్కింగ్ కండిషన్స్‌కు తోడు అవసరమైన సిబ్బంది ఎంపికలో స్వేచ్ఛనిస్తున్న ఈ సంస్థ పరిశోధనలను కొత్త పుంతలు తొక్కిస్తోంది అంటే అతిశయోక్తి కాదు.

ద మాక్స్ ప్లాంక్ సొసైటీలో 31 మంది నోబెల్ గ్రహీతలు, పలువురు శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరికి తోడు ప్రపంచంలోనే ప్రసిద్ధ పరిశోధన సంస్థలతో భాగస్వామ్యం ఉంది. విశిష్ట పరిశోధనలను నిర్వహించే స్థాయిలో అలరారుతోంది. సంస్థకు చెందినవి, ఇతరత్రా కలిపి దీని గొడుగు కింద 84 ఉన్నాయి. నేచురల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లో పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. పలు దేశాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టొరల్ పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 1400 మంది విజిటింగ్ శాస్త్రవేత్తలు ఉన్నారు. ఇండియా నుంచి కూడా గుర్తించదగ్గ సంఖ్యలో శాస్త్రవేత్తలు ఈ పరిశోధనల్లో పాల్గొంటున్నారు.



ఈ సంస్థ పరిధిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలకు తోడు ఇండియాలోని రీసెర్చ్ ఆర్గనైజేషన్స్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనే వీలు ఇక్కడ పరిశోధనలు కొనసాగించే రీసెర్చర్లకు ఉంటుంది. ఉమ్మడి యత్నాల్లో భాగంగా 85 వరకు పార్టనర్ గ్రూప్స్ ప్రపంచవ్యాప్తంగా దీనికి ఏర్పడ్డాయి. శాస్త్రీయ సంస్థలే కాకుండా సైంటిఫిక్‌గా ఎదగిన దేశాలు కూడా ఈ గ్రూపులో జతకట్టి ఉన్నాయి. తద్వారా పరిశోధనలను మరింత పటిష్ఠపర్చడం, అంతర్జాతీయ స్థాయిలో నెట్‌వర్క్‌ను నెలకొల్పటం ఈ చర్యలోని ప్రధాన ఉద్దేశం. అలాగే భాగస్వామ్యంలో ఉన్న గ్రూపులు విదేశాల్లో సంస్థలను పెట్టుకోవచ్చు. అదే సమయంలో మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ రెసిడెన్సీ ఉండాలి. తద్వారా పోస్ట్ డాక్టొరల్ అభ్యర్థులు తమ సొంత దేశంలో అత్యున్నత పరికరాలతో ప్రయోగశాలను సమకూర్చుకోవచ్చు. అలా తమకు నచ్చిన సబ్జెక్టుల్లో పరిశోధనలను కొనసాగించవచ్చు. పార్టనర్ గ్రూప్స్ నెలకొల్పుకొనే ఇలాంటి వాటి వ్యవధి అయిదేళ్లకు మించకూడదు.

మన దేశంలో

పార్టనర్ గ్రూప్ మరీ ముఖ్యంగా ఇండియాలో విజయవంతమైంది. ఈ ప్రోగ్రామ్ మనదేశానికి పరిచయమైన తరవాత 85 మంది ఇండియన్ సైంటిస్టులు ఈ అవార్డును పొందారు. మరేదేశంలో లేని విధంగా ఇండియాలో ఇందుకు సంబంధించి ఇరవయ్యో వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఫలితంగా మేధావలసకు బదులు మేధాపరంగా సర్క్యులేషన్‌కు వీలుపడుతోంది.

మాక్స్ ప్లాంక్ సంస్థల్లో నాలుగువేల మంది యువ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను కొనసాగిస్తున్నారు. వారిలో మూడోవంతు మంది ఇంటర్నేషనల్ మ్యాక్స్ ప్లాంక్ రీసెర్చ్ స్కూల్(ఐఎంపీఆర్ఎస్)లో భాగస్వాములు. ఈ స్కూల్స్, సెంటర్స్ పరిధిలోనే పలువురు పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఐఎంపీఆర్ఎస్ పూర్తిగా ప్రాంతీయ ఫోకస్ అంటే లోకల్ యూనివర్సిటీలు, రీసెర్చ్ సంస్థలతో కలిగి ఉంటుంది. పద్ధతిగా రూపొందించిన గ్రాడ్యుయేట్ శిక్షణకు అవకాశం కల్పిస్తుంది. ఒక్క జర్మనీలోనే 50 మంది పార్టనర్స్‌తో కలిసి అత్యున్నత స్థాయిలో పీహెచ్‌డీ చేసే వ్యక్తులకు తోడ్పాటును అందిస్తోంది. ప్రతి స్కూల్ యూనిట్‌లో బెస్ట్ స్కాలర్స్ ఉంటారు. వారే పరిశోధకులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. జర్మనీ అలాగే ప్రపంచవ్యాప్తంగా యూనివర్సిటీలు, వర్సిటీయేతర పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తుంటారు.

కాగ్నిషన్, మేటర్ ఆఫ్ లైఫ్, ఫొటానిక్స్‌లో మాక్స్ ప్లాంక్ స్కూల్స్ ఉన్నాయి. కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, లా, క్వాంటమ్ మెటీరియల్స్‌లో 2018లో గ్రాడ్యుయేట్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేకించి కేంద్రీకృత దరఖాస్తు విధానం లేదు. ఏడాది పొడుగునా సంబంధిత డాక్టొరల్ ప్రకటనలు వస్తూ ఉంటాయి. సాధారణంగా సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ఆరంభమవుతుంది. సెంట్రల్ అప్లికెంట్ పోర్టల్ ద్వారా పనులన్నీ జరుగుతుంటాయి. డాక్టొరల్ విద్యార్థులకు గ్రాంట్ మంజూరవుతుంది. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్ ఉంటుంది. ఈ సొసైటీ ఇప్పటి వరకు 35 మంది డాక్టొరల్ అభ్యర్థులకు 'ఒట్టో హాన్ మెడల్'ను సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్‌కుగాను ప్రకటించింది.

ఫండింగ్

ఎంపీజీలో డాక్టొరల్ విద్యార్థులకు ఫండింగ్ కాంటాక్ట్‌ల ద్వారా రీసెర్చ్ విద్యార్థులకు నిధులు సమకూరుస్తారు. సైంటిఫిక్ ఫ్రీడమ్, సోషల్ సెక్యూరిటీ కలగలిసిన కాంట్రాక్ట్‌లు ఇవి. వర్కింగ్ టైమ్ వారానికి 39 గంటలు. కలెక్టివ్ వేజ్ అగ్రిమెంట్ కింద కనీసం 2700 యూరోలు చెల్లిస్తారు. సబ్జెక్టు, చేపట్టిన పరిశోధనను అనుసరించి వార్షిక బోనస్‌ను కూడా నిర్ణయిస్తారు. ఈ కాంట్రాక్ట్ కాలవ్యవధి మూడేళ్లు, ఒక ఏడాది వరకు పొడిగింపునకు అవకాశం ఉంటుంది. డాక్టరేట్ ఫ్రేమ్ వర్క్‌లోనే విదేశీ పర్యటనలు ఉంటాయి. అందుకు ఫండింగ్ సపోర్ట్ ఉంటుంది.

సైంటిఫిక్ కెరీర్‌కు ఆలంబనగా మాక్స్ ప్లాంక్ ఇండియా మొబిలిటీ గ్రాంట్ ఉంటుంది. మేక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పని చేసేందుకు వీలు కల్పిస్తుంది. డాక్టరేట్ ఫైనల్ ఇయర్ లేదంటే డాక్టరేట్ పొంది పదేళ్లు కూడా కాని వారు నామినీలుగా ఉండాలి. అలాగే సంస్థలకు అయిదు వేల యూరోలు ఇస్తారు. ఇండియన్ సైంటిస్టులకు అయ్యే ట్రావెల్ ఖర్చులు తదితరాలకు ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. అలాగే ఈ గ్రాంట్ పొందిన ఇండియన్ సైంటిస్టులు మూడేళ్ల కాలంలో వరుసగా సంవత్సరానికి ఒక నెల వీటిలో పనిచేయాలి. అలాగే ఈ సంస్థ నిధులు పొందుతున్న అభ్యర్థులు ఇండియన్ రీసెర్చ్ సంస్థలో భాగస్వాములై ఉండాలి.



లిటిల్‌ఫ్

ముంగిస విధేయత

ఒక ఊరిలో గోపాల్, మాధురి అనే జంట ఉండేది. వారికి ఓ కొడుకు పుట్టాడు. అతని పేరు శంకర్. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. గోపాల్ వ్యవసాయం చేస్తాడు. ప్రతి రోజూ చేనుకు వెళ్లేవాడు. ఉదయాన్నే చద్దన్నం కట్టించేది గోపాల్ భార్య. విచిత్రంగా వారింటికి ఒక రోజు ముంగిస వచ్చింది. సాధారణంగా ముంగిసను ఎవరైనా తరిమికొడతారు. శంకర్ చిన్న పిల్లవాడు దాని దగ్గరకు వెళ్లాడు. అదీ ఏమనలేదు. దీంతో శంకర్, ముంగిస స్నేహితులయ్యారు.

'కుక్కపిల్లతోనో, పిల్లితోనో ఆడుకోవాలి కానీ.. ఈ ముంగిస ఏంటీ?' అని పక్కింటి జనాలు అన్నారు. అయితే శంకర్ పట్టించుకోలేదు. ఆ ముంగిస ప్రతిరోజు ఇంట్లో వచ్చి కూర్చునేది. ఆహారం తినేది. ఒక రోజు యధావిధిగా గోపాల్ చేనుకు వెళ్తూ ఆలస్యంగా వస్తానని వెళ్లాడు. తన భార్య సరేనంది. మాధురి పక్క ఇంటిలో గాజుల వ్యాపారం చేసే ఆమె వస్తే అక్కడికి వెళ్లిపోయింది. పిల్లవాడిని ఊయలలో ఉంచి వెళ్లింది. ఆ ముంగిస ఇంట్లోనే కాపలా ఉంది. మాధురి పక్కింటికి వెళ్లి గాజులు తొడుక్కుని ఇంటికి వచ్చింది.



వచ్చి చూడగానే పిల్లవాడి ఊయల ముందు రక్తం. కచ్చితంగా ఇది ముంగిస పనే అనుకుంది మాధురి. పిల్లవాడిని చంపేసిందే అంటూ గట్టిగా అరిచింది. క్షణాల్లో కోపంతో కట్టె తీసుకుని ముంగిసను బాదింది. అది అక్కడికక్కడే రక్తం కక్కుకుని చచ్చింది. ఆలస్యంగా వస్తానన్న తన భర్త అప్పుడే ఇంటికి వచ్చాడు. ఏమైందని అడిగాడు. 'మన పిల్లవాడు లేడు. ఆ దొంగ ముంగిస కొరికేసింది. చచ్చిపోయాడు' అంటూ దీర్ఘాలు తీసింది. గోపాల్ చేతిలో కట్టె ఉంది. అలానే ముందుకు వెళ్లాడు. ఊయల వెనకాల ఓ పాము చచ్చిపడి ఉంది. ఊయల్లో శంకర్ హాయిగా నిద్రపోతున్నాడు. గోపాల్‌కి తన ప్రాణాలు తిరిగి వచ్చాయని అనిపించింది.

తన భార్యను పిలిచాడు. అసలే మనది ఊరి చివరి ఇల్లు. ఒక పాము వస్తే.. దాంతో ఈ ముంగిస పోరాడింది. పామును చంపేసింది. 'నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు. విధేయతతో ఉండే ముంగిసను చంపేశావెందుకూ? నీకు మతి ఉందా?' అంటూ తిట్టడం మొదలెట్టాడు గోపాల్. 'ఒక పని చేసేముందు ఆలోచించకపోతే ఎలా? పిల్లవాడిని ఈ ముంగిస కాపాడింది. ఇంతటి విధేయత గల దీన్ని చంపేయటానికి మనసెలా వచ్చింది?' అంటూ అరిచాడు. తన భార్య జరిగిన తప్పుకు బాధపడింది. ఆ తర్వాత ఆ రైతు కూడా బాధపడ్డాడు.


సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 302

			3					
		7		1	8	5		
	1						9	8
7					9		4	
	9	4	7		5	8	1	
	8		1					7
6	4						5	
		2	4	8		3		
					1			

సుడోకు - 301 సమాధానం

5	4	3	9	8	1	2	6	7
7	8	1	6	2	3	5	9	4
2	6	9	5	4	7	1	8	3
8	2	5	4	7	9	6	3	1
1	7	4	3	6	5	8	2	9
9	3	6	2	1	8	4	7	5
3	9	2	1	5	6	7	4	8
6	5	8	7	9	4	3	1	2
4	1	7	8	3	2	9	5	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.